www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 200 | మంగళవారం | 9 జనవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



15వ ఆర్థిక సంఘంపై రాష్ట్రం ఆశలు

- కొత్త ఫైనాన్స్ కమిషన్ వల్ల మన వాటా మరింత పెరుగుతుందన్న సిఎస్

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రధాన కార్యదర్శి ఎస్‌పి సింగ్ అధ్యక్షతన అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సచివాలయంలో సోమవారం సమీక్షా సమావేశం జరిగింది. ఏడు అంశాల ఎజెండాలో ప్రధానంగా 15వ ఆర్థిక సంఘానికి తరువాయి 6లో

ఎన్ని తాండా పంచాయతీలు?

కొత్త పంచాయతీ చట్టంపై మంత్రివర్గ ఉపసంఘం చర్చ

నేడు కూడా సమావేశం

మన తెలంగాణ / హైదరాబాద్ : పంచాయతీరాజ్ చట్టానికి చేయాల్సిన సవరణలు, బిల్లు రూపకల్పనపై ఆ శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు సుదీర్ఘంగా చర్చించింది. అనేక అంశాలను చర్చించిన ఈ సమావేశం మంగళవారం కూడా కొనసాగనుంది. సమావేశం అనంతరం మంత్రి జూపల్లి మీడియాతో మాట్లాడుతూ, పంచాయతీలను బలోపేతం చేయడమే లక్ష్యంగా చట్టానికి సవరణలు చేసి కొత్త చట్టం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందని, అందులో భాగంగానే మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు, ఇప్పుడు జరిగిన తొలి సమావేశంలో పలు అంశాలపై లోతుగా చర్చించామన్నారు. గ్రామాల రూపురేఖలను మార్చేలా, మహాత్మాగాంధీ కలలుగన్న 'గ్రామ స్వరాజ్యం'ను సాకారం చేసేలా చట్టానికి రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. సర్పంచ్‌లకు విస్తృత తరువాయి 6లో

రైతుకు చేర్చేదెలా?

పెట్టుబడి సాయాన్ని అందించే మార్గంపై మంత్రివర్గ ఉపసంఘం తొలి భేటీలో చర్చ

బ్యాంకుల ద్వారానా, పోస్టాఫీసులా, ప్రత్యక్ష నగదు చెల్లింపా అనే అంశాలపై తర్జనభర్జన

బుధవారం నాటికల్లా స్పష్టత, నేడు బ్యాంకర్లతో సమావేశం



మన తెలంగాణ / హైదరాబాద్ : రైతాంగానికి పెట్టుబడిగా ఇచ్చే ఎనిమిది వేల రూపాయలను ఏ విధంగా పంపిణీ చేయాలో ప్రభుత్వం ఇంకా ఒక నిర్ణయానికి రాలేదు. వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సోమవారం సచివాలయంలో భేటీ అయింది. ప్రభుత్వం ఆశిస్తున్న లక్ష్యం నెరవేరాలంటే రైతులకు ఈ ఆర్థిక సాయాన్ని ఏ విధంగా అందించాలన్న దానిపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. ప్రభుత్వం ఈ ఆర్థిక సాయాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో వేస్తే పాత బకాయిల కింద మినహాయించుకుంటారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, దీనికి ఎలాంటి పరిష్కారం చూపుతారని సమావేశంలో పాల్గొన్న బ్యాంకు అధికారులను తరువాయి 6లో

త్వరలో కాంగ్రెస్ బస్సు యాత్ర

- పిసిసి అధ్యక్షుడిగా కొనసాగింపు తరువాత గాంధీభవన్‌కు వచ్చిన ఉత్తమ్ ప్రకటన

మన తెలంగాణ/ హైదరాబాద్ : త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బస్సు యాత్ర నిర్వహించబోతున్నట్లు టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రోజుకు మూడు నియోజకవర్గాల చొప్పున 40 రోజుల్లో మొత్తం 119 నియోజకవర్గాల్లో సాగే ఈ యాత్రలో రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నాయకులంతా తరువాయి 6లో



సినిమా హాళ్లలో జాతీయగీతంపై కేంద్రం పునరాలోచన

ఆలాపన సమయంలో నిల్చోవడం తప్పనిసరి చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను నిలిపివేయాలని సుప్రీంకోర్టుకు వినతి

న్యూఢిల్లీ : సినిమా థియేటర్లలో జాతీయ గీతాన్ని కచ్చితంగా ఆలపించాలనే నిర్ణయంపై కేంద్రం వెనక్కి తగ్గింది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టుకు తెలియజేసింది. కేంద్ర హోంశాఖ అండర్ సెక్రెటరీ దీపక్ కుమార్ ప్రభుత్వం తరపున సుప్రీంలో అఫిడవిట్ దాఖలు చేశారు. కొత్త మార్గదర్శకాలను రూపొందించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నామని.. ఆరు నెలల వ్యవధిలో ఈ విషయమై తుది నిర్ణయం తీసుకుంటామని సుప్రీం కోర్టుకు తెలిపారు. చీఫ్ జస్టిస్ తరువాయి 6లో



యజమానులవ్వండి

మీరే ఉద్యోగాలివ్వండి : యువతకు కెటిఆర్ ఉద్బోధ

మూడేళ్లలో రాష్ట్రంలో ఐటి దూసుకు పోయింది, ఎగుమతులు భారీగా పెరిగాయి, లక్ష మందికి కొలువులొచ్చాయని వెల్లడి

మన తెలంగాణ / హైదరాబాద్ : ఆర్థిక వృద్ధి రేటులో దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా ఎదిగిన తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలోనూ ఇతర రాష్ట్రాలకంటే వేగంగా దూసుకుపోతూ ఉన్నదని మంత్రి కెటిఆర్ వ్యాఖ్యానించారు. కరీంనగర్‌లో ఐటి టవర్‌కు సోమవారం ఆయన శంకుస్థాపన చేసిన సందర్భంగా యువతనుద్దేశించి ప్రసంగిస్తూ, తెలంగాణ ఏర్పడే తరువాయి 6లో

చైన్ స్నాచర్లుగా ఇంజినీరింగ్ విద్యార్థులు

నలుగురిని అరెస్టు చేసి గొలుసులు స్వాధీనం చేసుకున్న పోలీసులు

మన తెలంగాణ/ హైదరాబాద్/ మాదాపూర్ : ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసుకొని గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థులను అరెస్ట్ చేశామని రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్ తెలిపారు. సోమవారం గచ్చిబౌలి కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. వరంగల్ జిల్లా భూపాలపల్లి మండలం, హనుమన్ నగర్‌కు చెందిన సురేష్ 21 బిటెక్ మొదటి సంవత్సరం చదువుతూ తరువాయి 6లో



6 నెలల్లో తుమ్మిళ్ల

గద్వాలజిల్లా నడిగడ్డ రైతుల కల నెరవేరుతోంది

- ఆర్‌డిఎస్ రైతుల కష్టాలు చూసిన కెసిఆర్ వల్లే సాధ్యమవుతున్నది
- ఎత్తిపోతల శంకుస్థాపన సందర్భంగా మంత్రి హరీశ్

మన తెలంగాణ/ రాజోళి : నడిగడ్డ రైతుల చిరకాల వాంఛ సాకారమవుతున్న వేళ. జోగుళాంబ గద్వాల జిల్లాలోని నడిగడ్డ రైతుల దశాబ్దాల కల నెరవేరబోతుంది. అర్‌డిఎస్ రైతుల కష్టాలను కళ్ళారా చూసిన కెసిఆర్.. ముఖ్యమంత్రి కావడం వల్లే సాధ్యమైందని నీటిపారుదల శాఖమంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. జోగుళాంబ జిల్లా అలంపూర్ నియోజకవర్గం తరువాయి 6లో



స్వలింగ సంపర్కం చట్టబద్ధతపై పునఃపరిశీలన

గత తీర్పును తిరగదోడేందుకు సుప్రీం అంగీకారం 10 లో

రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం

జోగుళాంబ గద్వాల జిల్లాలో దుర్ఘటన 2 లో

ప్రదీప్ పశ్చాత్తాపం

ఇంకెప్పుడూ తాగి డ్రైవ్ చేయను

- గోషామహల్ ట్రాఫిక్ పోలీసులు మంచి కౌన్సెలింగ్ ఇచ్చారు
- టివి యాంకర్ ప్రదీప్



మన తెలంగాణ/ హైదరాబాద్: మద్యపానం ఆరోగ్యానికి హానికరమని, ఇక ఎప్పుడూ మద్యం సేవించి వాహనాన్ని నడపనని టివి యాంకర్ ప్రదీప్ స్పష్టం చేశారు. కొత్త సంవత్సరం సందర్భంగా మద్యం సేవించి వాహనం నడుపుతూ డిసెంబరు 31 అర్ధరాత్రి పట్టుబడ్డ ప్రదీప్ ఎట్టకేలకు వారం రోజుల తర్వాత గోషామహల్ ట్రాఫిక్ పోలీసు శిక్షణ కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం కౌన్సెలింగ్‌కు తన తండ్రితో కలిసి హాజరయ్యారు. కౌన్సెలింగ్ అనంతరం ప్రదీప్ మీడియాతో మాట్లాడుతూ తాను ఇంతకాలం కౌన్సెలింగ్‌కు రాలేదంటూ మీడియాలో వార్తలు గుప్పుమన్నాయని, అయితే తనకు వరుస షూటింగ్‌లు ఉండడం వల్లనే ఇప్పటి వరకు హాజరుకాలేకపోయానని స్పష్టం చేశారు. కౌన్సెలింగ్‌కు రావాల్సిందిగా ట్రాఫిక్ పోలీసుల నుంచి సోమవారం కూడా తనకు సమాచారం వచ్చిందన్నారు. వారి సూచనపై గౌరవంతోనే కౌన్సెలింగ్‌కు హాజరయ్యానని, ఇక్కడ అధికారులు చెప్పే విషయాలన్నింటినీ శ్రద్ధగా విన్నానని పేర్కొన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో జరిగే అనార్థాలపై చాలా కొత్త విషయాలను తెలుసుకున్నానన్నారు. మద్యం సేవించి డ్రైవ్ ఎందుకు చేయకూడదనే విషయాలతో పాటు తీవ్రత, అనర్థాలపై కౌన్సెలింగ్‌లో పోలీసులు చాలా చక్కటి వివరణ ఇచ్చారని చెప్పారు. తాను ఇంకెప్పుడూ తాగి డ్రైవింగ్ చేయనని స్పష్టం చేశారు. ఈ కౌన్సెలింగ్ తరువాయి 6లో

కుంచెపోటు



మన దగ్గరేముందిలే దోచుకోవడాని కనుకున్నా.. ఇదొకటుందన్న మాట..!

తల్లకిందుల శిక్ష

- అల్లరి చేశారని విద్యార్థుల చేత శీర్షాసనం వేయించిన జహీరాబాద్ ఎస్‌టి హాస్టల్ వార్డెన్
- స్వయంగా వచ్చి వివరాలు తెలుసుకున్న పైఅధికారులు

మన తెలంగాణ/ జహీరాబాద్ : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని ఎస్‌టి వసతి గృహం వార్డెన్ విద్యార్థుల చేత శీర్షాసనం వేయించి తల్లకిందుల జపం చేయిస్తున్నాడు. ఈ వసతి గృహంలో వివిధ ప్రాంతాలకు చెందిన 250 మంది విద్యార్థులున్నారు. మండలంలోని శేకాపూర్ గ్రామానికి తరువాయి 6లో





సంగీత నిరశన

రాజకీయ పెద్దలూ మోసం చేశారని ఆరోపణ

- బిడ్డ కోసం చావడానికైనా సిద్ధం
- 50 రోజులుగా అత్తవారింటి ముందు చేసిన నిరసన దీక్ష నిష్ఫలమైందని ఆవేదన

మన తెలంగాణ/ హైదరాబాద్/బోడుప్పల్ : అత్తింటి నుంచి న్యాయం కావాలని డిమాండ్ చేస్తూ 51 రోజులుగా నిరసన చేపట్టిన పులకండ్ల సంగీత సోమవారం నిరాహార దీక్షకు దిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవంబర్ 19 నుండి న్యాయం కావాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా అత్తంటి ముందు దీక్ష తరువాయి 6లో

పశ్చిమ బెంగాల్‌లో బిజెపికి షాక్

కోల్‌కతా: నోపరా శాసనసభ నియోజకవర్గానికి జరుగనున్న ఉప ఎన్నికలో పోటీ చేసేందుకు ఇచ్చిన ఆఫర్‌ను తిరస్కరిస్తున్నట్టు టిఎంసి మాజీ ఎంఎల్‌ఎ మంజు బసు ప్రకటించడంతో బిజెపి పశ్చిమ బెంగాల్ శాఖ విస్తుపోయింది. ఈ ఎన్నికల్లో బిజెపి తరపున మంజు బసు పోటీ చేస్తారని సోమవారం సాయంత్రం బిజెపి కేంద్ర నాయకత్వం ప్రకటించింది. అయితే జరిగిన కొన్ని గంటల అనంతరం మంగళవారం తాను టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీకి నమ్మిన బంటునని, తాను టిఎంసితో ఉంటానని, మమతపై తనకు పూర్తి విశ్వాసం ఉందని బసు ప్రకటించారు. తన సభ్యత్వాన్ని నమోదు చేసుకునేందుకు పార్టీ టోల్‌ఫ్రీ నెంబర్‌కు మిస్స్‌డ్ కాల్ ఇచ్చారని బిజెపి వర్గాలు పేర్కొన్నాయి. అయితే, బిజెపిలో ఆమె చేరికపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. నోపరాకు గతంలో రెండుసార్లు ఎంఎల్‌ఏగా ప్రాతినిధ్యం వహించిన బసు మాట్లాడుతూ బిజెపి ఆఫర్‌ను తాను తిరస్కరించడం లేదని తన వ్యక్తిగత విషయమని చెప్పారు. 'మీరు వివిధ పార్టీల నుంచి అనేక అవకాశాలు వస్తుంటాయి. వాటిని స్వీకరించడమా? తిరస్కరించడమా అనేది వ్యక్తిగత విషయం' అని బసు పేర్కొన్నారు. కాగా, బసు టిఎంసి వత్తిడి, బెదిరింపుల కారణంగానే వెనకడుగు వేశారని బిజెపి ప్రధాన కార్యదర్శి సాయంతన్ పేర్కొన్నారు.



సర్పంచులపై సిఎం యుద్ధం : బిజెపి

మన తెలంగాణ/హైదరాబాద్: సర్పంచ్ వ్యవస్థను చిన్నాభిన్నం చేసి, వారి హక్కుల హరించేందుకు సిఎం కెసిఆర్ ప్రయత్నాలు చేస్తున్నారని బిజెపి అధికార ప్రతినిధి కృష్ణ సాగర్‌రావు ఆరోపించారు. పంచాయతీరాజ్ చట్టానికి సవరణలపై కెసిఆర్ ప్రభుత్వం ఇచ్చిన లీకులు నిజమైతే వాటిని తీవ్రంగా మేం తీవ్రంగా వ్యతిరేకిస్తామని, ఈ అంశంపై తాను వ్యక్తిగతంగా సుప్రీం కోర్టుకు వెళ్లి అడ్డుకుంటానని చెప్పారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ స్వరాజ్యం స్ఫూర్తిని చిన్నాభిన్నం చేసే కుట్ర జరుగుతుందని, కేంద్ర నిధులు నేరుగా పంచాయతీలకు రావడం సిఎం తట్టుకోలేకపోతున్నారని కృష్ణ సాగర్‌రావు ఆరోపించారు. సర్పంచులకు అధికారాలు ఎందుకు తగించాలనుకుంటున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఈ విషయమై సర్పంచులంతా పోరాడటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కెసిఆర్ ప్రభుత్వ ప్రతిపాదనలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని, ఈ సవరణలు ఆమోదం పొందకుండా బిజెపి అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. పార్టీలో నుంచి ఎవరు వెళ్లిపోయినా పార్టీకి నష్టమేమీ లేదని ఆయన విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. నాయకుల కోసం పార్టీ పనిచేయదని, దేశం కోసం మాత్రమే పనిచేస్తుందన్నారు.

తుది దశకు 'కాళేశ్వరం' అనుమతులు

మన తెలంగాణ/హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు అనుమతుల ప్రక్రియ తుది దశకు చేరింది. చివరగా టిఏసి (టెక్నికల్ అడ్వైజరీ కమిటీ) అనుమతిని కేంద్ర జల సంఘం ఇస్తుంది. దీనికి ముందు క్షేత్రస్థాయిలో కేంద్ర జల సంఘం అధికారులు పనులను పరిశీలిస్తారు. సోమవారం నాడు కేంద్ర జల సంఘం అధికారులు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాల్లో పర్యటించారు. కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజినీర్ సిజె దాస్, డైరెక్టర్లు రాజ్‌కుమార్, ముఖర్జీ, ఎన్ఎన్ రాజ్ తదితరులు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, కన్నెపల్లి పంప్‌హౌజ్ నిర్మాణ ప్రాంతాల్లో పనులు, నది ప్రవహిస్తున్న తీరును పరిశీలించారు. తమ అనుమానాలను ఇంజనీర్ ఇన్ చీఫ్ సి.మురళీధర్, చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లుతో మాట్లాడి నివృత్తి చేసుకున్నారు. మంగళవారం నాడు ఎల్లంపల్లి నుంచి ప్రారంభమయ్యే ప్యాకేజీ 6, 8, 10 , 11, 12లను కేంద్ర జలసంఘం బృందం పరిశీలిస్తుంది. బ్యారేజీలు, పంపుహౌస్‌ల పనులు మూడు పూటలా జరుగుతున్న తీరుపై సిడబ్ల్యుసి అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కొంత వేగంగా జరుగుతున్న విషయాన్ని ఊహించామని, కానీ ఊహించినదానికన్నా రెట్టింపు వేగంతో పనులు జరుగుతున్నాయని వారు తమ అభిప్రాయాన్ని అధికారులతో పంచుకున్నారు.

ఇక మూడు అనుమతులే..

కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇప్పటికే కీలకమైన అనుమతులన్నీ లభించాయి. కేవలం మూడు మాత్రమే మిగిలాయి. ఆ మూడు వస్తే జాతీయ హోదా కోసం అడగాలన్నది ప్రభుత్వ యోచన. అటవీ, పర్యావరణ, హైడ్రాలజీ, ఇంటర్ స్టేట్ అనుమతులు కేవలం నెల రోజుల్లో సాధించారు. జల సంఘం బృందం ఢిల్లీకి వెళ్లి పనుల తీరుపై తమ నివేదికను ఇస్తారు. ఈ నివేదిక ఆధారంగా తుది టిఏసి అనుమతులు ఆధారపడి ఉన్నాయి.

బిజెపిని తప్పించడమే తక్షణ కర్తవ్యం

- పాలన, న్యాయ వ్యవస్థను నియంత్రించేందుకు కేంద్రం యత్నం
- మోడీ వచ్చాకే విపరీతంగా ధరల పెరుగుదల

మన తెలంగాణ/హైదరాబాద్: బిజెపి ప్రభుత్వం పాలన, న్యాయవ్యవస్థలను సైతం తమ గుప్పిట్లోకి తీసుకొని నియంత్రించేందుకు ప్రయత్నిస్తోందని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి అన్నారు. హిందుత్వ శక్తుల పేరుతో జరుగుతున్న దాడులు మైనార్టీల్లో అభద్రతా భావాన్ని కలిగిస్తున్నాయన్నారు. బిజెపిని అధికారం నుంచి తప్పించడమే తక్షణ రాజకీయ కర్తవ్యమని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని కాపాడాలనుకునే రాజకీయ, రాజకీయేతర శక్తులతో కలసి విశాల ఐక్య వేదికను ఏర్పాటు చేయాలని, అందుకు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు బలోపేతం కావాలన్నారు. విజయవాడలో సోమవారం సిపిఐ జాతీయ సమితి సమావేశాలను సురవరం సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. కేంద్రం అధికారాలు విస్తృతం అవుతున్నాయని, ఈ విధానం చాలా తీవ్రమైన ప్రమాదాన్ని తెచ్చిపెడుతుందని ఆయన అన్నారు. బిజెపిలో అవినీతి బాగా పెరిగిపోయిందని, స్వయంగా బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కుమారుడు జేషా అవినీతి బయటపడినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. జర్నలిస్టులపై, విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, విద్యార్థి నాయకులు, ఉద్యమాలు నిర్వహించే దళితులపై బిజెపి ప్రభుత్వం కేసులు నమోదు చేసి ఒత్తిళ్లకు గురిచేస్తోందన్నారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి తెస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో మోడీ పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. పనామా పేపర్లు, ప్యారడైజ్ ఎక్స్‌పోజర్స్ వల్ల వెల్లడైన జాబితాలో ఉన్న వారిపై విచారణ జరిపి విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకొచ్చేందుకు బిజెపి సిద్ధంగా లేదన్నారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగే పరిస్థితి నెలకొనడంతో విమానయానంలోనే 13 శాతం చార్జీలు పెంచబోతున్నట్లు కేంద్రం ప్రకటించిందన్నారు. రైలు, బస్సులపై కూడా డీజిల్ ధరల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత వంటగ్యాస్‌పై అసాధారణమైన రీతిలో సబ్సిడీలను రద్దు చేసే పేరుతో ప్రతి నెల రూ. 10లు గ్యాస్‌సిలెండర్లపై పెంచుకుంటూ పోతున్నారని ఆయన తెలిపారు. ధరలు నిత్యం విపరీతంగా పెరిగిపోతుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని రంగాల్లో నిరుద్యోగం తాండవిస్తోందని, ఫలితంగా యువత తీవ్రమైన అసంతృప్తికి లోనవుతోందన్నారు. కేరళలో ఏప్రిల్ 25 నుంచి 29 వరకూ జరిగే సిపిఐ 23వ మహాసభలో ఆమోదించాల్సిన రాజకీయ తీర్మానం గురించి ఈ సమావేశంలో చర్చించనున్నట్లు సుధాకరరెడ్డి వివరించారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షత వహించగా పార్టీ జాతీయ కార్యదర్శివర్గసభ్యులు హాషీమ్ ఫైజీ, డి.రాజా, కె.నారాయణ, రామేంద్రకుమార్, అతుల్‌కుమార్ అంజన్, పన్నీర్ రవీంద్రన్, నాగేంద్రనాధ్ ఝా, అమర్‌జిత్ కౌర్ వేదికపై ఆసీనులయ్యారు.



హస్తినలో గవర్నర్



- నేడు రాష్ట్రపతి, ప్రధానితో భేటీ

మన తెలంగాణ/హైదరాబాద్: ఉభయ తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ సోమవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లారు. మంగళవారం సాయంత్రం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధానితో భేటీ అవుతారు. మూడు నెలల క్రితం ఢిల్లీలో జరిగిన గవర్నర్ల సదస్సులో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా గవర్నర్ల కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ రూపొందించిన నివేదికను రాష్ట్రపతికి సమర్పించనున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 2022 సంవత్సరానికి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 'నవభారత్ 2022' దిశగా కొన్ని లక్ష్యాలను నిర్దేశించుకుంది. గవర్నర్‌ల సదస్సు సందర్భంగా వీటిపై రెండు రోజుల పాటు లోతైన చర్చ జరిగింది. కేంద్రానికి, రాష్ట్రాలకు వారధిగా ఉంటున్న గవర్నర్‌లు ఈ లక్ష్య సాధనలో పోషించాల్సిన పాత్ర, రాష్ట్రాలకు మార్గదర్శకత్వం వహించడం తదితరాలపై 27 రాష్ట్రాల గవర్నర్లు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు వారివారి అభిప్రాయాలను వెల్లడించారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు, విద్యుత్ సౌకర్యం, రక్షిత త్రాగునీరు, ఆరోగ్యం, విద్య, పారిశుద్యం తదితరాలు అందడంపై ఈ సదస్సులో చర్చ జరిగింది. కాలుష్య నివారణ, పౌరులకు భద్రత, పర్యావరణం, బహిరంగ మలవిసర్జనకు తావులేని గ్రామాల, పట్టణాల మార్పు, స్కిల్ డెవలప్‌మెంట్... ఇలా అనేక లక్ష్యాలపై ఈ సదస్సులో చర్చ జరిగింది. ఇప్పటికే ఈ లక్ష్యాల దిశగా కొన్ని రాష్ట్రాలు చేపట్టిన కార్యాచరణ, సాధిస్తున్న ఫలితాలు, ప్రజల భాగస్వామ్యం, రాష్ట్ర ప్రభుత్వాల కృషి.. ఇలా పలు అంశాలపై గవర్నర్లు వివరించారు. ప్రభుత్వ పథకాల ఫలాలు లబ్దిదారులకు చేరడంలో ఎదురవుతున్న ఆటంకాలు, వాటిని అధిగమించడానికి తీసుకుంటున్న చర్యలు తదితరాలపై కూడా చర్చించారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని తదితరులంతా ప్రభుత్వ లక్ష్యాల గురించి వివరించారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో వీటిని సాకారం చేయడానికి గవర్నర్లుగా తీసుకోవాల్సిన చర్యలు, కేంద్రానికి రాష్ట్రాలకు మధ్య వారధిగా పనిచేయడంలో వారు పోషించాల్సిన పాత్ర తదితరాలతో పాటు ఐదేళ్ళలో ఈ లక్ష్యాలను సాధించడానికి చేపట్టాల్సిన కృషిపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని నిర్ణయం జరిగింది. తెలంగాణ గవర్నర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఈ కమిటీలో తమిళనాడు, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల గవర్నర్లు కూడా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ లక్ష్యాల సాధనపై అధ్యయనం చేసిన ఈ కమిటీ తన నివేదికను రాష్ట్రపతికి సమర్పించనుంది. ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న గవర్నర్ ఈ నివేదికను సమర్పించి రాష్ట్రపతితో ముచ్చటించనున్నారు. మిగిలిన నాలుగు రాష్ట్రాల గవర్నర్లు కూడా రాష్ట్రపతిని కలుస్తారు. అనంతరం తెలుగు రాష్ట్రాల్లోని తాజా పరిస్థితులను, రెండు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారంలో తీసుకుంటున్న చొరవను ప్రధానికి గవర్నర్ వివరించనున్నారు.

ఆప్ ఎంపిల సంఖ్య 7

- రాజ్యసభకు కొత్తగా ముగ్గురు ఎన్నిక

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ పార్లమెంట్‌లో తన స్థానాలను పెంచుకుంటోంది. సోమవారం ఆ పార్టీ తరపున ముగ్గురు సభ్యులు రాజ్యసభకు ఎన్నికయ్యారు. రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి ఎన్నికైన ముగ్గురు సర్టిఫికేట్లను పొందారు. సంజయ్ సింగ్, ఎన్‌డి గుప్తా, సుశీల్ గుప్తాలు ఆప్ తరపున పెద్దల సభలో అడుగు పెట్టనున్నారు. అనేక సమస్యలపై తమ గళాన్ని వినిపించనున్నారు. తమ ఉనికి చాటనున్నారు. ఎన్నికైన ముగ్గురు సభ్యులకు ఆప్ ప్రధాన కార్యాలయంలో సన్మానం జరిగింది. ఆప్ సీనియర్ నేత పంకజ్ గుప్తా, ఆప్ ఢిల్లీ కన్వీనర్ గోపాల్ రాయ్ వీరి ముగ్గురిని ఘనంగా సత్కరించారు. ఇదిలా ఉంటే లోక్‌సభలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన నలుగురు సభ్యులు తమ సత్తా చాటలేక పోతున్నారు. నలుగురిలో ఇద్దరు సభ్యులు ధర్మవీర గాంధీ, హెచ్‌ఎస్ ఖల్సాలు సస్పెన్షన్‌కు గురయ్యారు. మరో ఇద్దరు సభ్యులు భగవాన్ మాన్, సాధు సింగ్‌లు లోక్‌సభ హాజరయ్యే విషయంలో వెనకబడ్డారు.

దిల్‌సుఖ్ నగర్ బ్రాంచ్‌లో టిజిబి ఎటిఎం

మన తెలంగాణ / హైదరాబాద్: తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్ నగర్ బ్రాంచ్‌లో ఏర్పాటు చేసిన నూతన ఎటిఎం కేంద్రాన్ని సోమవారం నాడు ఆ బ్యాంక్ ఛైర్మన్ వి. అరవింద్ లాంఛనంగా ప్రారంభించారు. వినియోగదారులకు సత్వరమే నగదు డ్రా చేసుకునేందుకు ఈ ఏటిఎం తోడ్పాటు నందిస్తుందని ఛైర్మన్ అరవింద్ ఈ సందర్భంగా అన్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 399 బ్యాంకు శాఖల ద్వారా వినియోగదారులకు సేవలందిస్తోందన్నారు. 7996 కోట్ల డిపాజిట్లు, రూ. 5857 కోట్ల అడ్వాన్సులను కల్గి ఉందన్నారు. ఎటిఎం కార్డుల పిన్ నెంబర్లను తరుచుగా మారుస్తూ ఉండడం ద్వారా ఖాతాలోని సొమ్ముకు మరింత భద్రత కల్పించాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో బ్యాంక్ జనరల్ మేనేజర్ (అడ్మిన్ అండ్ ఐటి) సిహెచ్ సుందర్ రాజు, ఆర్‌ఎం ఆర్ ఓ –2 వి.కరుణాకర్ రెడ్డి, దిల్‌సుఖ్ నగర్ శాఖ చీఫ్ మేనేజర్ కె. శ్యామ్ సందర్‌తో పాటు 55 మంది ఖాతాదారులు కూడా పాల్గొన్నారు.

చిందు యక్షగాన కళాకారుడు మృతి




గడ్డం భిక్షపతి (ఫైల్)

మన తెలంగాణ/ పాలకుర్తి: మండలంలోని దర్దేపల్లి గ్రామానికి చెం దిన చిందు యక్షగాన కళా కారుడు గడ్డం భిక్షపతి (70) గుండెపోటు రావడంతో ఎంజిఎంకు తరలించి చిత్స అందస్తుండగా సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు. భిక్షపతి గత 55 ఏళ్లుగా చిందు యక్షగాణ కళాకారుడిగా అనేక పాత్రలు పోషించి, ప్రజలను మెప్పించి, ఈ ప్రాంతంలో సుపరిచితుడుగా అనేక యక్షగానాలు ప్రదర్శనలు ఇచ్చారు. 2010లో తెలుగు విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో భిక్షపతిని ఘనంగా సత్కరించారు. ఆయన భౌతిక దేహాన్ని డిసిసిబి మాజీ ఛైర్మెన్ రాఘవ రెడ్డి, టిడిపి మండలాధ్యక్షుడు గజెల్లి, ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, రాంరెడ్డి, శ్రీను, రమేష్, హరికృష్ణ సందర్శించి మృతుడి కుటుంబాన్ని పరమర్శించారు.

పన్నెండు గనులు.. రూ. 34వేల కోట్లు

- లక్ష్యం నిర్ధేశించుకున్న సింగరేణి
- ఐదేళ్లలో అదనంగా రూ.10వేల కోట్ల టర్నోవర్‌కు ప్రణాళికలు



మన తెలంగాణ/హైదరాబాద్: బొగ్గు ఉత్పత్తి, విద్యుత్ ఉత్పత్తితో ఐదేళ్లలో రూ.34 వేల కోట్ల టర్నోవర్ కంపెనీగా తీర్చిదిద్దాలని సింగరేణి లక్ష్యంగా విధించుకుంది. ప్రస్తుతం రూ.24 వేల కోట్ల టర్నోవర్ ఉంది. దీన్ని ఐదేళ్లలో అదనంగా పది వేల కోట్లు పెంచేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కొత్తగా 12 గనులు ప్రారంభించనున్నారు. ఇందులో 6 ఓపెన్‌కాస్ట్ గనులు కాగా, మరో 6 భూగర్భ గనులు ఉన్నాయి. గత మూడేళ్లలో సింగరేణి మంచి వృద్ధిని కనబరుస్తోంది. 52 మిలియన్ టన్నుల నుంచి 62.5 మిలియన్ టన్నులకు బొగ్గు ఉత్పత్తి పెరిగింది. ఆదాయం 23 శాతం వృద్ధి చెందింది. రూ.19,273 కోట్ల నుంచి రూ.24 వేల కోట్లకు టర్నోవర్ పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.400 కోట్ల లాభం రాగా, ప్రస్తుత ఏడాదిలో రూ.998 కోట్ల లాభం ఆర్జించే అవకాశాలు ఉన్నాయి. ఏటా 86 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిసున్నారు.

విద్యుత్ రంగంలో: తెలంగాణ విద్యుత్ కొరత తీరడంలో సింగరేణి పాత్ర ఎంతగానో ఉంది. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు బొగ్గును దండిగా సరఫరా చేయడమే కాకుండా, సొంతంగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పింది. సమైక్య రాష్ట్రంలోనే జైపూర్ విద్యుత్ కేంద్ర నిర్మాణం ప్రారంభం కాగా, గత కొన్ని నెలలుగా రెండు యూనిట్ల నుంచి విద్యుత్ ఉత్పత్తి నిరంతరాయంగా జరుగుతుంది. దీంతో 1,200 మెగావాట్ల రాష్ట్రానికి సమకూరుతుంది. దీనికి తోడు మరో 800 మెగావాట్ల ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించడానికి సంస్థ సన్నాహాలు చేస్తోంది. కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ నిబంధనల మేరకు 500 మెగావాట్ల సోలార్ విద్యుత్ పార్కును కూడా నెలకొల్పడానికి ఏర్పాట్లు సాగుతున్నాయి. దీనికి సంబంధించిన స్థల సేకరణ, డిపిఆర్ తయారీ ప్రక్రియ పురోగతిలో ఉంది. మరోవైపు సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి కేటాయించిన ఒడిషాలోని నైనీ బ్లాక్‌ను అభివృద్ధి చేసి, ఉత్పత్తి ప్రారంభించడంపై యాజమాన్యం ధృడ సంకల్పంతో ఉంది. ఈ బ్లాకులో ఉత్పత్తి ప్రారంభమైతే, సింగరేణికి అదనపు బలంగా మారే అవకాశం ఉందని ఉద్యోగులు అభిప్రాయపడ్డారు.



మందకృష్ణకు కండీషనల్ బెయిల్

మన తెలంగాణ/హైదరాబాద్/ మాదన్నపేట్: చంచల్‌గూడ జైలులో ఉన్న ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ సోమవారం కండీషనల్ బెయిల్‌పై విడుదలయ్యారు. తన బావ అంత్యక్రియలకు హాజరుకావాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఒక రోజు తాత్కాలిక బెయిల్ మంజూరు చేయడం జరిగింది. తిరిగి మంగళవారం ఉదయం 10.30కి సికింద్రాబాద్ కోర్టుకు హాజరు కావాలని న్యాయమూర్తి ఆదేశించారు. అనుమతి లేకుండా తన నివాసంలో ఎస్‌సి వర్గీకరణ కోసం దీక్ష చేపట్టడంతో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించిన విషయం తెలిసిందే.

పరామర్శించిన కాంగ్రెస్ నేతలు: బెయిల్ రాకముందు చంచల్‌గూడ జైలులో ఉన్న మందకృష్ణ మాదిగను కాంగ్రెస్ నేతలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జగ్గారెడ్డి, మాజీ ఎంపి రవీందర్‌నాయక్ పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ కోసం పోరాడుతున్న మందకృష్ణను కెసిఆర్ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసి జైలులో పెట్టడం అన్యాయమన్నారు. ఎస్‌సి వర్గీకరణ న్యాయపరమైన డిమాండ్ అన్నారు. దీనికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. టిఆర్‌ఎస్‌లో ఉన్న మాదిగ సోదరులు కెసిఆర్‌కు అమ్ముడు పోయారని విమర్శించారు. మాదిగ జాతి ఏకమై మంద కృష్ణను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కెసిఆర్ మాదిగలకు వ్యతిరేకపాలన చేస్తున్నారని తెలిపారు. రానున్న కాలంలో ప్రజలే నీకు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

శాస్త్ర పరిశోధనలకు ప్రోత్సాహం

- డిప్యూటి సిఎం కడియం శ్రీహరి



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో శాస్త్ర పరిశోధనలను ప్రొత్సహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. మరో ఉపముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ, హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, స్థానిక ఎంఎల్‌ఏ సాయన్న తదితరులతో కలిసి కడియం శ్రీహరి సోమవారం నాడు సికింద్రాబాద్‌లోని సెయింట్ పాట్రిక్ పాఠశాలలో సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్–2018ని ప్రారంభించారు. సైన్స్ ఫెయిర్‌లను నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక పరిశోధనల పట్ల చిన్నప్పటి నుండే ఆసక్తి పెరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా పరిశోధనలను ప్రొత్సహించడానికి, సైన్స్ ఫెయిర్‌లు నిర్వహించడానికి మరిన్ని ఎక్కువ నిధులు కేటాయించాలని కోరారు. శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించుకుండా దేశం ముందంజ వేయలేదని, ప్రపంచంలో నంబర్ వన్ స్థానానికి రాలేమని కడియం వ్యాఖ్యానించారు. సిఎం కెసిఆర్ నాయకత్వంలో నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణ రాకముందు ఇక్కడ 296 గురుకుల పాఠశాలలు ఉంటే రాష్ట్రం వచ్చిన తర్వాత ఈ మూడేళ్లలో 544 ఏర్పాటు చేసుకున్నామన్నారు. దేశంలో ఎక్కడా కూడా ఇన్ని గురుకులాలు లేవన్నారు. వీటితో పాటు 475 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలను, 194 మోడల్ స్కూళ్లు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలోని ఆరు రాష్ట్రాల నుంచి ఈ సైన్స్ ఫెయిర్‌కు వచ్చిన విద్యార్థులు చారిత్రక హైదరాబాద్ నగరంలో అనేక పర్యాటక ప్రదేశాలు చూడాలని సూచించారు. ఇందుకోసం విద్యాశాఖ తరపున త్వరలో టూర్‌ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ ఐదు రోజులు సైన్స్ ఫెయిర్‌లో తమ ప్రతిభను చాటాల న్నారు. సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను మెమోంటోలతో సత్కరించారు. విద్యార్థులు చేసిన ప్రయోగశాలలను పరిశీలించి వా రితో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కిషన్ తదితరులున్నారు.

భాగస్వాములకు తెలియకుండా రూ. 16కోట్ల ఆస్తుల విక్రయం

- కంపెనీ ఎండి అరెస్టు, పరారీలో మరి ముగ్గురు

మన తెలంగాణ/హైదరాబాద్: కంపెనీ భాగస్వాములకు తెలియకుండానే రూ.16 కోట్ల ఆస్తులను విక్రయించిన మేనేజింగ్ డైరె క్టర్ (ఎండి) భాగోతం హైదరాబాద్‌లో వెలు గు చూసింది. బాధితుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన సిసిఎస్ పోలీసులు సదరు కంపెనీ ఎండిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిసిఎస్ డిసిపి అవినాష్ మహంతి వివరాలు వెల్లడించారు. అమీర్‌పేట్‌లోని 'టెక్ బాండ్ ల్యాబరేటరి ప్రైవేటు లిమిటెడ్' కంపెనీకి తుమ్మల బోస్ బాబు (64) మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇదే కంపెనీకి భాగస్వాములుగా ఉన్న ఎం.వంశీధర్, డాక్టర్ ఇబ్రహీంపట్నం కృష్ణ, రాహుల్ దాస్ గుప్తా, సి.సంజీవ బాబు, స్వపన్ బట్టాచార్యలు డైరెక్టర్లుగా ఉన్నారు. వంశీధర్, డాక్టర్ ఇబ్రహీంపట్నం కృష్ణలు తమ షేర్ల ను నిఖిల్ బహెతి అనే వ్యక్తికి ఆరు నెలల క్రి తం జిపిఎ చేశారు. ఇదిలాఉండగా మిగిలిన భాగస్వాములైన నలుగురు మిగతా షేర్ హోల్డర్లకు తెలియకుండా కంపెనీకి చెందిన రూ. 16 కోట్ల ఆస్తులను మరో కంపెనీకి విక్రయించారు. ఈ విషయం తెలుసుకున్న జిపిఎ హోల్డర్ నిఖిల్ మేనేజింగ్ డైరెక్టర్ బోస్‌బాబును పలుమార్లు నిలదీశాడు. అయినా అతని నుంచి ఎలాంటి సమాదానం రాలేదు. దీంతో బాధితుడు నిఖిల్ సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంపెనీ బోర్డు సమావేశం జరగకున్నా జరిగినట్లు తమ సంత కాలను ఫోర్జరీ చేసి కంపెనీ ఆస్తులను అక్రమంగా విక్రయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు పై నలుగురు నిం దితులపై ఐపిసి 420, 406, 465, 468, 471 రెడ్‌విత్ 34 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నలుగురు నిందితుల్లో మేనేజింగ్ డైరెక్టర్ బోస్‌బాబును సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆరుగురు కార్మికుల దుర్మరణం



మన తెలంగాణ/గద్వాల: బొలెరో బోల్తా పడి ఆరుగురు మృతి చెందిన ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో విషాదం నింపింది. మృతులు ఓ జిన్నింగ్స్ మి ల్లులో పనిచేస్తోన్న కూలీలు రోజూలాగే తమ విధులు ముగించుకుని ఇంటికి ఓ వాహనంలో బయల్దేరారు. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండ లంలో వీరు ప్రయాణిస్తున్న వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చిన్న పాడు గ్రామానికి చెందిన కొత్త వెంకటన్న, కోట్ల వెంకటన్న, కమ్మరి లోహిత్, కమ్మరి గీతమ్మ, ఎమునంపల్లి గ్రామానికి చెందిన అరుణమ్మ మృతి చెందగా, మరో 15మంది గాయపడ్డారు. వీరిని వైద్యం కోసం గద్వాల ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని గద్వాల డిఎస్‌పి సురేంద్రరావు పరిశీలించారు.



డోక్లాంలో చైనా బలగాల తగ్గుముఖం

న్యూఢిల్లీ : భారతీయ భూభాగంలో ట్రాక్‌ను నిర్మించడానికి చైనా యత్నించిన వివాదం సమసిపోయిందని, చైనా బలగాలు ఉపసంహరించుకుంటున్నాయని సైనిక దళ ప్రధానాధికారి బిపిన్ రావత్ తెలిపారు. డోక్లాం ప్రాంతంలో చైనా బలగాలు భారీగా తగ్గిపోయాయని ఆయన వెల్లడించారు. సోమవారం ఇక్కడ ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ చైనా బలగాలు భారత్ భూభాగంలో ట్రాక్ నిర్మించడానికి వచ్చిన ఘటనకు సంబంధించిన వివాదం పరిష్కారమైపోయిందని చెప్పారు. ఈ అంశంపై రెండురోజుల క్రితం బోర్డర్ పర్సనల్ మీటింగ్ (బిపిఎం) జరిగిందని అన్నారు. సిక్కిం సెక్టార్‌లోని రెండు దేశాల సరిహద్దులో 73 రోజుల పాటు ప్రతిష్టంభన నెలకొన్నదని, కాని ఇప్పుడు చైనా వైపు నుంచి బలగాల సంఖ్యలో భారీ తగ్గుదల కనిపిస్తోందని చెప్పారు. డిసెంబరు 26న ఇండో–టిబెటన్ సరిహద్దులోని పోలీసు పోస్టుకు రెండు కిలోమీటర్ల దూరంలో రహదారిని నిర్మించేందుకు చైనా కార్మికులు భారత్ భూభాగంలోకి ప్రవేశించారు. భారతీయ బలగాలు వారిని అక్కడి నుంచి తరిమివేసి, సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. అయితే, నిర్మాణ పనులను ఆపేనాటికి అప్పటికే వారు 12 అడుగుల వెడల్పుతో 600 మీటర్ల పొడవున రహదారిని నిర్మించారు.



దేశవ్యాప్తంగా చతుర్విధ జల ప్రక్రియ

● హనుమంతరావు సంస్మరణసభలో వక్తలు

మన తెలంగాణ/హైదరాబాద్: రిటైర్డ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ హనుమంతరావు రూపొందించిన చతుర్విధ జలప్రక్రియను దేశమంతటా విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు, అమలు జరపాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. సోమవారం నాడు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్‌లో హనుమంతరావు సంస్మరణ సభ కుటుంబసభ్యుల మధ్య జరిగింది. ఈ సందర్భంగా ప్రతి ఏటా జూన్ మాసంలో హనుమంతరావు స్మారక ప్రసంగాన్ని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో పాటు జెఎన్‌టియు కాకినాడ, ఎన్‌ఐటి వరంగల్, ఐఐటి హైదరాబాద్, ఎస్‌వి విశ్వవిద్యాలయం తిరుపతిలలో సివిల్ విభాగంలో టాప్ స్టూడెంట్‌లకు హనుమంతరావు స్మారక బంగారు పతకాలు ప్రతి ఏటా ఇవ్వాలని కుటుంబసభ్యులు నిర్ణయించారు. సివిల్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు సెమినార్లు, వర్క్‌షాప్‌ల ద్వారా చతుర్విధ జలప్రక్రియ అమలుచేసే విధానాన్ని నేర్పిస్తామని స్పష్టం చేశారు. గతంలో చతుర్విద జలప్రక్రియను అమలుచేసిన గ్రామాల్లో వచ్చిన ఫలితాలు, విజయగాధలను విస్తృతంగా ప్రచారం చేస్తామని హనుమంతరావు కుమారుడు మధుసూదన్ స్పష్టం చేశారు. ఇప్పుడు రాజస్థాన్‌లో శ్రీరాం వెదిరె ఆధ్వర్యంలో అమలు చేస్తున్న 'జల స్వావలంభన అభియాన్' పథకానికి మూల సూత్రం చతుర్విధ జలప్రక్రియే మూలమని అన్నారు. సంస్మరణ సభలో కాంగ్రెస్ సీనియర్ నేతలు మర్రి శశిధర్ రెడ్డి, శంకర్‌రావు మాట్లాడుతూ భవిష్యత్తులో నీటి యుద్ధాలు నివారించాలంటే, చతుర్విధ జలప్రక్రియను దేశమంతటా అమలు చేయాలని సూచించారు. గొప్ప ఫార్ములాను ప్రతిపాదించిన హనుమంతరావుకు 'పద్మ' అవార్డు ఇవ్వాలని, ఈ విషయమై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని స్పష్టం చేశారు. ఎంఎల్‌ఎ గణేష్ బిగాల, మాజీ ఎంఎల్‌సి మాదాసు గంగాధర్, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, జలసాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్, 'ఇంటాక్' అనురాధా రెడ్డి తదితరులు మాట్లాడి హనుమంతరావుతో తమకు ఉన్న అనుభవాలు పంచుకున్నారు. ప్రజల క్షేమం కోసం, తక్కువ ఖర్చుతో లబ్ధి పొందే ఉపాయాలపై చివరి వరకు నిరంతర అధ్యయనం చేసేవారని, అనుమానాలన్నీ విసుక్కోకుండా నివృత్తి చేసేవారని వివరించారు.

గవర్నర్, మంత్రులే అబద్ధాలాడుతారా? : ఉత్తమ్

పిసిసి చీఫ్‌ను కలిసిన సాయిలు కుటుంబం



మన తెలంగాణ/హైదరాబాద్ : కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలో చనిపోయిన విఆర్‌ఎ సాయిలు విషయంలో గవర్నర్ సహా మంత్రులు, అధికారులు అబద్ధాలు చెప్పడం దారుణమని టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో విఆర్‌ఎ ఇంట్లో వంతుల వారీగా పని చేయడం సర్వసాధారణమని, సాయిలు చనిపోయినప్పుడు, ఆయన జేబుకు విఆర్‌ఎ బిల్ల కూడా ఉన్నదని, ఆయన ఎంఆర్‌ఒ కార్యాలయంలో జీతం తీసుకున్న రోస్టర్ కూడా ఉన్నదన్నారు. సాయిలు భార్య సాయవ్వ, కుమారుడు విఠల్, కుమార్తె, తల్లిదండ్రులు శనివారం గాంధీ భవన్‌కు వచ్చి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. వీరిని మాజీ ఎంఎల్‌ఎ అరుణతార, పిసిసి ప్రధాన కార్యదర్శి మహేశ్‌కుమార్‌గౌడ్‌లు తీసుకువచ్చారు. ఇసుక అక్రమ రవాణా గురించి పై అధికారులకు చెబుతారనే ఉద్దేశ్యంతోనే ఆయనను హత్య చేశారని సాయిలు భార్య సాయవ్వ చెప్పారు. ఈ సందర్భంగా వారు సాయిలు చనిపోయినప్పుడు జేబుకు బిల్ల ఉన్న ఫోటోను, అలాగే బిల్లను, సాయి లు పేరు ఉన్న మండలాఫీసు రోస్టర్‌ను చూపించారు.అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ జరిగింది నిజమని ప్రభుత్వమే ముం దుకు వస్తే బాగుండేదన్నారు. ఇసుక ట్రాక్టర్ యజమానిపై ఐపిసి 302 కింద కేసు పెట్టాలని, విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ అధికారి మరణిస్తే ఇచ్చే రూ.25 లక్షల పరిహారం సాయిలు కుటుంబానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సాయిలు మృతిపై న్యాయ విచారణ

మన తెలంగాణ / హైదరాబాద్ : ఇసుక మాఫియా దాడిలో సాయిలు మృతి ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని, సాయిలు కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22వ తేదీన 'చలో కలెక్టరేట్' నిర్వహించనున్నట్లు టి మాస్ కన్వీనర్ జాన్ వెస్లీ చెప్పారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సాయిలు విఆర్‌ఎ కాదని కెటిఆర్ ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. తెలంగాణలో వంతులవారీ పద్ధతిలో విఆర్‌ఎ విధులు నిర్వహించే సంప్రదాయం ఉందని, అందులో భాగంగానే తహసీల్దార్ ఆదేశం మేరకు జూన్ నెల నుంచి సాయిలు విఆర్‌ఎ బిళ్ల దగ్గర పెట్టుకుని విధులకు వెళ్లారని ఆయన చెప్పారు. సాయిలు విఆర్‌ఎ కాకపోతే తహసీల్దార్ ను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

గుండు హనుమంతరావుకు రూ.5లక్షల ఆర్థిక సహాయం



మన తెలంగాణ / హైదరాబాద్ : అనారోగ్యంతో బాధపడుతున్న అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రముఖ హాస్య నటుడు గుండు హనుమంతరావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి తెలంగాణ ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. మంత్రి కెటిఆర్ లేఖ మేరకు ఈ మొత్తానికి సంబంధించిన ముఖ్యమంత్రి కార్యాలయం జారీ చేసిన లేఖను కెటిఆర్ తన ట్విట్టర్ అకౌంట్‌లో పెట్టారు.

వికలాంగులకు ఉచిత శిక్షణ

మన తెలంగాణ / హైదరాబాద్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సంస్థలు ప్రకటించే ఉద్యోగాల కోసం వికలాంగులకు ఉచితంగా శిక్షణ ఇప్పించనున్నట్లు వికలాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 20వ తేదీలోగా డబ్ల్యూడిఎస్‌సి. తెలంగాణ.జివోవి .ఇన్ (wdsc.telangana.gov.in) వెబ్‌సైట్‌లో పంపవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా మహిళా, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారుల కార్యాలయాలను సంప్రదించవచ్చన్నారు.

బడ్జెట్ పెట్టుబడి 19% పెంపు!

● రూ.2లక్షల కోట్లు దాటే అవకాశం
● సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యం
● మార్చిలో బడ్జెట్ సమర్పణ?



మన తెలంగాణ/హైదరాబాద్ : గడచిన ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇప్పటివరకు రాష్ట్రం 19.37% మేర ఆర్థిక వృద్ధి రేటు సాధించింది. దీనికి అనుగుణంగానే రానున్న బడ్జెట్‌లో కూడా అంచనాలు పెరగనున్నాయి. ఈ ప్రకా రం చూస్తే రానున్న బడ్జెట్ కనీసంగా రూ. 1.80 లక్షల కోట్లకు పైనే ఉండే అవకాశం ఉంది. అయితే రానున్నది ఎన్నికల బడ్జెట్ కాబట్టి ప్రజాకర్షక సంక్షేమ పథకాల రూపంలో ఈ బడ్జెట్ రెండు లక్షల కోట్ల రూపాయలకు పెరిగే అవకాశం కూడా లేకపోలేదు. కేంద్రం నుంచి అం దే గ్రాంట్లు, ఆర్థిక సాయం, ఆర్థిక సంఘం పన్నుల వాటా లో చోటుచేసుకునే పెరుగుదలకు అనుగుణంగా మన రాష్ట్ర బడ్జె ట్ అంచనా రూ. 1.80 లక్షల కోట్ల తర్వా త ఏ మేరకు పెరుగుతుందన్నది ఆధారపడి ఉం టుంది. ఆగస్టు, సెప్టెంబరు, నవంబరు మాసాల్లో వృద్ధి రేటు (ఎక్సయిజ్‌ను మినహాయించి) ఒక అంకెకు మాత్ర మే పరిమితంకాగా అక్టోబరు, డిసెంబరు మాసాల్లో మాత్రం ఇది రెండంకెలకు పెరిగింది. ఇక వెనకబడిన తరగతులకు ఉప ప్రణాళిక ఉండవచ్చన్నది ఊహాగానం మాత్రమే తప్ప ఇప్పటివరకు ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి సూచనలు చేయలేదని తెలిసింది. బడ్జెట్ తయారీకి అనుగుణంగా ఈ నెల 8వ తేదీకల్లా అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలు పంపాల్సిందిగా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఇప్పటికే సర్క్యులర్ జారీ చేసినా వివిధ కారణాల వలన ఆ గడువును ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించబడింది. ఈ నెలాఖరుకల్లా బడ్జెట్‌కు సంబంధించిన ముసాయిదా సిద్ధం కానుంది. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత ఏ రోజైనా రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి ఆర్థిక శాఖ సిద్ధంగా ఉండనుంది. ఫిబ్రవరి చివరి వారం లేదా మార్చి నెల మొదటి వారంలో రాష్ట్ర బడ్జెట్‌ను సమర్పించే అవకాశం ఉందని సమాచారం.

2016–17 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ మొదలు డిసెంబరు వరకు వ్యాట్ రూపంలో రూ. 24,977.70 కోట్లు వసూలుకాగా, ఈ ఆర్థిక సంవత్సరం ఇదే తొమ్మిది నెలల కాలానికి 29,811.30 కోట్లు వసూలైంది. తొమ్మిది నెలల కాలానికే 19% వృద్ధిరేటు నమోదైనందున రానున్న మూడు నెలల కాలంలో ఇది మరికొంత పెరిగే అవకాశం ఉందని, ఆ మేరకు రానున్న బడ్జెట్ సైజు కూడా పెరుగుతుందని ఆర్థికశాఖ అధికారుల అంచనా. జిఎస్టి, సేల్స్ టాక్స్ (పెట్రోలియం ఉత్పత్తులు), ఇతర పన్నులు కలిపి వృద్ధి రేటు గత ఆర్థిక సంవత్సరం కంటే 8% పెరిగినట్టు లెక్క కట్టినా ఎక్సయిజ్ పన్నుల్ని కలిపితే ఇది 19.37% కు చేరుకుంది. ఈ ఆర్థిక సంవత్సరం వ్యాట్ అమలైన తొలి మూడు నెలలు (ఏప్రిల్ నుంచి జూన్ వరకు) 21% వృద్ధి రేటు నమోదైంది.

అయితే జూలై నుంచి జిఎస్టి అమల్లోకి రావడంతో ఆ వృద్ధి రేటు 18%కి తగ్గిపోయింది. జిఎస్టి విధానంతో వృద్ధి రేటు తగ్గినా పన్ను వసూళ్ళలో మాత్రం పెద్దగా తేడా లేదు. వ్యాట్ అమల్లో ఉన్నప్పుడు గత ఆర్థిక సంవత్సరంలోని తొమ్మిది నెలల కాలానికి రూ. 24,977.70 కోట్లు వసూలైతే జిఎస్టి వచ్చిన తర్వాత తొలి మూడు నెలల్లోని వ్యాట్ వసూళ్ళతో పాటు పెట్రోలియం ఉత్పత్తుల సేల్స్ టాక్స్‌తో కలిపి మొత్తం తొమ్మిది నెలలకు 19,404.54 కోట్లు వసూలైంది. ఆ తర్వాత ఎస్‌జిఎస్టి (రూ. 3,969.93 కోట్లు), ఐజిఎస్టి (రూ. 3,438.88 కోట్లు) ద్వారా మొత్తం రూ. 7,408.81 కోట్లు వసూలైంది. అంటే గత ఆర్థిక సంవత్సరంలో వ్యాట్ ద్వారా తొమ్మిది నెలలకు వసూలైనదానికంటే జిఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత రూ. 2,004.65 కోట్లు పెరిగింది. రాష్ట్రానికి పన్నుల ద్వారా సమకూరుతున్న ఆదాయంలో సేల్స్ టాక్స్, ఎక్సయిజ్ ద్వారా దాదాపు సగం ఉంటోందని అధికారి పేర్కొన్నారు. వ్యాట్ అమల్లో ఉన్నప్పుడుగానీ, ఆ తర్వాత జిఎస్టి విధానంలోగానీ (ఎక్సయిజ్‌తో కలుపుకుని) రాష్ట్ర వృద్ధి రేటు ప్రతి నెలా 15%కి తగ్గడంలేదని, ఆగస్టు మాసంలో మాత్రం కొన్ని నిర్దిష్ట కారణాల వలన 6%గా నమోదైందని తెలిపారు. గత నెలలో గరిష్టంగా 25% వృద్ధి రేటు నమోదైందని వివరించారు. ప్రతి నెలా సగటున మూడు వేల కోట్ల రూపాయలకంటే ఎక్కువే పన్నుల ద్వారా వసూలవుతోందని తెలిపారు.



ప్రతిపాదనలకు గడువు పొడిగింపు

రానున్న బడ్జెట్ తయారీకి ఈ నెల 8వ తేదకల్లా ప్రతిపాదనలు పంపాల్సిందిగా ఆర్థిక శాఖ సర్క్యులర్‌లో గడువు విధించినప్పటికీ కొన్ని అనివార్య కారణాల వలన దాన్ని ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పి సింగ్ అధ్యక్షతన సచివాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వివిధ శాఖల నుంచి వచ్చిన అభిప్రాయాలు, ప్రతిపాదనలకు జరుగుతున్న కసరత్తును దృష్టిలో పెట్టుకుని ఈ గడువును పొడిగించాల్సి వచ్చింది. నిర్దిష్టంగా వచ్చే ప్రతిపాదనలకు అనుగుణంగా 17వ తేదీ తర్వాత మరోమారు ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన శాఖలవారీగా సమీక్ష జరుగుతుంది.

ఆ తర్వాత ముసాయిదా బడ్జెట్ తయారవుతుంది. ముఖ్యమంత్రి దాన్ని పరిశీలించిన తర్వాత తుది బడ్జెట్ ఖరారవుతుంది. ఈ నెల చివరికల్లా ఈ కసరత్తు పూర్తయ్యే అవకాశం ఉంది. కేంద్ర బడ్జెట్‌కు అనుగుణంగా అవసరమైన మార్పులు చేర్పులు జరిగే అవకాశం ఉంది.



పవర్ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న ట్రాన్స్‌కో సిఎండి ప్రభాకరరావు, డిస్కంల సిఎండిలు రఘుమా రెడ్డి, గోపాలరావు. చిత్రంలో విద్యుత్ సంస్థల డైరెక్టర్లు శ్రీనివాసరెడ్డి, వెంకటరాజం, అసోసియేషన్ అధ్యక్షులు మదుసూధన్‌రెడ్డి తదితరులు

సమిష్టి కృషి వల్లే నిరంతర విద్యుత్

మన తెలంగాణ/జూబ్లీహిల్స్: రాష్ట్రంలో అన్ని రంగాల్లో నిరంతర విద్యుత్ సరఫరాకు కారణం సమిష్టి కృషేనని ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి దేవులపల్లి ప్రభాకరరావు తెలిపారు. ఇటీవల డిల్లీలో తాను సిబిఐపి అవార్డు అందుకునేందుకు వెళ్లినప్పుడు ఇతర రాష్ట్రాల అధికారులతో పాటు కేంద్ర అధికారులు కూడా ఇదే విషయాన్ని ప్రశ్నించారని, తెలంగాణ విద్యుత్ విజయగాధను తెలుసుకోవడంపై ఆసక్తి చూపారని అన్నారు. సోమవారం నాడు ఎర్రగడ్డ డివిజన్ జిటిఎస్ స్కాడా బిల్డింగ్‌లో తెలంగాణ పవర్ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అసోసియేషన్ 2018 డైరీని ప్రభాకరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఏ రాష్ట్రం కూడా సాధించలేనంతగా ప్రజలకు నిర్విరామంగా విద్యుత్‌ను అందజేస్తున్నామని సంతోషం వ్యక్తం చేశారు. ఢిల్లీలో కొంత మంది మేధావులతో పాటు ఎన్టీపిసి, పవర్‌గ్రిడ్, బిహెచ్‌ఇఎల్ చైర్మన్లు, ఉన్నతాధికారులే ఆశ్చర్యానికి లోనయ్యారన్నారు. పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మధుసూధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో టిఎస్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి గౌరవరం రఘుమారెడ్డి, ఎన్‌పిడిసిఎల్ సిఎండి గోపాలరావు, ట్రాన్స్‌కో జెఎండి శ్రీనివాసరావు, విద్యుత్ సంస్థల డైరెక్టర్లు శ్రీనివాసరెడ్డి, వెంకటరాజం, అసోసియేషన్ సెక్రెటరీ జనరల్ డిపి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పిసిసి' ముగిసిన అంశం

● కలిసికట్టుగా పని చేస్తాం : కోమటిరెడ్డి



మన తెలంగాణ/ హైదరాబాద్ : గతంలో తాము పిసిసి అధ్యక్ష పదవి ఆశించామని, అదిప్పుడు జరిగిపోయిన విషయమని, ఎన్నికలు సమీస్తుండడంతో పార్టీ అంతర్గత విషయాలపై చర్చ అవసరం లేదని సిఎల్‌పి ఉప నేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం తన దృష్టంతా కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంపైనే ఉన్నదని, పార్టీ పది నియోజకవర్గాల వరకు బాధ్యతలు అప్పగిస్తే అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా తిరిగేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో ఉత్తమ్ పిసిసి అధ్యక్షునిగా ఉంటే అధికారంలోకి రావడం కష్టమన్న విషయాన్ని గుర్తు చేయగా, అది రెండు, మూడేళ్ళ క్రితం అన్న మాట అని, ఇప్పుడు అందరూ కలసికట్టుగా పని చేయాల్సిన సమయమని చెప్పారు. కాంగ్రెస్‌లో తనలాంటి, ఉత్తమ్‌కుమార్ లాంటి నాయకులు 50 మంది ఉంటారని, ఒక్కొక్కరికి మనిషి పది మందిని గెలిపించుకునే సత్తా ఉన్నదన్నారు. ప్రభుత్వం వచ్చాక ఎవరైనా ముఖ్యమంత్రిగా ఉండొచ్చని, తనకు పదవులు అవసరం లేదని, కాంగ్రెస్‌ను గెలిపించి సోనియాగాంధీ రుణం తీర్చుకోవడమే లక్ష్యమన్నారు. గతంలో మాదిరిగా కేవలం జిల్లాకే పరిమితం కాబోనని, బాధ్యత అప్పగిస్తే పది స్థానాల్లోనైనా అభ్యర్థులను గెలిపిస్తానన్నారు. తాను తెలంగాణ కోసం మంత్రి పదవి త్యాగం చేసి ఆమరణ దీక్ష చేసిన వ్యక్తినని గుర్తు చేశారు. గతంలో చెప్పిన విధంగా పాదయాత్ర చేస్తారా? అని ప్రశ్నించగా, పాదయాత్ర లేదా బస్సుయాత్రపై అధిష్టానమే నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.

24 గంటలతో భూగర్భ జలాలు పడిపోతున్నాయి

వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇవ్వడం ద్వారా భూగర్భ జలాలు పడిపోతున్నాయని, వెంటనే దీనిపై ప్రభుత్వం సమీక్షించాలని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గతంలో నల్లగొండలో పైలెట్ ప్రాజెక్ట్ కింద 24 గంటలు విద్యుత్ ఇచ్చినప్పుడు రైతులు వ్యతిరేకించారని, నిరంతరాయంగా 6 గంటల పాటు షిఫ్ట్‌ల వారీగా ఇవ్వాలని కోరారని గుర్తు చేశారు. ప్రభుత్వానికి నిజంగా రైతులపై ప్రేమ ఉంటే రుణమాఫీని పూర్తిగా ఎందుకు అమలు చేయలేదని, గిట్టుబాటు ధర ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు.



'సమ్మక్క–సారక్క' జాతరకు ఆహ్వానం

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణలో అత్యంత ఘనంగా నిర్వహించుకునే 'మేడారం సమ్మక్క – సారక్క' జాతరకు రావాలని మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావును, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మ ణ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఆహ్వానించింది. మేడారం సమ్మక్క – సారక్క జాతరకు సరిహద్దు రాష్ట్రాల గవర్నర్‌లు, ముఖ్యమంత్రులను ఆహ్వానించడంలో భాగంగా డాక్టర్ కె.లక్ష్మ ణ్ నేతృత్వంలోని బిజెపి నాయకుల ప్రతినిధి బృందం సోమవారం మహారాష్ట్ర వెళ్ళి వారిని ఆహ్వానించింది. నాయకులు తొలుత గవర్నర్‌ను, అనంతరం ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వానపత్రాలను అందజేశారు. సమ్మక్క – సారక్క జాతరకు తప్పకుండా హాజరవుతామని గవర్నర్, ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు బిజెపి నాయకులు తెలిపారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌ఎలు చందా లింగయ్య దొర, వన్నాల శ్రీరాములు, ఎస్‌టి మోర్చా జాతీయ కార్యదర్శి అమర్‌సింగ్ పవార్‌లు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల నుంచే అభివృద్ధి



● రైతు బజారుల్లో బైల్‌కమ్మర్లకు షెడ్లు
● బిసి కమిషన్ సభ్యులు జూలూరి గౌరీశంకర్

మన తెలంగాణ/హైదరాబాద్: అభివృద్ధి అట్టడుగు నుంచి జరగాలన్నది తెలంగాణ పునర్‌నిర్మాణంలో అత్యంత కీలకమైందని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ సభ్యులు జూలూరి గౌరీశంకర్ అన్నారు. నగరంలోని బాలానగర్ డివిజన్ నర్సాపూర్ రోడ్డులో బస్టాండ్ వద్ద రోడ్డుపై జీవిస్తున్న బైల్‌కమ్మర్ల జీవన విధానాన్ని సోమవారం సాయంత్రం బిసి కమిషన్ సభ్యులు క్షేత్రస్థాయిలో వెళ్లి వారి జీవన విధానాన్ని పరిశీలించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను రికార్డు చేశారు. పాత హైదరాబాద్ రాష్ట్రంలో సంచార జాతులుగా ఈ బైల్ కమ్మర్లు ప్రవేశించారని వందల సంవత్సరాలుగా అదే నేలపై జీవిస్తూ రెక్కలు ముక్కలుగా చేసుకొని రోడ్డు పక్కనే జీవనాన్ని గడుపుతున్నారని తెలియజేశారు. వీరికి స్థిర నివాసం లేదని తెలంగాణ రాష్ట్ర ఆవతరణతో వారి పిల్లలు ఇప్పుడిప్పుడే బడివైపుకు అడుగులు వేస్తున్నారని చెప్పారు. సంచార జాతుల సమగ్ర అభివృద్ధి జరగాలని అందుకు వినూత్న పథకాలు అమలు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు వారి జీవన విధానాన్ని తెలుసుకునేందుకు అధ్యయనం చేయమని బిసి కమిషన్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో సంచార కులాలకు, ఎంబిసిలకు జీవన విధానానికి సంబంధించిన అధ్యయనం నడుస్తుందన్నారు. బైల్ కమ్మర్లు తయారు చేసిన వస్తువులను విక్రయించేందుకు వాకి మార్కెట్ కమిటీలలో దుకాణా సమూదాయాల్లో వారికి చోటు కల్పించాలని కోరుతున్నారు. జనావాసాలు కలిగిన చోట బైల్ కమ్మర్లు వృత్తి చేసుకోవడానికి మార్కెట్ యార్డులల్లోని రైతు బజారులలో ఒక్కొక్కరికి వంద గజాల స్థలం లేదా, ఒక షెడ్డులో ఒక దుకాణం కరెంట్‌తోపాటు ఇప్పించాలని బైల్ కమ్మర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. అలాగే తమ వృత్తిని ఆధునీకరించేందుకు ఆధునిక యంత్రాలను ఉచితంగా ఇవ్వాలని కోరుతున్నారు. కరెంట్ గుల్వర్ (గాలి మర), వెల్డింగ్ మిషన్, డ్రిల్లింగ్ మిషన్, బెంచ్ గ్రైండర్, హ్యాండ్ గ్రైండర్, పేపర్ కట్టింగ్, పదిహేను పొండ్లు గల పెద్ద సుత్తెలు, టూల్ కిట్ బ్యాక్స్ రెండు అడుగుల మంగళ్ లాంటి ఆధునిక పరికరాలను తమకు అందిస్తే వ్యవసాయ పనిముట్లకు సంబంధించిన ఉత్పత్తులను కూడా పెంచుతామని వారు తెపారు. బిసి కమిషన్ సభ్యులు వారి పిల్లలు ఏం చేస్తున్నది, ఏం చదువుతున్నది వారి కుటుంబ వివరాలు, వివాహ వ్యవస్థ వారికి కనీస వసతులు లేని దుస్థితి రికార్డు చేశారు. వీరి జీవన విధానాన్ని మార్చడానికి అత్యవసర సహాయం సంచార జాతులకు మొదట అందాలని ఈ సందర్భంగా గౌరీశంకర్ తెలియజేశారు.



రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కోలేటి దామోదర్ సోమవారం నాడు నిజామాబాద్ ఎంపి కల్వకుంట్ల కవితను మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



"ఎంత గొప్ప స్థానానికి చేరినా సరే విద్యార్థి గానే ఉండు. అది నిన్ను మరింత ఉన్నత స్థానానికి తీసుకెళుతుంది.
– సర్వేపల్లి రాధాకృష్ణన్"

అమ్మకానికి ఆధార్ డేటా!

సంపాదకీయం

'రూ.500 వెచ్చిస్తే, 10నిముషాల్లో ఆధార్ డేటా పూర్తి వివరాలు, ఫోటోతో లభ్యమవుతుంది' నిజమా, వైష్ణవ మాయా! నిజమేనంటున్నారు 'ది ట్రిబ్యూన్' పత్రిక ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ రచనా ఖైరా. ఈ మేరకు వార్తా కథనాన్ని ఆ పత్రిక ప్రచురించింది. ఆధార్ జారీకి, భద్రతకు కర్త అయిన యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడిఎఐ) ఆమెపై, మరి కొందరిపై ఢిల్లీ పోలీసు వద్ద క్రిమినల్ కేసు దాఖలు చేసింది. ఇది ఇప్పుడు గగ్గోలు రేపుతోంది. ఒక పత్రిక ఒక సమాచారాన్ని బట్టబయలు చేసినపుడు ముందుగా అంతర్గత దర్యాప్తు జరిపి లోటుపాట్లు వాస్తవమైతే వాటిని సరిదిద్దుకోవటం, అవసరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవటం ముఖ్యమా లేక గుట్టురట్టు చేసిన విలేకరిపై క్రిమినల్ కేసు దాఖలు చేయటం ముఖ్యమా? యుఐడిఎఐ చర్యను ఎడిటర్స్ గిల్డ్, ప్రతిపక్ష పార్టీలు, ప్రెస్‌క్లబ్‌లు ముక్తకంఠంతో ఖండిస్తున్నాయి. గిల్డ్ ఇలా వ్యాఖ్యానించింది : ''ఎంతో ప్రజా ప్రయోజనం కలిగి ఉన్న అంశంపై దర్యాప్తు చేసిన జర్నలిస్టు ను బెదిరించి లొంగదీసుకోవటానికి కేసు స్పష్టంగా ఉద్దేశించబడింది. అది బేసబబు, అసమర్ధనీయం, ప్రతికా స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడి. యుఐడిఎఇ, విలేకరిని శిక్షించేబదులు ఆరోపిత ఉల్లంఘనపై క్షుణ్ణంగా అంతర్గత దర్యాప్తు జరిపి దాని నిర్ధారణలను ప్రజలకు తెలియజేయాల్సింది. సంబంధిత మంత్రిత్వశాఖ జోక్యం చేసుకుని విలేకరిపై కేసును ఉపసంహరింపచేయాలి. ఆ విషయంలో నిష్పాక్షిక విచారణ జరిపించాలి'' ఇది తీవ్రమైన అభిశంసన లాంటిది.


గోప్యత(ప్రైవసి)ను ప్రాథమిక హక్కుగా పరిగణిస్తూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పుచెప్పాక 'ఆధార్' వివాదం బలం పుంజుకుంది. ఆధార్ చెల్లుబాటును సవాలు చేసిన అనేక పిటిషన్‌లను కలిపి మరో రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేస్తోంది. కాగా ప్రభుత్వం ప్రజలకు లబ్ది చేకూర్చే పథకాలనే గాక బ్యాంక్ ఖాతాలకు, టెలిఫోన్ ఖాతాలకు, పాన్‌కార్డులు, ఐటి రిటర్న్‌లు సహా అందివచ్చిన ప్రతిదానికీ ఆధార్ సంధానాన్ని తప్పనిసరి చేస్తున్నది. ఇక రాష్ట్రప్రభుత్వాలు సరేసరి! పౌరులందరి వ్యక్తిగత సమాచారాన్ని ఆధార్ పేరుతో సేకరించిన ప్రభుత్వం అది దుర్వినియోగం కాకుండా, లీక్ కాకుండా తీసుకుంటున్న చర్యలు లోపరహితంగా లేవు. 13కోట్లమంది ఆధార్‌కార్డు దారుల సమాచారం నాలుగు ప్రభుత్వ వెబ్‌సైట్ల నుంచి లీకు అయినట్లు బెంగళూరుకు చెందిన సెంటర్ ఫర్ ఇంటర్నెట్ అండ్ సొసైటీ అనే సంస్థ 2017మే నెలలో వెల్లడించినట్లు కాంగ్రెస్ అధికార ప్రతినిధి తెలియచేశారు. ఈ ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతోందని, ప్రభుత్వ పథకాల లోపాల గూర్చి మేధావులు వెల్లడించినపుడు వాటిని పరిశీలించే బదులు వారిపై కేసులు పెడుతూ ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేస్తోందని పేర్కొన్నారు.

వివిధ ప్రభుత్వ పథకాల లబ్దిని పేదలు పొందే సాధనంగా ప్రతి పౌరునికి ఒక గుర్తింపు నెంబరుతో ఆధార్ ప్రాజెక్టును యుపిఎ ప్రభుత్వం తలపెట్టింది. ఈ సమాచారానికి భద్రత ఏమిటంటూ అప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్రమోడీ దాన్ని వ్యతిరేకించారు. ప్రధానమంత్రి పదవిలోకి వచ్చాక ఆయనే పట్టుదలతో ఆధార్‌ను అనేకానేక పథకాలకు తప్పనిసరి చేశారు. ప్రస్తుత కేసును పరిశీలిస్తే, ఒక ''ఏజంట్'' ద్వారా ఆధార్ సమాచారాన్ని పేరు, అడ్రసు, పోస్టల్ పిన్‌కోడ్, ఫోటో, ఫోన్ నెంబర్, ఇమెయిల్ సహా రూ.500లకు సంపాదించినట్లు ట్రిబ్యూన్ ప్రచురించింది. ఇదో పెద్ద ర్యాకెట్ అని వ్యాఖ్యానించింది. ఆధార్ సమాచారం లీకు కాలేదని యుఐడిఎఐ ప్రకటించింది. అటువంటప్పుడు ఎఫ్ఐఆర్ ఎందుకు? కక్షసాధింపు తప్ప. తన వార్తా కథనంలోని ప్రతి పదానికీ తాను కట్టుబడి ఉన్నట్లు రచనా ఖైరా ఒక వార్తాసంస్థకు తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలన్నీ ప్రజలకు తెలియచేయటం తమ విధి అని, ఎవరు నేరస్థులో కాదో పోలీసు దర్యాప్తు తర్వాత నిర్ణయమవుతుందని యుఐడిఎఐ వివరించింది. ఏమైనా, ఆధార్ గుర్తింపు కార్డు మాత్రమే కాదు, 120కోట్ల ప్రజల సమస్త సమాచారాన్ని అది నిక్షిప్తం చేస్తోంది. దానికి భద్రత, గోప్యత తగినంతగా లేదనే భావన సర్వత్రా ఉంది. లోపాలను బహిర్గతం చేసిన విలేకరిపై, పత్రికపై క్రిమినల్ కేసుపెట్టటం ఎడిటర్స్ గిల్డ్ అన్నట్లు పత్రికా స్వేచ్ఛపై నిస్సందేహంగా దాడి.

దళితుల సమైక్యతపై కన్నెర్ర

చూపు

మహారాష్ట్రలోని పుణే జిల్లాలోని భీమా కోరేగావ్‌లో జనవరి ఒకటవ తేదీన కోరేగావ్ పోరాటం ద్విశత వార్షికోత్సవం సందర్భంగా దళితుల మీద ఒక పద్ధతి ప్రకారం దాడులు జరిగాయి. ఈ దాడులు చెదురుమదురుగా జరిగినట్టు కనిపించొచ్చు కాని వాటి వెనక ఒక పథకం ఉన్నట్టు స్పష్టం అవుతోంది. ఈ దాడులకు నిరసనగా మహారాష్ట్ర అంతటా దళితులు తీవ్ర నిరసనకు దిగారు. బీమా కోరేగావ్ ఉత్సవాలు హిందుత్వ వ్యతిరేక శక్తుల ఏకీకరణకు చిహ్నంగా నిలిచాయి. ఈ ఉత్సవాలకు దళిత, మైనారిటీ వర్గాల వారు నాయకత్వం వహించారు. వీరు మితవాద శక్తులను ఎదిరించే వారుగా తయారయ్యారు.



భీమా కోరేగావ్‌లో 1818లో బ్రిటిష్ సైన్యానికి, పీష్వా పాలకులకు మధ్య జరిగిన యుద్ధం దళిత చరిత్రలో ఒక మైలురాయిగా పరిగణిస్తారు. ఈ యుద్ధంలో బ్రిటిష్ సేనలు విజయం సాధించాయి. ఈ పోరాటంలో పాల్గొన్న దళాలలో మహార్ బటాలియన్ కీలకపాత్ర పోషించింది. యుద్ధంలో విజయం బ్రాహ్మణులైన పీష్వాల పాలనకు చరమ గీతం పాడింది. అందువల్ల దళితులు ఇది తమ విజయంగా భావిస్తారు. డా॥అంబేద్కర్ కూడా దీనిని దళితుల ధైర్య సాహసాలకు ప్రతీకగా భావించారు. ఇది అణగారిన వర్గాల విజయంగా భావించారు. ఆ తర్వాత ఇది అంబేద్కర్ వాదుల సంస్కృతిలో, అనేక ముఖ్య సంఘటనల్లో కీలకమైన మైలురాయిగా పరిగణించడం మొదలైంది. అంబేద్కర్ వాద సంస్కృతిని సవర్ణ హిందూ సంస్కృతికి భిన్నమైందిగా భావిస్తారు. అంబేద్కర్ మరణించిన డిసెంబర్ ఆరో తేదీన ముంబైలోని చైత్య భూమి వద్ద భారీ సంఖ్యలో హాజరై దళితులు అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తారు. అలాగే అంబేద్కర్ మనుస్మృతిని దగ్ధం చేసిన డిసెంబర్ 25న దళితులు భారతీయ స్త్రీముక్తి దివసంగా పాటిస్తారు. ప్రధానంగా దళిత బహుజన స్త్రీవాద దళితులు ఈ దివసాన్ని పాటిస్తారు. అలాగే కోరేగావ్ పోరాటంలో విజయం సాధించిన జనవరి ఒకటో తేదీని కూడా పుణేలోని కోరేగావ్‌లో వేలాదిమంది దళితులు గుమికూడి విజయోత్సవం జరుపుకుంటారు. జనవరి మూడవ తేదీ సావిత్రీ బాయి పూలే జన్మదినం. ఆ రోజును దళితులు ఉపాధ్యాయ దినోత్సవంగా పాటిస్తారు. అలాగే అంబేద్కర్ సారధ్యంలో రూపొందిన రాజ్యాంగం అమలులోకి వచ్చిన జనవరి 26ని కూడా దళితులు ముఖ్యమైన దినంగా పాటిస్తారు. ఈ దినోత్సవాలను పాటించడం దళితుల చైతన్యానికి, అంబేద్కర్ వాదుల అస్తిత్వానికి ప్రతీకగా మారిపోయింది.

కాని ఈ సంవత్సరం కోరేగావ్ దినోత్సవం హిందుత్వవాద రాజకీయాలకు ప్రతిఘటనగా నిలిచింది. అంబేద్కర్ మనవడు, భారీ బహుజన మహాసంఘ్ పార్టీ నాయకుడు ప్రకాశ్ అంబేద్కర్ భీమా కోరేగావ్ శౌర్యదిన ప్రేరణ అభియాన్‌గా పాటించాలని సంకల్పించారు. 2017 డిసెంబర్ 31న ఎల్గార్ పరిషద్ మహాసభలో ఈ విషయం ప్రకటించారు. అంటే భీమా కోరేగావ్ విజయోత్సవానికి ఒక రోజు ముందు ఈ విషయం చెప్పారు. పుణే నగరంలోని శనివార్ వాడలో మునుపటి పేష్వాల రాజభవనం ఈ విజయోత్సవాలకు వేదిక అయింది. 'నయా పేష్వాలకు (నయా ఫాసిస్టులకు) వ్యతిరేకంగా గొంతెత్తండి' ప్రధాన నినాదంగా తయారైంది. ఈ ఉత్సవాల ప్రధాన ఇతివృత్తం ప్రస్తుతం అధికారంలో ఉన్న రాజకీయవర్గంపై రాజకీయ దాడి. ఈ సమావేశంలో ప్రకాశ్ అంబేద్కర్, గుజరాత్ దళిత నాయకుడు, ఇటీవల శాసనసభ్యుడిగా ఎన్నికైన జిగ్నేశ్ మేవాని, సామాజిక కార్యకర్తలు సోనీ సోరి (ఛత్తీస్‌గఢ్), ఉల్కా మహాజన్(మహారాష్ట్ర), రోహిత్ వేముల తల్లి రాధిక వేముల, విద్యార్థి నాయకులు దొంత ప్రశాంత్, ఉమర్ ఖాలిద్ ప్రసంగించారు. ఈ ఉపన్యాసకులందరూ హిందుత్వ సిద్ధాంతాన్ని, అధికారంలో ఉన్న బిజెపిని తీవ్రంగా వ్యతిరేకించే వారే. కోరేగావ్ ఉత్సవాలలో ఈ అగ్రవర్ణ వ్యతిరేకతే సవర్ణులకు ఆగ్రహం కలిగించింది. దళితుల మీద ఈ దాడులు డిసెంబర్ 31న, జనవరి ఒకటవ తేదీన జరిగాయి. ఈ దాడి ప్రధానంగా ఉత్సవాలలో పాల్గొన్న వ్యక్తులు, బృందాలు, ఆస్తుల మీద కేంద్రీకృతమైనాయి. దాడిలో ఒకరు మరణించారు. అనేక మంది గాయపడ్డారు. అనేక కార్లు ధ్వంసమైనాయి.

ఎల్గార్ పరిషద్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించడమే పుణేలో అధిక సంఖ్యలో ఉన్న బ్రాహ్మణులకు కోపకారణం అయింది. ఈ బ్రాహ్మణులు తర్వాత ఒత్తిడికి లోనై భీమా కోరేగావ్ చరిత్ర గురించి చర్చిద్దాం రండి అని పిలుపు ఇచ్చారు. 2017లో మేధ ఖోలే అనే శాస్త్రవేత్త తన పని మనిషి తన అసలు కులం ఏమిటో తెలియ జేయలేదని, తద్వారా తమ ఇంటి స్వచ్ఛతకు భంగం కలిగించిందని ఆరోపిస్తూ కేసు దాఖలు చేయడం కూడా దళితులకు, బ్రాహ్మణులకు మధ్య ఉద్రిక్తతకు కారణం అయింది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్.సి.పి.)కూటమి కొనసాగించిన బ్రాహ్మణేతర మరాఠా రాజకీయాలను చిత్తు చేసిన బిజెపి బ్రాహ్మణ ఇతర వెనుకబడిన వర్గాల రాజకీయాలను ముందుకు తెచ్చింది. శివ ప్రతిష్ఠాన్ నాయకుడు శంభాజీ భిడే, హిందూ ఏక్తా మంచ్‌కు చెందిన మిళింద్ ఎక్బోటే దళితుల మీద దాడిలో ప్రధాన పాత్ర పోషించారు. వీరిద్దరికీ ప్రస్తుతం మహారాష్ట్రలోనూ, కేంద్రంలోనూ అధికారంలో ఉన్న బిజెపితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దౌర్జన్యానికి, మతోద్రేకాలను రెచ్చగొట్టడానికి, ముఖ్యంగా దళితుల మీద దాడి చేయడానికి సంబంధించి వీరిమీద అనేక కేసులు కూడా ఉన్నాయి. దళిత నిరసన పెల్లుబకడంతో బిజెపి ఆచితూచి ప్రవర్తిస్తోందంటున్నారు. మహారాష్ట్రలో దళితులు పదిశాతం మాత్రమే. కాని వారు అత్యంత సంఘటిత శక్తిగా ఉన్నారు. వారి మధ్య సంబంధాలు పటిష్ఠంగా ఉన్నాయి. చట్టాన్ని తమ చేతిలోకి తీసుకుని వ్యవహరించే హిందు అతివాదులని బిజెపి అదుపు చేయలేకపోతోంది. గత రెండేళ్ల కాలంలో బిజెపి దళిత వ్యతిరేక మరాఠాలను సమీకరించడం మీద ఆధారపడింది. తద్వార విశాల ప్రాతిపదికన హిందువులను సమీకరించాలని అనుకుంది. రాజకీయ ఆర్థిక వ్యవస్థపై మరాఠాలకు ఆధిపత్యం ఉండడం, సాంస్కృతిక రంగంలో బ్రాహ్మణులకు పట్టు ఉండడం వల్ల దళితులు వ్యూహాత్మకంగా తమకు అండగా ఉండేవారు ఎవరో తేల్చుకోవాల్సి వచ్చింది. నితిన్ ఆగే, కోర్డి కేసుల్లో, పద్మావతి సినిమాపై రాజపుత్రుల నిరసనలు, భీమా కోరేగావ్‌లో దళితుల నిరసనలు కుల వివక్ష న్యాయవ్యవస్థలోనూ, వీధుల్లోనూ వ్యక్తమవుతున్న వాస్తవం దళితులకు అనుభవంలోకి వస్తోంది. అయితే నయా పీష్వాలు అన్న అంశం ఆధారంగా హిందుత్వ శక్తుల మీద వ్యతిరేకత హిందూ మితవాదుల సాంస్కృతిక, రాజకీయ అవకాశాలను దెబ్బతీస్తున్నాయి. ఘర్షణలకు మూలం ఇదే.

* (ఇ.పి.డబ్ల్యు. సౌజన్యంతో)

బిట్‌కాయిన్ బొమ్మా...బొరుసా..



బి.నర్సన్
9440128169

అది కరిస్తే కాపాడలేనని తండ్రి చెప్పేలోగానే కొడుకు పామును చేతితో పట్టుకుని ఆటాడుకుంటున్నట్లున్నది దేశంలో బిట్ కాయిన్ ప్రవేశం. బిట్‌కాయిన్ కొనుగోలు మదుపుకు ప్రభుత్వం తాను జిమ్మేదారి కాదని ఏండ్ల తరబడి చెప్పుకుంటూ వస్తున్నా వేలాదిగా పెట్టుబడిదారులు బిట్‌కాయిన్ వైపు తెగింపుగా అడుగులేస్తూనే ఉన్నారు. తాజాగా 2017, ఫిబ్రవరి, డిసెంబర్ నెలల్లో రిజర్వ్‌బ్యాంకు బిట్ కాయిన్లకు మన దేశంలో చట్ట బద్ధత లేదని, నష్టపోతే ప్రభుత్వంనుండి ఎలాంటి రక్షణ లభించదని హెచ్చరికలు చేసింది. ఈ బెదిరింపులు మాకెందుకన్నట్లు బిట్‌కాయిన్ కొనుగోలుదార్లు సొంత నిర్ణయాలతో ముందుకే సాగుతున్నారు.

బిట్‌కాయిన్, ఇథెరిమ్ వంటి క్రిప్టో కరెన్సీల వ్యవహారాలను పరిశీలించేందుకు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుబాష్ గార్గ్ నేతృత్వంలో కమిటీ నియమించామని, ఆ కమిటీ నివేదిక వచ్చేవరకు ఈ కరెన్సీలన్నీ చట్టవిరుద్ధమైనవేనని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ రాజ్యసభలో తెలిపారు. ప్రభుత్వం చేతులెత్తేసినా బిట్‌కాయిన్ దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లోకి వ్యాపిస్తూనే ఉంది. ప్రభుత్వం మాటను బేఖాతరు చేస్తూ దేశంలో ఒక సమాంతర ఆర్థిక వ్యవస్థ ఏర్పడుతోంది. ప్రభుత్వం ప్రజల మంచిచెడులకు, లాభనష్టాలకు జవాబుదారీ వహిస్తుందనే విశ్వసనీయత కూడా క్రమంగా తగ్గిపోతోంది. మరో మార్గం లేక ప్రభుత్వమే ఏదో ఓ రెగ్యులేటరీ అథారిటీని నియమించి అంతా మా అధీనంలో ఉందని తృప్తి పడుతూ నమ్మింపజూ స్తుంది.

కరెన్సీ నోటు కాగితం మీది ముద్రస్థాయి నుండి దాటిపోయింది. డెబిట్, క్రెడిట్ కార్డులే కాకుండా ఇ–వాలెట్ ద్వారా చెల్లింపులు జరిగిపోతున్నాయి. ఈ విధానమంతా కంటికి కనిపించని క్రిప్టో కరెన్సీయే. అయితే బిట్‌కాయిన్ షేర్ మార్కెట్లో కొత్త సంచలనం. ఒక్కో బిట్‌కాయిన్ ధర ఈ మధ్య లక్షల్లో ఉంది. బిట్‌కాయిన్ కొనుగోలు ద్వారా ట్రేడింగ్‌లో కొనసాగుతూ దానిద్వారా వివిధ చెల్లింపులు కూడా చేయవచ్చు. ఉదాహరణ కు పిజ్జా బిల్లును కూడా బిట్ కాయిన్ బ్యాలెన్సు నుండి చెల్లించవచ్చు. మిగిలిన మొత్తం ట్రేడింగ్‌లో కొనసాగుతుంది.

2009లో సతిషినక మోటో అనే వ్యక్తి పేరుతో ప్రారంభమైన ఈ వ్యవస్థలో అంతా తెరమీద దర్శనమే. సమాచారమంతా కంప్యూటర్ సర్వర్లలో నిక్షిప్తమై ఉంటుంది. సర్వర్లలోంచి సాంకేతిక వైఫల్యాల వల్లగాని, సైబర్ నేరగాళ్ల ద్వారాగాని నిక్షిప్త సమాచారం లుప్తమైతే సొమ్ముకు ఎవరూ బాధ్యులు కాదు, దీనిపై కోర్టులో వ్యాజ్యం కూడా స్వీకరించబడదు.

ఇప్పటికే 107గిగాబైట్ల డేటా ఈ సర్వర్లలో ఉంది. వాటి నిర్వహణ బాధ్యత బిట్ కాయిన్ అమ్మకం చేసే సంస్థలు స్వీకరిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా లక్షకు పైగా వ్యాపార సంస్థలు బిట్ కాయిన్ ద్వారా చెల్లింపులను అంగీకరిస్తున్నాయి. కేంబ్రిడ్జి యూనివర్సిటీ పరిశీలన ప్రకారం ఇప్పటికి కోటికి పైగా మదుపుదారులు బిట్‌కాయిన్ వైపు మళ్లారు. మన దగ్గర గత అయిదేళ్లుగా మెల్లమెల్ల గా బిట్ కాయిన్ కదలికలు ఉన్నా అక్టోబర్ 2017 లో దాని ధర ఒక్కసారిగా 250% పెరిగిపోవ డం తో వార్తల్లోకెక్కింది. రూపాయికి రూ.250/– అని తెలియగానే మదుపుదారులు వరసకట్టారు. అయితే ఆ తర్వాత రెండురోజులకే 30% పడిపోయింది. అంటే వంద రూపాయలు దెబ్బకి జారి పోయినట్లు. ఇదంతా ఇన్‌వెస్ట్‌మెంట్, ట్రేడ్ మార్కెట్‌లో మామూ లే.

ట్రేడ్, మ్యూచువల్ ఫండ్స్‌పై ప్రభుత్వ నియంత్రణ ఉంటుంది. ట్రేడింగ్ లైసెన్సు అవసరం. షేర్లు ఆఫర్ చేసే సంస్థలు లిస్టింగ్ కావడం తప్పనిసరి. అయితే సంస్థ ఆర్థికంగా బాగుండి మదుపుదారులను మోసం చేస్తే రెగ్యులేటరీ అథారిటీ నుండి రక్షణ లభిస్తుంది. సంస్థ దివాళా తీస్తే షేర్లు కొన్నవారు నష్టపోక తప్పదు. అందుకే షేర్ల కొనుగోలు, మ్యూచువల్ ఫండ్స్‌ల్లో మదుపు ఒడుదుడుకులతో కూడుకున్నది. అయితే బిట్‌కాయిన్‌ల విషయంలో ఏ హామీ లభించదు.



బిట్‌కాయిన్ వైపు ఆకర్షించడానికి ఇంటర్నెట్ లో అవసరానికి మించిన సమాచారముంది. అయితే అదెంత ప్రమాదకారో తెలియ జెప్పేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలి. కేవలం పాత్రికేయుల సమావేశాల్లో కాకుండా సమాచారశాఖ ద్వారా ప్రకటనలిచ్చి ముందస్తుగా దేశపౌరులకు జాగ్రత్తలు సూచించవలసిన బాధ్యత ప్రభుత్వానిదే.

అయినా బిట్ కాయిన్లు కొనడానికి పెట్టుబడి వ్యాపారులు ముందుకొస్తున్నారు. 2018లో ప్రభుత్వం కూడా ఓ నిర్ణయానికి రాకతప్పదు. ఎందుకంటే ఈ వ్యాపారం చట్టబద్ధత ద్వారా ప్రభుత్వ నియంత్రణతో పాటు ఇది పన్ను పరిధిలోకి వస్తుంది.

అసోచెమ్ 2017, ఏప్రిల్ 21నాడు బెంగుళూరులో ఏర్పాటు చేసిన గ్లోబల్ సమ్మిట్‌లో బిట్ కాయిన్‌ను ఆహ్వానించింది. మళ్లీ బెంగుళూరులోనే డిసెంబర్ 14, 15 తేదీల్లో బిట్‌కాయిన్‌పై జరిగిన అవగాహనా సదస్సుకు మంచి స్పందన వచ్చింది.

ఇప్పుడు మనదేశంలో సైతం బిట్‌కాయిన్ కొనుగోలు దుకాణంలో సింగరెట్ కొన్నంత తేలిక. నెట్ సదుపాయం ఉన్న స్మార్ట్‌ఫోను ఉంటే చాలు. బిట్‌కాయిన్ అమ్మకం సంస్థలు వరుసకట్టి కనిపిస్తాయి. ఎగ్జిబిషన్‌లో దుకాన్ల మాదిరి సర్వసమాచారంతో అవి సిద్ధంగా ఉన్నాయి. కొత్తవారికి అవగాహన కలిగించడానికి సులభమైన రీతిలో క్లాసులు తీసుకుంటాయి. ప్రపంచవ్యాప్తంగా జరు గుతున్న వ్యాపారానికి సంబంధించిన వార్తలతో పాటు ఆర్థిక నిపుణులు సలహాలు కూడా చూడవచ్చు.

దేశంలో ఒక్క బెంగుళూరులోనే వేయికి పైగా బిట్‌కాయినర్లు తమకు ఉన్నారని యూనికయిన్ అనే సంస్థ చెబుతోంది. అందులో అధికులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులేనట. బిట్‌కాయిన్ వాలెట్‌ను యాపిల్ స్టోర్ నుండి గాని, గూగుల్‌ప్లే నుంచి గాని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అంతా ఆన్‌లైన్ వ్యవహారం కాబట్టి ఎలాంటి ఆర్థికసంస్థల ప్రమేయం లేకుండా ముందుకు సాగవచ్చు.

ఇప్పటికే జపాన్, బ్రిటన్, ఉత్తర కొరియా, ఉక్రెయిన్ దేశాలు బిట్‌కాయిన్‌కు చట్టబద్ధత కల్పించాయి. రష్యా, చైనా దేశాలు గుర్తించడానికి ముందుకు వస్తున్నాయి. గుర్తించిన దేశాలు బిట్ కాయిన్‌ను వినిమయవస్తువుగా ప్రకటించి పన్ను పరిధిలోకి తెచ్చాయి.మన దేశంలో బిట్‌కాయిన్ల అమ్మకం జోరందు కుందని, మొదట్లో రోజుకు 20 లావా దేవీలు జరిగేవని ఇప్పుడు డెబ్బయికి పైగా అవు తున్నా యని బై సేల్ డాట్ కో డాట్ ఇన్ సంస్థ తెలియ చేస్తోంది. ధర ఓ చోట స్థిరీకరిస్తే కొనుగోలుదార్ల సంఖ్య మరింత పెరిగి ఆశావహ, ఆరోగ్యకర పరిస్థితికి చేరుకుంటుందని ఆ సంస్థ భావన.

2017 నవంబర్ 11నాడు బిట్‌కాయిన్‌పై ప్రజా ప్రయోజక వ్యాజ్యాన్ని పరిశీలించిన సుప్రీం కోర్టు ఈ విషయంలో ప్రభుత్వం నోరు తెరవ వలసిన అవసరం ఉందన్నది.

ఏది ఏమైనా క్రిప్టోకరెన్సీలో వేలు పెట్టడం సామాన్యులతో అయ్యే పనికాదు. ఇదివరకు కూడా షేర్ల ధరల పెరుగుదలకు భ్రమసి అప్పులు చేసి ఈ దందాలో పెట్టుబడి పెట్టినవారు సర్వం కోల్పోయిన దాఖలాలున్నాయి. దేశంలో మిగులు ధనం ఉన్న కుటుంబాలు లక్షల్లో ఉన్నాయి. నష్టాలు తట్టుకునే ఆర్థిక స్తోమత ఉన్నవారు ఈ ప్రయోగాలు చేయవచ్చు. అత్యంత ప్రమాదకరమైన ఈ కొనుగోళ్లలో అవగాహనలేని వాళ్లు ప్రవేశించకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

బిట్‌కాయిన్ వైపు ఆకర్షించడానికి ఇంటర్నెట్ లో అవసరానికి మించిన సమాచారముంది. అయితే అదెంత ప్రమాదకారో తెలియజెప్పేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలి. కేవలం పాత్రికేయుల సమావేశాల్లో కాకుండా సమాచార శాఖ ద్వారా ప్రకటనలిచ్చి ముందస్తుగా దేశపౌరులకు జాగ్రత్తలు సూచించవలసిన బాధ్యత ప్రభుత్వానిదే.

ఎన్నికల బడ్జెట్‌కు ఎన్ని సవాళ్లో?

కార్పొరేట్ సంస్థల పన్నుల రేట్లను హేతుబద్ధం చేస్తామని చాలా కాలం నుంచి ఇస్తున్న హామీని 2018 బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం నిలబెట్టుకొంటుందా లేదా అన్నది పరిశ్రమల రంగం పెద్దలు ఆత్రంగా ఎదురు చూస్తున్న అంశం. సరకులు, సేవల పన్ను(జిఎస్‌టి)ని ప్రవేశపెట్టడంతో కస్టమ్స్ సుంకం మినహా అన్ని పరోక్ష పన్నులలో మార్పులు ప్రవేశపెట్టే అధికారాన్నికేంద్రం కోల్పోయింది. ఈ పరిస్థితిలో రానున్న బడ్జెట్‌లో ఎటువంటి కొత్త రాయితీలను కార్పొరేట్ సంస్థలు ఆశించడం లేదు. అయితే మోడీ ప్రభుత్వం ఖర్చు ప్రాధాన్యతల పట్ల ఎలా వ్యవహరిస్తుంది అన్నది కంపెనీలు ఎదురు చూస్తున్న విషయం. మొండి బకాయిలతో మూల్గుతున్న బ్యాంకులకు రూ.2.11 లక్షలకోట్ల పునరుజ్జీవ పెట్టుబడి పథకం అమలుపై స్పష్టత కోసం ఆర్థిక నిపుణులు ఎదురు చూస్తున్నారు.

ఆర్థిక లోటును ఎలా పూరించబోతున్నారు, ఆర్థిక వ్యవస్థలో సుస్థిరత నెలకొల్పడానికి ఏమార్గ పటాన్ని అనుసరిస్తారు అన్నది కూడా నిపుణులు ఆసక్తితో ఎదురుచూస్తున్న విషయాలు. గుజరాత్ ఎన్నికల ఫలితం వ్యవసాయ సంక్షోభంపై దృష్టి పెట్టాల్సిన తక్షణ అవసరాన్ని గుర్తు చేస్తోందని విశ్లేషకులు అంటున్నారు. సార్వత్రిక ఎన్నికలు త్వరలో జరుగనున్న నేపథ్యంలో గ్రామీణ వ్యవసాయం కింద కేటాయింపు ప్రభుత్వం పెంచవచ్చు. అంతే కాకుండా రానున్న బడ్జెట్‌లో చిన్న వ్యాపార సంస్థలకు మరిన్ని రాయితీలను ప్రకటించాల్సిన అవసరం ఉంది. జిఎస్‌టి కష్టాలవల్ల కుంటుబడిన ఉపాధి కల్పన రంగానికి ఊతం ఇచ్చేది చిన్న వ్యాపార సంస్థలే. ఆర్థికవృద్ధికి మద్దతుగా నిలిచే మౌలిక సౌకర్యాల రంగంపై కూడా బడ్జెట్ దృష్టి పెడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రస్తుత ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధిపై మరింతగా దృష్టిపెట్టక తప్పదు. అలాగే సూక్ష్మ, చిన్న సంస్థల (ఎంఎస్‌ఎంఇ) రంగంపై ఉపాధి కల్పన దృష్టితో శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. ఆర్థికశాఖ మాజీ కార్యదర్శి అశోక్ లవసా ఈ సూచనలు చేశారు. గ్రామాలలో రోడ్లు, ఇళ్లు, విద్యుత్ సరఫరా, సాగునీటి సరఫరా వంటి మౌలిక సౌకర్యాలను కల్పించడానికి కాలవ్యవధిగల ప్రత్యేక పథకాలను చేపట్టాలని కూడా లవసా సూచించారు. వచ్చే బడ్జెట్‌లో గ్రామీణ రంగానికి కేటాయింపులు పెంచాలని క్రిసిల్ అనే రేటింగ్ సంస్థ ఆర్థిక నిపుణుడు డికె జోషి సలహా ఇచ్చారు. అక్టోబర్, నవంబర్‌లో జిఎస్‌టి వసూలు తగ్గిపోవడంతో తరిగిన ఆదాయం భర్తీకి పన్నుల వసూళ్లను పెంచాలని కూడా ఆయన సూచించారు.

మౌలిక సౌకర్యాలకు పెద్దపీట అవసరం

మౌలిక సౌకర్యాలు, గ్రామీణ, ఆర్థిక రంగాలపై మరింతగా బడ్జెట్ దృష్టిపెట్టే అవకాశం ఉందని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ప్రధాన ఆర్థిక నిపుణుడు అభీక్ బారువా పేర్కొన్నారు. 2018–19లో పెట్టుబడుల రూపేణా ఎంతమొత్తం ఆదాయాన్ని ప్రభుత్వం సమకూర్చుతుందో చూడాలని, ఇది అతిముఖ్యమైన అంశమని బారువా వ్యాఖ్యానించారు. బ్యాంకుల పెట్టుబడి పునరుజ్జీవ పథకం అమలు ఏ తీరుగా ఉండబోతోంది అన్నది కూడా కీలక అంశమని ఆయన చెప్పారు. ప్రభుత్వరంగ బ్యాంకులు ఈక్విటీని స్థానిక మార్కెట్‌నుంచి సమీకరిస్తాయా లేక అంతర్జాతీయ మార్కెట్ నుంచా అని కూడా ఆయన అడిగారు. బలహీనమైన బ్యాంకుల ఈక్విటీని తీసుకోడానికి ఎవరూ ముందుకు రాకపోవచ్చన్నారు. కాబట్టి బలహీనమైన బ్యాంకులను బలమైన వాటితో కలపడం ద్వారా ప్రభుత్వం 'రీ ప్యాకేజింగ్' చేయాల్సి ఉంటుందన్నారు. బలహీనమైన బ్యాంకుల శాఖలను, ఎటిఎంలను తగ్గించి వేసే సూచన లేకపోలేదన్నారు. వనరుల సమీకరణకు ఎక్స్‌ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్(ఇటిఎఫ్)మార్గాన్ని ఎలా వాడతారు అన్నదికూడా ఇక్కడ ప్రధానమని చెప్పారు.

స్మార్ట్ ఫోన్లతో సహా కొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలపై దిగుమతి సుంకాన్ని ప్రభుత్వం ఇటీవల పెంచింది. కాబట్టి రానున్న బడ్జెట్‌లో మరికొన్ని ఇతర సరకులపై సుంకాలను సర్దుబాటు చేయవచ్చు. ఈ ఏడాది బడ్జెట్ అంచనాలకు మించి రూ. 50,000 కోట్లు రుణం సేకరిస్తామని ప్రభుత్వం చెప్పింది. ఎందుకంటే పన్నుల వసూళ్లు లక్ష్యాల మేరకు జరగకపోయే ప్రమాదం ఉంది. ఈ భయాల మధ్య అంత మొత్తం రుణం సేకరించక తప్పదని ప్రభుత్వం వివరించింది. దీనికంతటికీ జిఎస్‌టి అపసవ్యాలే కారణం. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ద్రవ్య లోటు 3.2శాతం మించకూడదన్న లక్ష్యాన్ని చేరుకోవడం ప్రభుత్వానికి సాధ్యమేనా? ఈ అంశంపై బడ్జెట్‌లో వివరణ ఇవ్వవలసి ఉంది. ఒకవేళ ద్రవ్యలోటు ఆ పరిధిని మించితే ఎక్కడెక్కడ లోటుపాట్లు ఉన్నాయన్నది స్పష్టం కావలసి ఉంది. ద్రవ్యలోటును పూడ్చడానికి నిధుల కల్పన ఎలా చేస్తారన్నదే ఈ బడ్జెట్‌లో కీలక అంశం కాబోతుందని సుజన్ హజరా అనే మరో ఆర్థిక నిపుణుడు చెప్పారు. ఆయన సంస్థాగత సెక్యూరిటీల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్. 2015లో ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వపు పూర్తిస్థాయి బడ్జెట్‌ను సమర్పిస్తూ కార్పొరేట్ పన్నును 33 శాతం నుంచి 25 శాతానికి తగ్గిస్తానని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ మాట ఇచ్చారు. అధిక పన్నుల శాతం వల్ల దేశీయ పరిశ్రమ పోటీ తత్వం లేకుండా మిగిలిందని ఆయన వాదించారు. అనేక రాయితీలను ప్రెషర్ గ్రూపులకు, లిటిగేషన్లకు తలొగ్గి ఇచ్చారని కూడా అన్నారు.

అమెరికా చెడ్డ వరవడి

అమెరికా కార్పొరేట్ టాక్స్‌ను 35 శాతం నుంచి ఇటీవల 20 శాతానికి తగ్గించిన నేపథ్యంలో అరుణ్ జైట్లీపై ఒత్తిడి పెరిగింది. కాబట్టి వచ్చే నాలుగేళ్లలో ఈ పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించే ఆలోచన చేస్తున్నట్లు కూడా మంత్రి తెలిపారు. పెట్టుబడులకు అమెరికాయే మరింత లాభకరమని మదుపర్లు భావిస్తే చాలా దేశాలు అమెరికా దారిలోనే కార్పొరేట్ పన్నును తగ్గించుకుంటాయి. 2015 బడ్జెట్‌లో రూ.5కోట్ల దాకా లావాదేవీల మొత్తం ఉన్న కంపెనీలకు కార్పొరేట్ పన్నును 29శాతానికి ప్రభుత్వం తగ్గించింది. అలాగే 2016లో కొత్తగా స్థాపించిన కంపెనీలకు 25 శాతంగా బడ్జెట్‌లో ప్రకటించింది. 2017 బడ్జెట్‌లో చిన్న వ్యాపార సంస్థల (ఎంఎస్‌ఎంఇ)కు, స్టార్టప్‌లకు పన్ను రాయితీలను ప్రభుత్వం ప్రకటించింది. అయితే అసలు హామీ ఇంకా కార్యరూపం ధరించలేదు. అది ఏమిటంటే కార్పొరేట్ పన్నుల రేట్లను హేతుబద్ధం చేస్తామన్న హామీ.

ఈ అమలు కాని హామీపై పారిశ్రామిక సంఘాలు జైట్లీకి బడ్జెట్ ముందు సంప్రదింపుల్లో డిమాండ్లు చేశాయి. కార్పొరేట్ పన్ను నియమాలను ప్రభుత్వం బాగా సడలించాలని కూడా పారిశ్రామిక సంఘాలు ఆర్థికమంత్రిని కోరుతున్నాయి. ఇందుకు పన్ను స్లాబ్‌ల సంఖ్యను తగ్గించాలి. మినహాయింపులను ఎత్తివేసి నియమాలను పూర్తిగా సులభతరం చేయాలని ప్రధానంగా అవి కోరుతున్నాయి. దీనివల్ల నియమాలకు బద్ధులు కావడానికి కంపెనీలు చేస్తున్న ఖర్చుల నుంచి వెసులుబాటు లభిస్తుంది. 2018లో జిడిపి రేటు గత నాలుగేళ్లలో తక్కువ స్థాయికి (6.5 శాతం) తగ్గిపోతుందని జోస్యాలు వెలువడుతున్న నేపథ్యంలో పెరిగిపోతున్న ధరలను తగ్గించి, రైతులకు ఆదాయాన్ని పెంచి, పేదలకు విముక్తి ప్రసాదించడానికి ఆర్థిక వనరుల సమీకరణ ప్రభుత్వం ఎలా జరుపుతుందన్నది ప్రజల ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

* నూర్ మహమ్మద్





ప్రతి దృశ్యాన్ని మనసుతో చూడాలి



ఫొటోగ్రఫీ అంటే కేవలం ఫొటోలు తీయడం కాదు. ప్రతి దృశ్యాన్ని మనసుతో చూడాలి. అంతకుముందే మనసులో ఓ చిత్రాన్ని ఊహించుకోవాలి. లక్ష కోణాల్లో ఆలోచించాలి. సరైన చిత్రం కోసం ఎన్ని రోజులైనా వేచి ఉండాలి. అలా చేయగలిగినవారు తప్పకుండా విజయం పొందుతారని అంటాడు ప్రపంచ ప్రసిద్ధి పొందిన ఆశిష్ పర్మార్.

ఓ అందమైన అమ్మాయి చేతిలో వెలుగు దివ్వె పట్టుకుని 2016 వ సంవత్సరంలో దీపావళి సందర్భంగా నవ్వులు చిందిస్తున్నట్లుగా ఉన్న ఫొటో ఆశిష్ తీసిందే. ఆపిల్ సంస్థకు చెందిన వాణిజ్యప్రకటనల హోర్డింగ్‌లపై ఈ అమ్మాయి ఫొటో ఉన్న హోర్డింగ్‌లు ఇండియాలోనే కాకుండా న్యూయార్క్, లండన్, ప్యారిస్, బీజింగ్ లాంటి పెద్ద నగరాల్లోనూ కనిపిస్తుంటాయి. ఈ అపురూప చిత్రాన్ని ఐఫోన్ కెమెరాలో బంధించింది ఆశిష్‌నే. ఆపిల్ బ్రాండ్ ప్రతీ ఏడాది తన ఉత్పత్తులైన ఐఫోన్, ఐప్యాడ్, మ్యాక్‌బుక్‌లతో తీసిన ఫొటోలతో 'షాట్ ఆన్ ఐఫోన్' పేరుతో పోటీ నిర్వహిస్తుంటుంది. 2015లో ప్రకృతి దృశ్యాలు, 2016లో మనుషుల థీమ్ ఎంచుకుని 'స్టార్టింగ్ సమ్‌థింగ్ న్యూ' పేరుతో ప్రచారం చేసింది. ఈ పోటీకి ప్రపంచవ్యాప్తంగా ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లతోపాటు వేల మంది సామాన్యులు పోటీపడ్డారు. లక్షల దరఖాస్తులొచ్చాయి. ఫిల్టర్ చేసిన అనంతరం 53 ఫొటోలు మాత్రమే ఎంపికయ్యాయి. వారినే విజేతలుగా ప్రకటించారు. తమ ఉత్పత్తుల ప్రచారానికి వీటిని వాడుకుంటున్నారు. ఆశిష్ భార్య రైనా ఉన్న ఫొటోను ఇప్పటికే పలు మ్యాగజైన్లు ముఖచిత్రంగా ప్రచురించాయి. ఈ ఫొటో నేపథ్యం గురించి ఆశిష్ చెబుతూ "ఆ రోజు దీపావళి. ఇంటి చుట్టూ దీపాలు వెలిగిస్తున్న మా అమ్మకు రైనా సాయం చేస్తోంది. పళ్లెం నిండా దీపాలు నింపుకుని ఎర్ర చీరలో ఉన్న రైనా బయటకు వస్తోంది. దీపాల వెలుగులు ఆమె ముఖంపై పడి మరింత అందంగా కనిపిస్తోంది. వెంటనే ఐఫోన్‌తో క్లిక్‌మనిపించాను. ఆ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టా. తర్వాత పోటీ గురించి తెల్సి పంపించా. ఇప్పుడు నా భార్య చిత్రం ప్రపంచమంతా కనిపిస్తోంది. విదేశాల్లో ఉన్న నా స్నేహితులు ఆ హోర్డింగుల ముందు సెల్ఫీలు దిగి పంపుతున్నారు. ఇంతకన్నా గుర్తింపేం కావాలి" అంటూ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాడు.

ఉదయాన్నే కెమేరా భుజాన వేసుకుని బయలుదేరడం..కనిపించిన చెట్టూ పుట్టా జంతువుల్ని కెమెరాలో బంధించడం...పదేళ్ల క్రితం ఆశిష్ నిత్యకృత్యం ఇది. ఆశిష్ కుటుంబం గుజరాత్ నుంచి వచ్చి బెంగళూరులో స్థిరపడింది. పదోక్లాసు వరకే చదివి, చదువుపై ఆసక్తిలేని ఆశిష్‌తో తండ్రి బెంగళూరులో ఓ చిన్న ఫొటోస్టూడియో పెట్టించాడు. ఇదంతా పదహారేళ్ల కిందటి మాట. ప్రస్తుతం ఆశిష్ వైల్డ్ లైఫ్, వెడ్డింగ్, సెలబ్రెటీ, మోడలింగ్ ..ఇలా అన్నిరకాలుగా ఫొటోలు తీసే ప్రముఖ ఛాయాగ్రాహకుడు. డీఎస్‌ఎల్‌ఆర్ కెమేరాతో మొదలెట్టి ప్రస్తుతం క్యానన్ 1డిఎక్స్, క్యానన్ 1డి మార్క్‌ఫోర్ కెమెరాలతో తన పనితనాన్ని చూపిస్తున్నాడు.



ప్రపంచవ్యాప్తంగా శిష్యులు

ఇతనికి ప్రపంచవ్యాప్తంగా శిష్యులున్నారు. పలు అంతర్జాతీయ అవార్డులందుకున్న ఛాయాగ్రాహకుడు. ఐపీఎల్ జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు అధికారిక ఫొటోగ్రాఫర్. పలు మ్యాచ్‌లకు పనిచేశాడు. ఫొటోగ్రఫీలో 9వేల మందికి శిక్షణ ఇచ్చాడు. అందులో ఎక్కువ మంది విదేశీయులే. ఇండియాతోపాటు టాంజానియా, దక్షిణాఫ్రికా, కెన్యా, శ్రీలంకలోని వన్యప్రాణి సంరక్షణా కేంద్రాలు, టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లే తరగతి గదులు. ఐదేళ్ల కిందట కౌలాలంపూర్‌లో ప్రఖ్యాత ఫ్యూచర్ మ్యూజిక్ ఫెస్టివల్ పేరుతో జరిగిన ఫెస్టివల్‌కు ఆహ్వానం అందుకున్న ఏకైక భారతీయ ఫొటోగ్రాఫర్ ఆశిష్‌నే. ఇతని చిత్రాలు వీహెచ్1 సూపర్‌సోనిక్, ఫోర్బ్స్ ఇండియా, లోన్లీ ప్లానెట్, నాట్ జియో ట్రావెల్లర్, నేషనల్ జియోగ్రాఫిక్, టైమ్, ది నేచరల్ హిస్టరీ మ్యూజియమ్, బెటర్ ఫొటోగ్రఫీ మేగజైన్ల ముఖచిత్రాలుగా వచ్చాయి. భారత్‌లోని ఎలక్ట్రానిక్ డాన్స్ మ్యూజిక్ టాప్ ఫొటోగ్రాఫర్లలో ఆశిష్ పేరు ముందుంటుంది. 2009లో క్యానన్ నేచర్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ది ఇయర్ గా ఎంపికయ్యాడు. వెడ్డింగ్ ఫొటోగ్రఫీలోనూ దిట్ట. పలువురు పారిశ్రామికవేత్తలు, సెలబ్రిటీల వివాహాలకు కెమెరా క్లిక్‌మనిపించాడు.

అశ్లీల దృశ్యాలను అరికట్టే సైన్యం





ప్రస్తుత కాలంలో పిల్లలకు కంప్యూటర్‌తో కూడిన చదువు చాలా ముఖ్యమైంది . పిల్లలు కంప్యూటర్‌లో ఏం చూస్తున్నారు? నెట్‌లో అశ్లీల దృశ్యాలు వారి కంటపడితే ఎలా? అని ప్రతీ తల్లిదండ్రుల్లోనూ భయం ఉంటుంది. పెద్దపెద్ద కంపెనీలైతే ఎంతైన ఖర్చుపెట్టి యాంటీ సాఫ్ట్‌వేర్‌లతో అలాంటి దృశ్యాలను గుర్తిస్తాయి. మరి మధ్య తరగతి వారు ఏం చేస్తారు? ఇలాంటి వారి కోసం ఉచితంగా ఓ సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసింది హైదరాబాద్ ఐఐటీకి చెందిన విద్యార్థి బృందం. అశ్లీల చిత్రాలు, దృశ్యాలను వడపోసే సైన్యం (సాఫ్ట్‌వేర్) కనుగొన్నారు. వీరి ఆలోచన బాగుండటంతో గ్లోబల్ సైబర్ ఛాలెంజ్‌లో వీరికి మూడోస్థానం దక్కించుకున్నారు బృందం సభ్యులైన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ చేస్తున్న డి.సత్యవీరారెడ్డి, భరత్, ఎంటెక్ విద్యార్థి కేవీవీ దుర్గాప్రసాద్‌లు.

అంతర్జాలంలో అశ్లీలతకు అడ్డుకట్ట వేసేలా ఈ ముగ్గురు యువకులు ఓ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేశారు. ఇప్పటి వరకు పెద్ద సంస్థలే ఇలాంటి సాంకేతికతను వాడుకుంటున్నాయి. అదే వీరు రూపొందించిన ఈ సాఫ్ట్‌వేర్‌ను ఎవరైనా ఉచితంగా వాడుకునేలా ప్రోటోటైప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇందులో భాగంగా మంచి చిత్రాలు, దృశ్యాలతో పాటు అశ్లీలంగా ఉన్న చిత్రాలు, దృశ్యాలను కంప్యూటర్‌కు ఇస్తూ దాదాపు 30గంటల పాటు పరీక్షించారు. ఏది పిల్లలు చూడొచ్చు... ఏయే చిత్రాలు అశ్లీలంగా ఉన్నాయనే విషయాన్ని కంప్యూటరే గుర్తించేలా అల్గారిథమ్ సిద్ధం చేశారు. ఇలా చేసిన తర్వాత చెడు చిత్రం, దృశ్యం కనిపిస్తే వెంటనే కంప్యూటర్ దానిని అడ్డుకునేలా చేయడంలో వీరు విజయవంతమయ్యారు. ఈ సాఫ్ట్‌వేర్‌ను నెట్‌వర్క్ గేట్‌వేలో ఇన్‌స్టాల్ చేస్తే చాలు తన పని తాను చేసుకుపోతుంటుంది.

గత సంవత్సరం నవంబరులో ఢిల్లీలో "గ్లోబల్ కాన్ఫరెన్స్ ఆన్ సైబర్ స్పేస్" కార్యక్రమం నిర్వహించారు. అదే నెల 20, 21 తేదీల్లో గ్లోబల్ సైబర్ ఛాలెంజ్ పోటీ జరిగింది. అంతర్జాలానికి సంబంధించిన అంశంలో ప్రధానంగా ఉన్న పదమూడు సమస్యలకు పరిష్కారం చూపాల్సిందిగా వీరు ఆవిష్కరణలను ఆహ్వానించారు. మొత్తం 400ల పైగా పలు బృందాలు తమ ప్రదర్శనలని చేసారు. వాటిలో ఐఐటీ హైదరాబాద్ బృందం మూడోస్థానంలో నిలిచి నవంబరు 23న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా బహుమతిని అందుకున్నారు. "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలపై కొంతకాలంగా పనిచేస్తున్నాం.ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు జరగకుండా ఇలాంటి డీప్‌లెర్నింగ్ పద్ధతిని వాడుకొని ఈ సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేసాం. సాధారణంగా అశ్లీలతకు అడ్డుకట్ట వేసే సాఫ్ట్‌వేర్ పేర్లు, ట్యాగ్‌లను గుర్తించి కొంత వరకే అడ్డుకోగలుగుతాయి. అదే అసభ్య చిత్రం ఒక మంచి వ్యక్తి, సంస్థ పేరుతో అంతర్జాలంలోకి వస్తే దానిని గుర్తించలేవు. మేం రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఇలాంటి చిత్రాలు, దృశ్యాలనూ విశ్లేషించి అవి అసభ్యంగా ఉంటే తక్షణం వాటిని అడ్డుకుంటుంది. దీనిని ఎవరైనా ఉచితంగా ఉపయోగించుకోవచ్చు. ప్రభుత్వం నుంచి మరింత మద్దతు ఉంటే దీనిని పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేసేందుకు ప్రయత్నిస్తాం" అని సత్యవీరారెడ్డి, భరత్, దుర్గాప్రసాద్‌లు పేర్కొన్నారు.

నీకంటూ ఒక మార్గదర్శి ఉండాలి..

మన శక్తి ఏమిటి? లోపం ఏమిటి? మన లక్ష్యం ఏమిటి? లక్ష్యాన్ని చేరుకోవడానికి మన శక్తి సరిపోతుందా? ఇలాంటి విషయాల పట్ల అవగాహన కలిగించడానికి , అరటిపండు ఒలిచి పెట్టినట్లు విషయాన్ని సులభంగా అర్థమయ్యేలా చెప్పడానికి ఒక మార్గదర్శి ఉండాలి. ఆ వ్యక్తి మీ కంటే వయసులో పెద్ద వ్యక్తి కావచ్చు. మీ స్నేహితుడు కావచ్చు. మీ కుటుంబ సభ్యులలో ఎవరో ఒకరు కావచ్చు. ఎవరైతే తన సలహాలతో మీరు మీ లక్ష్యాన్ని చేరుకోనేలా చేస్తారో.. వారే మీ గురువు, మార్గదర్శి. ప్రతి విజేత వెనుక ఒక మార్గదర్శి తప్పనిసరిగా ఉంటారని మానసిక విశ్లేషకులు చెబుతుంటారు. ఇటీవలి కాలంలో గురువును ఎంచుకొనే విషయంలో యువతరం చాలా ముందుంది. కొన్ని స్వచ్ఛందసంస్థలు గురుశిష్యుల మధ్య మరింత అవగాహన పెంచడం కోసం ప్రత్యేక సమావేశాలు కూడా ఏర్పాటు చేస్తున్నాయి. మరి మీ మాట ఏమిటి, మీ కంటూ ఒక గురువు ఉన్నాడా , ఉంటే ఓకే ... లేకపోతే ఇప్పటికే ఆలస్యమైంది. సరైన గురువును ఎంచుకునే పనిలో ఉండండి. విజయతీరాల వైపు పయనించండి.



మిస్టర్ పర్‌ఫెక్ట్

వీక్ డేస్‌లో ఫార్మల్, వీకెండ్స్‌లో క్యాజువల్ డ్రెస్సులు ధరించడం సాధారణమే. ఏదైనా ఫంక్షన్లు, ప్రత్యేక వేడుకలకు వెళ్లినప్పుడు సెంటరాఫ్ ఎట్రాక్షన్‌గా కనిపించాలంటే మాత్రం ట్రెడిషనల్ వేర్ బాగుంటుంది. శుభకార్యాల్లో మిస్టర్ పర్‌ఫెక్ట్‌గా కనిపించాలంటే ఎలాంటి దుస్తులు ధరించాలో చూద్దాం...



కుర్తాపైజమా: సంప్రదాయ లుక్ కోసం సిల్క్ ఫ్యాబ్రిక్‌తో తయారైన కుర్తా పైజమా తీసుకోవాలి. డీసెంట్‌గా కనిపించాలంటే సింగిల్ షేడ్‌కు బదులు ఆరెంజ్, రెడ్, ఎల్లో, నేవీ బ్లూలాంటి ముదురు రంగులను ఎంచుకోవాలి. పైజామాకు బదులు సల్వార్ కూడా ధరించొచ్చు.



జోధ్‌పురీ: స్టయిలిష్‌గా కనిపించాలంటే జోధ్‌పురీ ప్యాంట్‌కు మించింది మరోటిలేదు. జోధ్‌పురీ ప్యాంట్‌తోపాటు షార్ట్ లెన్త్‌కుర్తా లేదా వెస్ట్ కోట్ ధరించాలి. దీనిపై నెహ్రూ జాకెట్ కూడా వేసుకోవచ్చు.



ధోతీ: స్వచ్ఛమైన సంప్రదాయ లుక్ కోసం ధోతీ ధరించడం ఉత్తమం. స్టయిల్‌తోపాటు కంఫర్ట్‌గా ఉంటుంది. మార్కెట్‌లో రెడీమేడ్ ధోతీ ప్యాంట్స్ దొరుకుతాయి.

రిపబ్లిక్ డే వేడుకల ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష



మన తెలంగాణ /హైదరాబాద్ : సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జనవరి 26న నిర్వహించనున్న గణ తంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పి సింగ్ వివిధ శాఖల ఉన్నతాధి కారులతో సోమవారం సమీక్ష జరిపారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకుని పనులు వేగంగా సాగేలా చూడాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. పరేడ్ గ్రౌండ్‌లో జరిగే గణతంత్ర వేడుకలకు గవ ర్నర్ నరసింహన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, అవసరమైన పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియం త్రణ ఏర్పాట్లు చేయాలన్నారు. జిహెచ్‌ఎంసి ద్వారా పరేడ్ గ్రౌండ్స్‌లో పారిశుద్ధ్యం, మొబైల్ టాయిలెట్ల నిర్వహణ , అలాగే గన్‌పార్కు, ఫతే మైదాన్, క్లాక్ టవర్ పతదిర ప్రాంతాలను విద్యుద్దీకరించాలన్నారు. రాజ్‌భవన్, సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, చార్మినార్ లతో పాటు చారిత్రక ప్రాధాన్యత గల భవనా లను కూడా విద్యుద్దీకరించాలని ఆదేశించారు. నిరంతరాయ విద్యుత్ సరఫరాకు విద్యుత్ శాఖ చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిఎడి ముఖ్య కార్యదర్శి అదర్ సిన్హా, గవర్నర్ ముఖ్య కార్యదర్శి హరిప్రీత్ సింగ్, రహదారులు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, జల మండలి ఎండి దాన కిశోర్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాస రావు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ అసెంబ్లీ దేశానికే స్ఫూర్తి

● అఖిల భారత విప్‌ల సదస్సులో పల్లా

మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర చట్టస భలునిబంధనలను అమలు చేయడంలో ముందంజలో ఉన్నాయని శాసనమండలిలో ప్రభుత్వ విప్ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో సోమవారం ప్రారంభమైన అఖిల భారత విప్‌ల సద స్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత విప్‌ల సదస్సుల్లో చేసిన తీర్మానాలను తెలంగాణలో అమలు చేసిన తీరును ఆయన వివరించారు. సజావుగా సభ నిర్వ హణ, క్రమశిక్షణ, ప్రైవేటు మెంబర్స్ బిల్లు, కోడ్ ఆఫ్ కాండక్ట్, కోడిఫికేషన్ ఆఫ్ ప్రివిలేజెస్, సభ్యుల హాజరు శాతం, సభ్యులకు శిక్షణ, ఈ – లెజిస్లేచర్, కనీస పని దినాల వంటి తొమ్మిది కీలక అంశాలపై గోవా సదస్సులో తీర్మానాలు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తరువాత 2016లో విశాఖపట్నంలో జరిగిన విప్‌ల సద స్సులో కూడా వీటి అమలు చర్చ జరిగిందన్నారు. దేశ వ్యాప్తంగా చట్ట సభల సభ్యులందరికీ జీతభత్యాలు చెల్లిం పు విషయంలో ఒకే విధానం ఉండే విధంగా స్వతంత్ర కమిషన్ ఏర్పాటు, చట్ట సమావేశాల ప్రారంభానికి మందు, సమావేశాల సమయంలోనే బిఏసి సమావేశాలు



నిర్వహణ,సభలో అర్థవంతమైన చర్చకు ఇంటర్‌పార్టీ ఫోరం ఏర్పాటు,ఎంపి,ఎంఎల్‌ఏలకు ఇచ్చే నిధుల సద్వి నియోగం,వంటి అంశాలపై కూడా గత సదస్సులో నిర్ణ యాలు జరిగాయన్నారు. గోవా సదస్సు సిఫార్సులకు అనుగుణంగా తెలంగాణ సమావేశాల్లో పని గంటలు గణనీయంగా పెరిగాయని, ప్రైవేటు మెంబర్స్ డేకు రెండు రోజులు కేటాయించామని, సభ్యుల హాజరు గణ నీయంగా పెరిగిందని వివరించారు. ప్రతి అంశం చర్చ కు వచ్చేలా చూస్తున్నామని, సభ్యులు అడిగిన ఏ ప్రశ్న కైనా ప్రభుత్వం సమాధానమిచ్చేలా చర్యలు తీసుకుంటు న్నామని చెప్పారు. శీతాకాల సమావేశాలను 20 రోజుల పాటు నిర్వహించడం ద్వారా తెలంగాణ చట్ట సభలు దేశానికే స్ఫూర్తినిచ్చాయన్నారు.


శాసనసభ విప్ గొంగిడి సునీత మాట్లా డుతూ సభలను సమర్థవంతంగా నడిపించడం విప్‌లకు పెద్ద సవాలు లాంటిదని, పార్టీలకతీతంగా అందని చర్చల్లో భాగస్వామ్యం చేసేందుకు విప్‌లు నిరంతరం సంప్రదింపులు జరపాలన్నారు. సభా సమయం దుర్విని యోగం కాకుండాఎప్పటికప్పుడు సమన్వయం చేసుకో వాలని సూచించారు. తెలంగాణ చట్ట సభలు సమర్థవం తంగా నడవడానికి అన్ని పార్టీలు సహకరిస్తున్నాయని తెలిపారు. తాను మొదటిసారి శాసనభకి ఎన్నికైనా సీని యర్ల సలహాలు తీసుకుంటూ విప్ బాధ్యతలను సమర్థ వంతంగా పోషించేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కు మార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాల ప్రభుత్వ విప్‌లు హాజరయ్యారు. తెలంగాణ నుండి శాసనమండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఉభయ సభల విప్‌లు బోడకుంటి వెంకటేశ్వర్లు, గంపా గోవర్ధన్, శాసనసభ కార్యదర్శి వేదాంతం నర్సింహాచారు యలు పాల్గొన్నారు.



బిజెపికి కొమ్మూరి రాజీనామా

మన తెలంగాణ / హైదరాబాద్ : మాజీ ఎంఎల్‌ఏ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి బిజెపికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కార ణాలు, జనగామ ప్రజలు, అభిమానుల కోరిక మేరకే తాను బిజెపికి రాజీ నామా చేశానని చెప్పారు. ఏ పార్టీలో చేరాలనే విషయంపై జిల్లా ప్రజల అభీష్టం మేరకు ఒకటి రెండు నెలల్లో నిర్ణయం తీసుకుంటానని ఆయన తెలిపారు. నగరంలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆడిటోరియంలో సోమ వారం జరిగిన సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జనగామ బిజెపిలో క్రమశిక్షణ లేదని, సవరించడానికి ప్రయత్నించినా సాధ్యం కాలే దని, అది కూడా తన రాజీనామాకు ఒక కారణమన్నారు. తన వ్యక్తిగత ప్రతిష్టను కాపాడుకునేందుకు కూడా రాజీనామా చేశానన్నారు.ప్రజల ఒత్తిడి వల్లే రాజీనామా చేశానన్నారు.అన్ని మండలాల్లో నాయకులు బిజె పికి రాజీనామా చేస్తున్నారన్నారు.

నేతి విద్యాసాగర్‌కు మాతృ వియోగం



హైదరాబాద్/మనతెలంగాణ: శాసనమండలి ఉపసభా పతి నేతి విద్యా సాగర్ తల్లి రాధమ్మ సోమవారంనాడు ఉదయం కన్నుమూశారు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె మరణించారు. నకిరేకల్ నియోజక వర్గ పరిధిలోని చెరుకుపల్లిలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. విద్యాసాగర్ తల్లి మృతి పట్ల విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీష్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నట్టు పలువురు ప్రముఖులు పేర్కొన్నారు.

త్వరలో కాంగ్రెస్ బస్సుయాత్ర

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొంటారని చెప్పారు. టిఆర్‌ఎస్ మునిగిపోతున్న నావ అని, బరువెక్కు వైందని, పనితీరు కూడా సరిగా లేదన్నారు. వచ్చే ఎన్నికల తరువాత నిస్సందేహంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. పిసిసి అధ్యక్షునిగా కొనసాగిస్తూ ఎఐసిసి ఉత్తరువులు జారీ చేసిన తరువాత తొలిసారిగా సోమవారం గాంధీభవన్‌కు వచ్చిన ఉత్త మ్‌కు ఘన స్వాగతం లభించింది. వివిధ జిల్లాలకు చెందిన నాయకులు, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు పోటీలు పడి పూలదండలు వేశారు. అనం తరం ఆయన జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. సంక్రాంతి తరు వాత ఇతర పార్టీల నుండి పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరికలు ఉండబోతు న్నాయని, బేషరతుగా వచ్చే వారినే పార్టీలో చేర్చుకుంటున్నామని తెలి పారు. సంక్రాంతి తరువాత పిసిసి కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని, ఇందులో పనిచేయని వారిని పక్కకుబెట్టి, పని చేసే వారిని పెడతామ న్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక కార్యదర్శి, ఉమ్మడి జిల్లా మూడు ఒక ప్రధాన కార్యదర్శి పదవులు, 13 మంది ఉపాధ్యక్షులు ఉంటారని వివ రించారు. త్వరలో మ్యానిఫెస్టో, ప్రచార కమిటీని కూడా వేయబోతున్నా మని, ఎఐసిసిలో కూడా సిడబ్ల్యుసి, ప్రధాన కార్యదర్శి పదవులు తెలం గాణ నాయకులకు రాబోతున్నాయని చెప్పారు. రాహుల్‌గాంధీ సభ మేడారం జాతరకు ముందుగాని, తరువాత గాని ఉంటుందని చెప్పారు. గతంలో హామీ ఇచ్చినట్లుగా ఉస్మానియా యూనివర్సిటీలో కూడా రాహు ల్ సభను పెట్టేందుకు ఆలోచన చేస్తున్నామని వెల్లడిచారు. నియోజకవ ర్గాల పునర్విభజనపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు పెట్టిన తరు వాత కాంగ్రెస్ పార్టీ నిర్ణయాన్ని వెల్లడిస్తుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పా రు. తనకు స్వాగతం పలికిన కార్యకర్తలను ఉద్దేశించి ఉత్తమ్ మాట్లా డుతూ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా, సమస్య వచ్చినా నేరుగా తనకు ఫోన్ చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయ న ఫోన్ నెంబర్‌ను వెల్ల డించారు. తాను రెండోసారి పిసిసి అధ్యక్షునిగా కొనసాగేందుకు అవకాశ మిచ్చిన రాహుల్‌గాంధీకి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

నేరెళ్ళ శారదకు కౌన్సిల్‌లో అవకాశం: మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షు రాలు నేరెళ్ళ శారదకు ఎంఎల్‌సి పదవి ఇచ్చే అవకా శం ఉన్నదని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో జరిగిన మహిళా కాంగ్రెస్ సమావే శంలో ఆయన మాట్లాడారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వంలో మహిళలకు ప్రాధా న్యం లేదని, మంత్రి వర్గంలో ఒక్క మహిళా లేదని, శాసనమండలిలో ఉన్న ఒక్క మహిళా సభ్యురాలు కాంగ్రెస్ తరుపునే ఎన్నికయ్యారని చెప్పారు.

యజమానులవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

నాటికి ఐటీ ఎగుమతి రూ. 56 వేల కోట్లుగా ఉందని, ఇప్పుడు అది రూ. 87 వేల కోట్లకు చేరుకుందని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మూడేళ్లలో సుమారు లక్ష మందికి ఐటీ రంగంలో ప్రత్యక్ష ఉపాధి లభిం చిందని, పరోక్షంగా ఇంకా చాలా ఉద్యోగాలు వచ్చాయని అన్నారు. తెలం గాణ ఏర్పడితే కరెంటు కష్టాలు వస్తాయని చాలా మంది భయపెట్టారని, రాష్ట్రం ఏర్పడకుండా ప్రజల్లో గందరగోళంసృష్టించి అడ్డుకునే ప్రయత్నం చేశారని, కానీ మూడున్నరేళ్ళలోనే వాటిని పటాపంచలు చేస్తూ 24 గంటల విద్యుత్ సరఫరా కల్పించే స్థాయికి ఎదిగామని, సులభ వాణిజ్య విధానంలో ఏకంగా దేశంలోనే తొలి స్థానంలో నిలిచామని, ఇందుకు ప్రధాన కారణం రాష్ట్ర అభివృద్ధిపై స్పష్టమైన అవగాహన కలిగిన ముఖ్య మంత్రి కెసిఆర్ అని అన్నారు. కేవలం హైదరాబాద్ మాత్రమే కాక ద్వితీయ శ్రేణి పట్టణాలైన వరంగల్, కరీంనగరల్‌లలో కూడా ఐటీ రంగాన్ని వృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. ఇప్పటికే వరంగల్‌లో ఐటీ హబ్‌ను ఏర్పాటు చేశామని, ఇప్పుడు కరీంనగర్‌లో ఐటీ టవర్‌కు శంకుస్థాపన చేశామని, త్వరలోనే మరో టవర్‌కు కూడా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఐటీ రంగంలో రాణించేందుకు యువతకు కరీంనగర్ పట్టణంలోనే 'టాస్క్' (తెలంగాణ ఆకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జి)ని నెలకొల్పనున్నామని తెలిపారు. కరీంనగర్‌లో ఐటీ పార్కు ద్వారా తొలి దశలో సుమారు వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభిస్తా యని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి ఈటల, ఎంపీ వినోద్ , ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మ ణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రదీప్ పశ్చాత్తాపం

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా తనకు తెలిసిన విషయాలు మిగతా వారికి తెలియజేస్తానన్నారు. తాను చేసినట్లు ఎవరు కూడా చేయవద్దని విజ్ఞప్తి చేశారు. డ్రంకెన్‌డ్రైవ్ గురించి అర్థమయ్యే విధంగా పోలీసులు వివరణ ఇచ్చారన్నారు. తనకు మద్దతు ప్రకటించిన వారందరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.

కేంద్రం పునరాలోచన

(మొదటిపేజీ తరువాయి)

దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం ఈ విషయంపై విచారణ చేపట్టనుంది. 2016 నవంబర్‌లో జాతీయ గీతాన్ని సినిమా థియేటర్లలో ఖచ్చితంగా ప్రసారం చేయాలని, ఆ సమయంలో ప్రేక్షకులం దరూ ఖచ్చితంగా లేచి నిలబడాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. కేం ద్రం తీసుకున్న ఈ నిర్ణయంపై దేశవ్యాప్తంగా పలు సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని దుయ్యబట్టాయి. ఎందరు ఎన్నిరకా లుగా నిరసనలు వ్యక్తం చేసినా వెనక్కుతగ్గని ప్రభుత్వం ఇప్పుడు ఈ విష యంలో పునరాలోచనలో పడడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

రాష్ట్రం ఆశలు

(మొదటిపేజీ తరువాయి)

పంపాల్సిన ప్రతిపాదనలపైనా, రానున్న బడ్జెట్ ప్రతిపాదనల పైనా విస్తృతంగా చర్చ జరిగింది. పద్నాల్గవ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు పన్నుల్లో రాష్ట్రాల వాటా 32% నుంచి 42%కి పెరిగిందని, పదిహేనవ ఆర్థిక సంఘంలో మన రాష్ట్ర వాటా మరింత పెరిగేలా అన్ని శాఖల కార్యదర్శులూ సమగ్ర మైన నివేదికలను, ప్రతిపాదనలను నిర్దిష్ట నమూనా ప్రకారం తయారుచేయాలని ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంఘం సిఫా రసుల మేరకు రాష్ట్రానికి అందుతున్న పన్నుల వాటాకంటే పది హేనవ ఆర్థిక సంఘం సిఫారసుల ద్వారా పెరగాల్సిన అవ సరం ఉందని, ఆ దిశలో అన్ని శాఖలూ ఎక్కువ మొత్తంలో నిధులు పొందేలా నివేదికల తయారీ ఉండాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నివేదికలను సమగ్ర వివరాలతో రూపొందించాలని సూచించారు. 2019 అక్టోబర్ 30వ తేదీకల్లా ఆర్థిక సంఘం తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉన్నందున మన రాష్ట్రం నుంచి ఏప్రిల్‌కల్లా ప్రతిపాదనలు, నివేదిక, వివరాలు సిద్ధంగా ఉండా లని స్పష్టం చేశారు. ఏప్రిల్ లేదా మే నెలలో ఆర్థిక సంఘం ప్రతి నిధులు తెలంగాణను సందర్శించనున్న దృష్ట్యా అప్పటికల్లా తుది నివేదికలు సిద్ధం కావాల్సి ఉందన్నారు. ఇందుకోసం ముసాయిదా నివేదికలను వచ్చే నెల 7వ తేదీకల్లా సిద్ధం చేయా లని అధికారులకు సిఎస్ స్పష్టం చేశారు. ఆయా శాఖలు చేపడు తున్న పనులు, వాటి ప్రగతి, లక్ష్యాలు తదితర వివరాలన్నీ నివే దికలో ఉండాలని సూచించారు. ఆర్థిక సంఘం నిర్దిష్టంగా నమూనాను, కొన్ని మార్గదర్శకాలను అందజేసినప్పటికీ దాని పైన ఆయా శాఖలకు అవగాహన ఉండడం అవసరమని అన్నారు. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలు, పంచాయతీ రాజ్, విద్యుత్, ఆరోగ్యం, పరిశ్రమలు, ఇంజనీర్ విభాగాలాంటి ముఖ్యమైన శాఖలన్నీ ప్రత్యేక దృష్టి సారించాలని సూచిం చారు.గత ఆర్థిక సంఘంతో పోల్చుకుంటే పదిహేనవ ఆర్థిక సంఘంలో కొన్ని కొత్త అంశాలు ఉన్నాయని, ఎక్కువ నిధులు అందే అవకాశాలు ఉన్నాయని, మన రాష్ట్ర ఆర్థిక వృద్ధి ఇందుకు చాలా దోహదకారిగా ఉంటుందని ఒక అధికారి వ్యాఖ్యానించారు. ఆయా రాష్ట్రాలు వివిధ అంశాల్లో సాధిస్తున్న ప్రగతికి కూడా గుర్తింపు, దానితో పాటు అదనపు నిధుల విడు దల ఈ ఆర్థిక సంఘం మార్గదర్శకాల్లో కొత్త అంశమని వివరిం చారు. సులభ వాణిజ్య విధానం, పారిశ్రామిక విధానం లాంటి కొన్ని అంశాలు తెలంగాణకు కలిసొచ్చే అంశాలని, 'పర్ఫా ర్మెన్స్' విభాగం కింద అదనపు నిధులు ఈ ఆర్థిక సంఘం ద్వారా రావడానికి చాలా అవకాశాలు ఉన్నాయని వివరిం చారు. జనాభా నియంత్రణ, నగదురహిత లావాదేవీల్లో రాష్ట్రా నికి వస్తున్న ర్యాంకింగ్ కూడా అదనపు నిధులకు మార్గాన్ని సుగమం చేస్తుందన్నారు. తలసరి ఆదాయం విషయంలో సైతం తెలంగాణ చాలా ఉత్తమ ఫలితాలు సాధించిందని, ఇది కూడా మనకు అదనపు నిధులు తీసుకురావడంలో దోహదపడు తుందన్నారు. తలసరి ఆదాయం పెరగడంలో ప్రధానంగా హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాలు గణనీయమైన పాత్ర పోషించాయని, ఇదే తీరులో మిగిలిన జిల్లాల్లో కూడా పెరగడా నికి అవసరమైన చర్యలు తీసుకోవడం ద్వారా రాష్ట్రానికి మరింత ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ఎక్కువగా వర్షాధారిత సేద్యం ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను నిర్మించి ఎత్తిపోతల ద్వారా సాగునీటి సరఫరా చేస్తున్నందువల్ల ఇలాంటి ప్రాజెక్టుల నిర్మాణానికి పదిహేనవ ఆర్థిక సంఘం సిఫారసుల ద్వారా ఎక్కువ నిధులు వచ్చే అవ కాశం ఉందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఆర్థిక శాఖ సలహా దారు జిఆర్ రెడ్డి కేంద్ర ఆర్థిక సంఘానికి సమర్పించాల్సిన మెమోరండంలో పొందుపర్చవలసిన అంశాలపై అన్ని శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. ప్రతి శాఖ కచ్చితమైన సమాచారంతో నివేదిక ఇవ్వాలన్నారు. స్థానిక సంస్థలకు గ్రాంట్లు, పన్ను విలువలను మదింపుచేసే వివరాలు, జిల్లాలవా రీగా జరుగుతున్న అభివృద్ధి, వివిధ అంశాలలో సాధించిన ప్రగతి, వ్యూహాత్మక అభివృద్ధి లక్ష్యాలు, ఆదాయ వ్యయాలు, పన్నుల వసూలు తదితర అంశాలపై వివరించారు. సందేహా లను నివృత్తి చేయడానికి ఆర్థిక శాఖలో ప్రత్యేకంగా ఒక విభా గాన్ని, నోడల్ అధికారిని నియమిస్తున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర ఆర్థిక సంఘం మొదటిసారిగా రాష్ట్రాల పురోగతిని దృష్టిలో ఉంచుకొని ఇన్సెంటివ్ ఆధారిత గ్రాంట్‌లను ఇవ్వనుం దని, ఇందుకోసం కొన్ని అంశాలను ప్రాతిపదికగా తీసుకుం టుందన్నారు. ఈ అంశాలపై రాష్ట్రానికి సంబంధించి ప్రత్యే కంగా నివేదికలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అన్ని శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలు ఈ నెల 15 నాటికి సమర్పించాలని, ఆర్థి కశాఖ ముఖ్యకార్యదర్శి కె.రామకృష్ణారావు స్పష్టం చేశారు. ప్రతి శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలు సి.జి.జి పోర్టల్ లో ఉంచామని, వాటిని సరిచూసుకొని ఏమైనా తేడాలుంటే తెలపాలన్నారు. వివిధ ఇంజనీరింగ్ శాఖలలో వర్క్‌చార్జ్డ్, డెయిలీ వేజ్, ఫుల్ టైం, పార్ట్ టైం, కంటింజెంట్, అంగన్ వాడీలు, హోంగార్డు, వి ఆర్ ఏ ల వివరాలను కూడా సమర్పిం చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులు జమచేస్తున్న బ్యాంక్ అకౌంట్ వివరాలతో పాటు ఆయా విభాగాలు లావాదేవీలు జరుపుతున్న అన్ని బ్యాంకు ఖాతాల వివరాలను సమర్పించాల న్నారు. ఎస్సి,ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధులపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్ ప్రత్యేకంగా సమీక్ష చేసి నిధుల వ్యయాన్ని వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అజయ్ మిశ్రా, రాజే శ్వర్ తివారి, చిత్రా రామచంద్రన్, ముఖ్యకార్యదర్శులు రామ కృష్ణారావు, అధర్ సిన్హా, రజత్ కుమార్, శాలిని మిశ్రా, సోమేష్ కుమార్, శశాంక్ గోయల్, రాజీవ్ త్రివేది, వికాస్ రాజ్, జయేష్ రంజన్, కార్యదర్శులు బి.వేంకటేశం, పార్థసారధి, దానకిషోర్, సందీప్ సుల్తానియా, శివశంకర్, జగదీశ్వర్, బెన హర్ మహేశ్ దత్ ఎక్కా, సవ్యసాచి ఘోష్, ఆర్.వి.చంద్రవ దన్, పంచాయితీరాజ్ కమీషనర్ నీతూ ప్రసాద్ పాల్గొన్నారు.

రైతుకు చేర్చేదెలా?

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి ప్రశ్నించారు. అన్ని బ్యాంకులతో మంగళ వారం సమావేశం ఏర్పాటు చేస్తామని, బుధవారం కల్లా వివరాలను వెల్లడించగలమని స్పష్టం చేశారు. దీంతో తదుపరి సమావేశం బుధవారానికి వాయిదా పడింది. బ్యాంకులతో ఈ ఇబ్బంది ఎదు రవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో పోస్టాఫీసుల ద్వారా చెల్లించడంపై కూడా మంత్రులు చర్చించారు. నగదు పంపిణీ చేయాలనుకున్నట్లయితే గ్రామ స్థాయి వరకు కరెన్సీ నోట్లను రవాణా చేయడంలోని ఇబ్బందు లపై చర్చించారు. పైగా రిజర్వు బ్యాంకు నిబంధ నల ప్రకారం నిర్దిష్ట మోతాదుకంటే ఎక్కువ మొత్తంలో డబ్బును రవాణా చేయడంలోని చిక్కు లపై కూడా చర్చించారు. దీనికి తోడు గ్రామాల్లో సభలు, సమావేశాలను నిర్వహించడం ద్వారా రైతుల అభిప్రాయాలను మరోమారు తెలుసుకో వడం, ప్రజా ప్రతినిధుల నుంచి సేకరించడం తది తరాలను కూడా ఈ సమావేశం పరిగణనలోకి తీసుకుంది. మంత్రివర్గం ఉప సంఘం తొలి భేటీ కాబట్టి రైతులకు ఏ విధంగా ఆర్థిక సాయాన్ని పంపిణీ చేయాలన్నదానిపై తుది నిర్ణయం జరగ లేదు. బుధవారంనాటికి స్పష్టత రానుంది. నాలు గు రోజులకల్లా ఈ కమిటీ స్పష్టమైన నిర్వహణా విధి విధానాలను ప్రభుత్వానికి నివేదిక రూపంలో సమర్పించాల్సి ఉన్నందున బుధవారం జరిగే సమావేశంలో స్పష్టమైన నిర్ణయం వెలువడనుంది. ఈ సమావేశం అనంతరం మంత్రి పోచా రం శ్రీని వాసరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆర్థిక సాయం అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, ఇందుకు అవలంబించాల్సిన విధి విధానాలపై ఈ కమిటీ సిఫారసులను ప్రభుత్వానికి తెలియజేయాల్సి ఉందని పేర్కొన్నారు. దేశమంతా తెలంగాణవైపు చూస్తూ ఉందని, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ సాయం అందడం ద్వారా యావత్తు దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత 71.75 లక్షల మంది రైతులకు భూ ఖాతాలు ఉన్నట్లు లెక్క తేలిందని, వీరికి ఆర్థిక సాయం చేయడంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నందువల్లనే మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు, ఇప్పుడు తొలి సమావేశం జరగడం అని వివరించారు. తొలి సమావేశం కాబట్టి అన్ని వైపుల నుంచి అభిప్రాయాలను తెలు సుకున్నామని, బుధవారం సమావేశంలో స్పష్ట మైన నిర్ణయం జరుగుతుందని అన్నారు. ప్రభు త్వం ఇచ్చే పెట్టుబడి నేరుగా రైతుకు చేరాలన్నదే ప్రధాన లక్ష్యమని అన్నారు. బ్యాంకు ఖాతా ల్లో జమచేస్తే పాత బకాయిలకు మినహాయించుకుం టారనే అనుమానాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నా రని, అందువల్లనే బ్యాంకుల వైఖరిని వెల్లడించా లని కోరినట్లు తెలిపారు. అన్ని వైపుల నుంచి వచ్చే అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయం జరుగు తుందని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, టి.హరీష్‌రావు, ఈటల రాజేందర్, కెటిఆర్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, వ్యవసాయ కార్యదర్శి సి.పార్థసారధి, ఆర్థికశాఖ ముఖ కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవ సాయ శాఖ కమిషనర్ జగన్మోహన్, బ్యాంకర్ల ప్రతినిధులు, పోస్టాఫీసు చీఫ్ జనరల్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

సంగీత నిరశన

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నాను. ఈ క్రమంలో నాకు మద్దతుగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మహిళా సంఘాల నాయకులు మద్దతిచ్చారు. అయితే రాష్ట్ర ప్రభు త్వం తరుపున తనకు మద్దతును ఇచ్చి నాకు న్యా యం చేస్తానని చెప్పిన మల్కాజిగిరి ఎంపి మల్లా రెడ్డి, నీకు నేనున్నాను అని భోరసా ఇచ్చిన స్థానిక ఎంఎల్‌ఏ సుధీర్ రెడ్డితో సహా అనేక మంది రాజ కీయ నాయకులు ఇంత వరకు నాకు ఏలాంటి న్యాయం చేయలేదు అందుకే నా నిర్ణయం మార్చు కున్నా నా ప్రాణాలు పోయినా పర్వాలేదు నా బిడ్డ భవిష్యత్ నాకు ముఖ్యం ఆమె కోసం నేను దేని కైనా సిద్ధమేనని, గత యాభై రోజులుగా నేను చలిలో చిన్న పాపతో ఇంటిముందు కూర్చొని నిర సన దీక్ష చేస్తున్నా ఇప్పటి వరకు నాకు ఏలాంటి న్యాయం జరుగలేదు. న్యాయం జరుగక పోగా నా అత్తంటిపై ధౌర్జన్యం చేశానని నాపై తప్పుడు కేసులు బనాయించడం న్యాయామా అని ప్రశ్నిం చింది. నాకు స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు నిరా హార దీక్ష కొనసాగిస్తానని తెలిపింది. ఈ కార్యక్ర మంలో ప్రముఖ సామాజిక ఉద్యమకారిణి పి.దేవి, వి.సుర్యావాణి, ఐద్వా మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు ఎన్.సృజన, బిజెపి మహిళ మోర్చ నాయకురాళ్లు గీతలు పాల్గొని సంగీతకు న్యాయం జరిగే వరకు పోరాటంలో పాలుపంచుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా నిరహార దీక్ష చేస్తున్నా సంగీతకు ప్రైవేటు వైద్యులచే పరీక్షలు నిర్వహించారు.



ఇంజినీరింగ్ విద్యార్థులు

(మొదటిపేజీ తరువాయి)

ఎల్ బి నగర్‌లోని ముసారంబాగ్‌లో నివాసం ఉంటున్నాడు. అదేజిల్లా, అదే మండలం రాజీవ్ నగర్‌కు చెందిన కొమ్ము పవన్ కుమార్ (20) బిటెక్ మూడవ సంవత్సరం చదువుతూ ముషరంబాగ్‌ఎల్‌బి నగర్‌లో నివాసం ఉంటున్నాడు. పూల్ బాగ్‌కు చెందిన మహ్మద్ ఒవైసీ అహమ్మద్ (19) పాలి టెక్నిక్ డిస్‌కంటిన్యూ అయ్యాడు . ఖమ్మం జిల్లా ప్రశాంతి నగర్‌కు చెందిన మామిడి రోహిత్ కుమార్ (20) బిటెక్ మూడవ సంవత్సరం చదువుతు న్నాడు. వీరు నలుగురు ముఠాగా ఏర్పడి ఎల్‌బి నగర్, చైతన్యపురి, సరూర్ నగర్, మీర్‌పేట్, వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉదయం పూట నిర్మానుష్య ప్రాంతాల్లో ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసుకొని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. ఈ ముఠాను పట్టుకోవడం కోసం ప్రత్యే కంగా రెండు క్రైం టీంలను ఏర్పాటు చేసి కాలనీలోని సిసి కెమెరాల ద్వారా గుర్తించి వీరిని పట్టుకోవడం జరిగిందన్నారు. మొత్తం 18 కేసులు, 540 గ్రాముల బంగారు గొలుసులు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. మొత్తం వీటి విలువ 17 లక్షల వరకు ఉంటుందన్నారు. అరెస్ట్ చేసిన నలుగురు విద్యార్థులపై పిడి యాక్ట్ ప్రవేశపెట్టడం జరుగుతుం దని తెలిపారు. పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మరో కేసులో : తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్ప డుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి 19 గ్రాముల బంగారం, నగదు 50 వేల రూపాయలు మొత్తం విలువ 6.20 లక్షల విలువ ఉంటుందని రాచకొండ కమిషనర్ మహేష్ భగవత్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా, కల్యాణదుర్గం మండలం, కోడిపల్లి గ్రామానికి చెందిన తిమ్మ సము ద్రపు శివ అలియాస్ వంశి అలియాస్ నంద (28)కూలీ పనులు చేసు కుంటూ ఉంటున్నాడు. గతంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో దొంగ తనాలు చేయడం జరిగింది. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఇతనిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. మొత్తం హైదరాబాద్‌లో 46, రాచకొండలో 14, కర్నూల్‌లో 4 కేసులు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

6 నెలల్లో తుమ్మిళ్ల

(మొదటిపేజీ తరువాయి)

రాజోళి మండలంలోని తుమ్మిళ్ల గ్రామంలో ఇప్పటికే పనులు చేపట్టిన తుమ్మిళ్ళ ఎత్తిపోతల పథకానికి మంత్రులు హరీష్‌రావు, లక్ష్మారెడ్డి, జూపల్లి క్రిష్ణారావు, ఎంపి జితేందర్‌రెడ్డి, రాష్ట్రప్రణాళిక సంఘం అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి పైలాన్ ఆవిష్కరించి ప్రాజెక్ట్‌ను అధికారింగా శంకుస్థాపన చేశారు. అంత కుముందు హెలికాప్టర్ ద్వారా ఎత్తిపోతలను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నీటిపారుదల శాఖమంత్రి మాట్లా డుతూ 6,7 నెలల్లో పూర్తిచేసి ముఖ్యమంత్రి కెసిఆర్ చేతులతో ప్రారంభిస్తామని ఆయన అన్నారు. 87వేల ఎకరాలకు సాగునీరందించేందుకు రూ. 783కో ట్లతో తుమ్మిళ్ళ ఎత్తిపోతలను చేపట్టి మొదటి దశపనులు మొదలుపెట్టామని ఆయన అన్నారు. సమైక్య రాష్ట్రంలో కళ్ళేదుటే నీళ్ళున్నా నిస్థాయిత స్థితిలో ఉన్నామని, ఉమ్మడి రాష్ట్రంలో 1300 కోట్లతో సుంకేశులను అభివృద్ధి చేశారు కానీ, అర్‌డిఎస్‌ను పట్టించుకోలేదన్నారు. తమది నిధులు, నీళ్ళు, అభివృద్ధి పద్ధతిలో పనిచేస్తున్న ప్రభుత్వం అని అన్నారు. మాజీ ఎంపి మందాజగ్న నాథం, ఎంపి జితేందర్‌రెడ్డిపట్టుతోనే 3రిజ్వారాయర్లతో తుమ్మిళ్ళ ఎత్తిపోతల కార్యరూపం దాల్చిందని మంత్రి హరీష్‌రావు తెలిపారు. నడిగడ్డలో తెలంగాణ ప్రభుత్వం వచ్చాక రూ. 2కిలో పలికే ఉల్లిని రూ. 8 మద్దతు ధర ఇచ్చి రైతు ప్రభుత్వంగా నిలిచింది. రైతుకు 24గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తు న్నామని అన్నారు. నియోజవర్గంలో రూ. 18కోట్లతో 30వేల మెట్రిక్‌టన్నుల నిల్వ చేసే గోడౌన్లు నిర్మించామని, త్వరలో రైతులకోరిక మేరకు శనిగ కొను గోళ్ళు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులు ఏవిధంగా కావాలంటే ఆ విధంగా ఏకరాకు రూ. 8వేల ను ఈ ఏడాదినుండే అమలు చేస్తామని అన్నారు. చిన్నోని పల్లి రిజర్వాయర్ ద్వారా అయిజ నియోజకవర్గంలోని 8 గ్రామాలకు సాగునీరు అందిచేందుకు 2 కి.మీలు కాలువను నిర్మించాలని ప్రణాళిక సంఘం అధ్యక్షుడు మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. కలెక్టర్ రజిత్‌కు మార్‌షనీ, ఎంఎల్‌ఏలు సంపత్‌కుమార్, గువ్వల బాలరాజు, ఆల వెంకటేశ్వర రెడ్డి, మర్రిజనార్థన్‌రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ మందాశ్రీనాథ్, జెడ్పిటిసి వెంక టేశ్వరమ్మగోపాల్, వైస్‌ఎంపీపీ వడ్డేపల్లి శ్రీనివాసులు, బండ్ల క్రిష్ణమోహన్‌రెడ్డి, గట్టుతిమ్మప్ప, మార్కెట్‌యార్డ్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, గార్లపాడు బూషణం, వేణుగో పాల్‌నాయుడు, సంధ్యాశ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలు?

(మొదటిపేజీ తరువాయి)

అధికారాలు కల్పించడం, నిధుల్ని అందజేయడం ద్వారా స్థానిక సంస్థల్ని బలోపేతం చేసి ప్రజా అవ సరాలే కేంద్ర బిందువుగా అభివృద్ధి పనులు జరి గేలా ఈ చట్టానికి సవరణలు తెస్తున్నామని తెలి పారు. ప్రజలకు సేవ చేయడం కోసం ఎన్నికైన గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులు ఆ లక్ష్యం నుంచి పక్కకు పోతే వారిని గాడిలో పెట్టడం, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకోవడం ఈ చట్టంలో ఉంటాయని వివరించారు. పారిశుద్యం, త్రాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు లాంటి వాటి కోసం ఎలాంటి నిధుల కొరత లేకుండా బడ్జె ట్‌లోనే నిర్దిష్టమైన కేటాయింపులు ఉండేలా ప్రభుత్వం ఆలోచిస్తూ ఉందని, ఈ నిధుల్ని గ్రామ పంచాయితీల సమగ్ర అభివృద్ధికి ఖర్చు చేసేలా పారదర్శక వ్యవస్థను కూడా రూపొందించనున్నా మని మంత్రి తెలిపారు. ఎన్నికల ప్రచారం సంద ర్భంగా సిఎం కెసిఆర్ తాండాలను పంచాయితీలు చేస్తామని హామీ ఇచ్చారని, దాని ప్రకారం కొత్తగా ఎన్ని తాండాలను పంచాయితీలుగా చేయడానికి అర్హమైనవో చర్చిస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఖర్చును తగ్గించడంపై అధికారులు అధ్యయనం చేసి వివరాలను అందించాల్సిందిగా ఈ కమిటీ ఆదేశించింది. ఇంకా చాలా అంశాలను చర్చిం చాల్సి ఉన్నందున మంగళవారం కూడా సమా వేశం కొనసాగుతుందని తెలిపారు. ఇదిలా ఉండగా ఐదు రోజుల్లో ఈ ఉప సంఘం తన నివే దికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంది. గ్రామ సభ నిర్వహణ, పాలకవర్గ సమావేశాల గడువును తగ్గించే అంశంపై కూడా చర్చ జరిగింది. ఈ సమా వేశంలో మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, కెటి ఆర్, తుమ్మల నాగేశ్వరరావు, ఈటల రాజేందర్, హరీష్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులతో పాటు అధికారులు నర్సింగ్‌రావు, స్మితా సబర్వాల్, నీతూకుమారి, మాజీ ఐఎఎస్ అధికారి చెల్లప్ప, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తల్లకిందుల శిక్ష

(మొదటిపేజీ తరువాయి)

చెందిన పరమేశ్వర్, లక్ష్మ ణ్‌లు వసతి గృహం లో ఉంటూ 7వ తరగతి చదువుతున్నారు. ఈ ఇద్దరూ అల్లరి చేశారని వార్డెన్ తల్లకిందులుగా నిల్చోబెట్టి కఠినంగా శిక్షించాడు.

ఈ విషయం గురించి పట్టణంలో అదే పనిగా చర్చించుకుంటున్నారు. విద్యా ర్థులు తప్పు చేస్తే శిక్షించడం సరైందే కానీ, ఇంత దారుణంగా చేయడం పద్ధతి కాదని భావిస్తున్నారు. విద్యార్థులను వార్డెన్ శిక్షించిన విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో సోమవారం ఆర్‌డిఒ, జిల్లా ట్రైబల్ అధి కారిణి మాణమ్మలు వసతి గృహాన్ని సంద ర్శించి విద్యార్థుల నుంచి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు.



పేదల ఆత్మగౌరవానికి ప్రతీక రెండు పడక గదుల ఇండ్లు : మంత్రి కెటిఆర్

మన తెలంగాణ / సిరిసిల్ల : పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీకగా రెండు పడక గదుల ఇండ్లను తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తోందని మంత్రి కెటిఆర్ అన్నారు. సోమవారం సిరిసిల్ల మండలం పెద్దూరు, సిరిసిల్లలో రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. అర్హులందరికి దశలవారిగా ఇండ్లను నిర్మిస్తామన్నారు, ప్రతి ఇంటిని గతంలో ఎన్నడూ లేని విధంగా 560 చదరపు అడుగుల వైశాల్యంతో నిర్మిస్తున్నామన్నారు. మండెపల్లిలో 1260 ఇండ్ల నిర్మాణం సాగుతోందని, వచ్చే 6 నెలల్లో వాటి నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామన్నారు. పెద్దూరు బైపాస్ రోడ్డు సమీపంలో పోలీస్ బటాలియన్, పాలిటెక్నిక్, అపెరల్ పార్క్, వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్మాణం చేస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వ పథకాలను రూపొందిస్తున్నామన్నారు. పెద్దూరులో రూ. 20.16 కోట్లతో నిర్మించే 400 డబుల్ బెడ్‌రూం ఇండ్లకు, సిరిసిల్లలో రూ. 10.60కోట్లతో నిర్మించే 200 డబుల్ బెడ్‌రూం ఇండ్లకు, రూ. 3 కోట్లతో నిర్మించే గ్రంధాలయ భవనానికి, రూ. 2 కోట్లతో నిర్మించే అంబేద్కర్ భవనానికి మంత్రులు శంఖుస్థాపన చేశారు. కొండూరి రవీందర్ రావు, ఎంపి వినోద్‌కుమార్, ఎంఎల్ఓలు రసమయి బాలకిషన్, చెన్నమనేని రమేశ్, గంగుల కమలాకర్, కలెక్టర్ కృష్ణభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హీరో నితిన్, సోదరిపై కేసు కొట్టివేత



మన తెలంగాణ/ హైదరాబాద్ : అఖిల్ సినిమా హక్కులు ఇవ్వలేదంటూ తెలుగు సినిమా హీరో నితిన్, ఆయన సోదరిపై నమోదైన కేసును హైకోర్టు కొట్టేస్తూ తీర్పు చెప్పింది. హీరో నితిన్, ఆయన సోదరి నిఖితా రెడ్డిలపై అభియోగాలను కొట్టివేస్తూ హైకోర్టు న్యాయమూర్తి ఎం. సత్య నారాయణ మూర్తి ఇటీవల తీర్పు చెప్పారు. అఖిల్ అనే సినిమా హక్కుల కోసం తమ వద్ద రూ.50 లక్షలు తీసుకుని ఇవ్వలేదంటూ స్థానిక సైనిక్‌పూరి కాలనీకి చెందిన గంగాధర సత్యనారాయణ మల్కాజిగిరిలోని 20వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో 2017 సెప్టెంబర్‌లో కేసు వేశారు. ఈ కేసులో వరసగా శ్రేష్ఠ మూవీస్, నిర్మాత అయిన నితిన్ తండ్రి సుధాకర్‌రెడ్డిలపై, నిఖిత, అఖిల్‌లు నిందితులుగా చేర్చిన కేసులో కోర్టు సమన్లు జారీ చేసింది. శ్రేష్ఠ మూవీస్ సుధాకర్‌రెడ్డికి సంబంధించినదని, తమపై కావాలని కేసు పెట్టారని నితిన్, నిఖితల వాదనను హైకోర్టు ఆమోదించింది.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

మన తెలంగాణ/ నిడమనూరు : విద్యుత్‌షాక్‌తో రైతు మేరెడ్డి నర్సింహారెడ్డి (55) మృతి చెందిన సంఘటన నిడమనూరు మండలంలోని ముప్పరం గ్రామ శివారు లోని గుంటికగూడెంలో సోమవారం చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటికగూడెం గ్రామ శివారులోని 10 ఎకరాల వ్యవసాయ భూమిలో వరిపంటను సాగు చేస్తున్నాడు. సోమవారం పొలం వద్ద స్తంభం నుంచి మోటారుకు విద్యుత్ తీగలను సరిచేస్తున్న సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్ షాక్ గురై అపస్మారక స్థితిలో వెళ్ళాడు. మెరుగైన వైద్యం కోసం మిర్యాలగూడకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య రాధ ,ఒక కుమార్తె ఉన్నారు.ృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు ఎస్ఐ యాదయ్య కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మరో ఘటనలో మహిళ దుర్మరణం



మన తెలంగాణ/ కట్టంగూర్ : ప్రమాదవశాత్తు మహిళ విద్యుత్‌షాక్‌కు గురై, మృతి చెందిన సంఘటన మండలంలోని పామనగుండ్లలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన కాడబోయిన పద్మ (28) నిర్మాణంలో ఉన్న కొత్త ఇంటికి క్యూరింగ్ కోసం మోటార్ సహాయంతో నీళ్లు కొడుతున్న క్రమంలో చేతిలో ఉన్న విద్యుత్ తీగ నుండి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురికావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. కుటుంబ సభ్యులు నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పద్మ సోదరుడు కొరివి సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ పి.మురళీకృష్ణ తెలిపారు.

కలెక్టరేట్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

తహసీల్దార్ రూ. లక్ష అడిగాడంటూ బాధితుడి ఆవేదన


మన తెలంగాణ/జగిత్యాలటౌన్ : జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన మౌలానా అనే వ్యక్తి సోమవారం ప్రజావాణిలో కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి కథనం ప్రకారం..కొడిమ్యాల మండల కేంద్రంలో తనకు గల భూమిని పహాణీలో ఎక్కించాలని తహసీల్దార్‌కు విన్నవిస్తే రూ.1లక్ష లంచం ఇస్తేనే పహాణీలో పేరు చేరుతుందని బాధితుడు విలేకరులతో తన గోడు వెల్లబోసుకున్నాడు. తన దగ్గర అంత డబ్బు లేదని, భూమి అమ్మి ఇస్తానని తహసీల్దార్‌కు మొరపెట్టుకున్నా డబ్బులు ఇచ్చాకే పని చేస్తానని తహసీల్దార్ తేల్చిచెప్పడంతో తనకు న్యాయం జరిగే అవకాశం లేదని, చావే శరణ్యమని ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ రాజేశం బాధితుడితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రూ.2 కోట్లతో వైద్యుడు పరారీ?

మన తెలంగాణ/గోదావరిఖని : పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలోని లక్ష్మీ నగర్ ప్రాంతానికి చెందిన ఓ ఫిజిషియన్ రూ. 2కోట్లతో ఉడాయించినట్లు సమాచారం. గత కొంత కాలంగా భూములు కొనుగోలు చేస్తున్నానంటూ సన్నిహితుల వద్ద నుండి లక్షలాది రూపాయలు అప్పులు తీసుకున్నట్లు తెలిసింది. అధిక వడ్డీ చెల్లిస్తానని చెప్పడంతో నమ్మిన సన్నిహితులు వైద్యుడి కుచ్చుటోపీతో లబోదిబోమంటున్నారు. ఈ వైద్యుడు గత మూడేళ్ల క్రితం తనదగ్గర పనిచేసే ఓ అమ్మాయితో అక్రమ సంబంధాన్ని నెరిపాడు. అది కాస్త తీవ్రస్థాయిలో ప్రచారం కావడంతో కొంతమంది పెద్దమనుషులు పంచాయితీ నిర్వహించాడు. అదే వైద్యుడు ఇప్పుడు కోట్ల రూపాయలతో ఉడాయించినట్లు విశ్వాసనీయ సమాచారం.

రామయ్యకు ఘనంగా రాపత్తు సేవ

నేటి నుండి విలాసోత్సవాలు



మన తెలంగాణ/భద్రాచలం : భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామికి సప్తమి సోమవారం నృసింహదాస మండపం(గ్రామ పంచాయితీ కార్యాలయం)లో రాపత్తు సేవను ఘనంగా రామాలయ అర్చకస్వాములు నిర్వహించారు. ఈ సందర్భంగా రామయ్యను ప్రత్యేకంగా అలంకరించి ఏర్పాటు చేసిన పల్లకీలో నృసింహదాస మండపం(గ్రామ పంచాయితీ కార్యాలయం)లోకి తోడుకొనివచ్చారు. స్థానిక నృసింహదాస మండపం (గ్రామ పంచాయితీ కార్యాలయం)లో సిబ్బంది రాపత్తు సేవను అద్భుతంగా నిర్వహించారు. స్వామికి అష్టోత్తర సహస్త్రానామ అర్చనలు, విశ్వక్సేణా పూజ, పుణ్యాహావచనం తదితరాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం తిరువీధి సేవ నిర్వహించారు. నృసింహదాస మండపం(గ్రామ పంచాయితీ కార్యాలయం)లో జరిగిన రాపత్తు సేవతో పాటు ఇరామాను శనూతతదాది ఉత్సవంలో కూడా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మంగళవారం నుండి అష్టమి సందర్భంగా శ్రీరామదాస మండపం (రెవెన్యూ కార్యాలయం)లో శ్రీసీతారాములకు విలాసోత్సవాలను కూడా ఘనంగా నిర్వహించనున్నారు.

జంతువుల అక్రమ వధ

- నిబంధనలకు పాతర
- నిరుపయోగంగా ఆధునిక స్లాటర్‌హౌస్‌లు
- నేలమీదే జంతువుల కోత
- అనారోగ్యకర వాతావరణంలో నిర్వహణ
- యథేచ్ఛగా కొనసాగుతున్న తంతు
- చోద్యం చూస్తున్న అధికారులు



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : నగరంలో యథేచ్ఛగా నిబంధనలకు విరుద్ధంగా బల్దియా వధశాలల్లో జంతువులను కోసేస్తున్నారు. శాస్త్రీయ విధానంలో వధశాలలను నిర్వహించాల్సిన ఘనత వహించిన బల్దియా అశాస్త్రీయ పద్ధతిలో నిర్వహిస్తోంది. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఆధునిక వధశాలలు అలంకారంగా మారిపోయాయి. ఆధునిక యంత్ర పరికరాలు వినియోగంలో లేక పాడైపోయే పరిస్థితులు నెలకొన్నాయి. యంత్ర పరికరాలు చోరీకి గురవుతున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారు. బల్దియా అధికారిక స్లాటర్ హౌస్‌ల్లో అక్రమంగా పశువులను వధిస్తున్నారు. అక్రమంగా నిర్వహిస్తున్న స్లాటర్‌తో బల్దియా ఖజానాకు రావాల్సిన ఆదాయం అక్రమార్కుల జేబుల్లోకి పోతోంది. నిబంధనలు పాటించకుండా, అనారోగ్యకరమైన వాతావరణంలో వధించిన పశువుల మాంసాన్ని నగర వాసులకు సరఫరా చేస్తున్నారు. కింది నుంచి పై స్థాయి వరకు ఎవరికి వెళ్లాల్సిన మామూళ్ల వాటాలు వారికి వెళ్లుతుండటంలో ఎవరూ అటువైపు తొంగిచూడని పరిస్థితులు నెలకొన్నాయి. రాంనాస్‌పుర వధశాలలో అనారోగ్యకరమైన వాతావరణంలో వధశాలను నిర్వహిస్తున్న వైనం వెలుగులోకి వచ్చింది. ఎలాంటి ప్రమాణాలు పాటించకుండా ప్రమాదకర పరిస్థితుల్లో వధశాలను నిర్వహిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన వధశాల అందుబాటులో ఉన్న వినియోగించుకోవటం లేదు. అశాస్త్రీయంగా పాత పద్ధతుల్లో వధశాలలు నిర్వహించడం కారణంగా కాలుష్యంతో పాటు, ప్రజల ఆరోగ్యం దెబ్బ తింటుందని సుప్రీం కోర్టు పాత వధశాలలపై నిషేధం విధించింది. ఆధునిక వధశాలలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. దీంతో న్యూబోయిగూడ, రాంనాస్‌పుర, జియాగూడ, అంబర్‌పేట్, గౌలిపురలలో పాత పద్ధతిలో నిర్వహిస్తున్న వధశాలను మూసేశారు. వాటి స్థానంలో రూ.70 కోట్ల వ్యయంతో చెంగిచెర్లలో రెడరింగ్‌ప్లాంట్‌తో పాటు కొత్తగా రాంనాస్‌పుర, అంబర్‌పేట్, న్యూబోయిగూడలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వధశాలలను నిర్మించారు. అయితే వీటి నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించారు. రాంనాస్‌పుర స్లాటర్‌హౌస్‌ను ముంబాయికి చెందిన ఆల్‌సాత్ అనే సంస్థకు సంవత్సరానికి రూ.5 కోట్లకు అప్పగించారు. రెండు సంవత్సరాలు నిర్వహించిన సదరు సంస్థ జిహెచ్‌ఎంసికి కేవలం రూ.27 లక్షలు మాత్రమే చెల్లించింది. దీంతో గత ఆగస్టులో ఆల్‌సాత్ నుంచి జిహెచ్‌ఎంసి స్లాటర్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుంది. ఆల్‌సాత్‌పై చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒనేలమీద అక్రమ విధానంలో పశువుల వధను యథేచ్ఛగా కొనసాగిస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో నేలమీద పశువులను వధించ వద్దనే నిబంధనలు ఉన్నాయి. వెటర్నరీ వైద్యులు నిర్ధారించిన అనంతరమే పశువులను శాస్త్రీయ పద్ధతిలో స్లాటర్ చేయాల్సి ఉంటుంది. ప్రతిరోజు ఉదయం 4 గంటల నుంచి వెటర్నరీ వైద్యులు స్లాటర్‌హౌజ్‌లో విధులు నిర్వహించాలి. కాని, వారు పశువులను వధించిన అనంతరం తీరిగ్గా వస్తున్నట్లు తెలిసింది. వైద్యులు నిర్ధారించకుండానే పశువులను వధిస్తున్నారు.

అక్రమార్కుల జేబుల్లోకి డబ్బులు...

స్లాటర్‌హౌజ్‌లో వధించిన ఒక్క జంతువుకు రూ.100 చొప్పున ఫీజు వసూలు చేస్తారు. ప్రతిరోజు రాంనాస్‌పుర స్లాటర్‌హౌజ్‌లో 5 వందల నుంచి 8 వందలలోపు జంతువులను వధిస్తున్నారు. అంటే ప్రతిరోజు రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు ఆదాయం వస్తుంది. కాని జిహెచ్‌ఎంసికి మాత్రం రూ.10 నుంచి రూ.15వేలోపు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిసింది. ఈ డబ్బులను కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ సిబ్బందితో వసూలు చేయిస్తున్నారు. వ్యవసాయానికి, సంతానోత్పత్తికి ఉపయోగపడని ఎద్దులు, గేదెలను మాత్రమే స్లాటర్‌కు ఉపయోగించాలని నిబంధనలు ఉన్నాయి. ఇందుకు విరుద్ధంగా ఎద్దులు, లేగదూడలను కూడా వధిస్తున్నారు.

రూ.10నోటు చల్లి..

రూ.15 లక్షల బంగారం చోరీ
సినీ ఫక్కీలో ఘటన
దర్యాప్తులో పోలీసులు

మన తెలంగాణ/ ఖమ్మం క్రైం : ఖమ్మం నగరం నడిబొడ్డున సినీ ఫక్కీలో బంగారం చోరీ జరిగింది. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీచౌక్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటన పోలీసులకు సైతం సవాల్ విసురుతోంది. త్రీటౌన్ సిఐ వెంకన్నబాబు తెలిపిన వివరాల ప్రకారం.... ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెం ప్రాంతానికి చెందిన గుర్రం రాధిక, వారి కుటుంబ సభ్యులు భద్రాద్రి బ్యాంకు లాకరు నుంచి తీసుకుని, గాంధీచౌక్‌లో గల మహేశ్వరి జ్యూవెల్లరీ దుకాణానికి వెళ్లారు. గుర్రం రాధిక మహేశ్వరి దుకాణంలోకి వెళ్లగా, సమీపంలోని యాక్సెస్ బ్యాంకు ఎదురుగా డ్రైవర్ కన్నం కుమారస్వామి కారును పార్కింగ్ చేశాడు. ఇంతలో ఓ వ్యక్తి కారు డోరును తట్టి కింద మీ డబ్బులు పడ్డాయని చెప్పాడు. డ్రైవర్ కారు దిగి కింద ఉన్న రూ.10 నోట్లను గమనిస్తూ చూస్తున్న సమయంలో కారు వెనుక సీటు కింద (కాళ్లు పెట్టుకునే దగ్గర) బంగారం కలిగిన సంచిని ఎత్తుకెళ్లాడు. గమనించిన డ్రైవర్ యాజమానురాలికి తెలిపాడు. వెంటనే రాధిక సిఐ వెంకన్నబాబుకు ఫిర్యాదు చేసింది. కాగా, సమాచారం అందుకున్న త్రీటౌన్ పోలీసులు సిఐ వెంకన్న బాబు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కాగా, ఇటీవల కాలంలో ఈ తరహా దొంగతనాలు ఎక్కువవుతున్నట్లు సిఐ వెంకన్నబాబు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ స్వీయ రక్షణగా ఉండాలన్నారు.



ఘటనాస్థలి వద్ద పోలీసుల విచారణ

భర్తను గొంతుకోసి హతమార్చిన భార్య

మనతెలంగాణ/వేములవాడ : వివాహేతర సంబంధం నేపథ్యంలో భార్య భర్తను కడతేర్చిన సంఘటన వేములవాడలో సోమవారం కలకలం రేపింది. బంధువుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన బండి బాలయ్య(40), నర్సవ్వల దంపతులు. బాలయ్య గత 10 సంవత్సరాలుగా ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి వస్తుండేవాడు. 20రోజుల క్రితం స్వదేశంలోనే బతుకుదెరువు చూసుకుందామని తిరిగి రాగా, వచ్చిన నాటి నుండే మరో రూ. 2లక్షల వరకు బాకీ ఉందంటూ భార్య నర్సవ్వ, భర్త బాలయ్యతో గొడవ పడుతోంది.భార్య ఎంత చెప్పినా వినిపించు కోవడం లేదు. దీంతో భర్త చంపాలని నిర్ణయిం చుకుంది. ఆదివారం సాయంత్రం భార్యాభర్తలు వేములవాడకు చేరుకున్నారు. అక్కడే గొంతు కోసి హత్యచేసినట్లుగా బాధిత బంధువులు వాపోతున్నారు. సీసీ పుటేజిల ద్వారా నర్సవ్వను పోలీసులు పట్టుకున్నారు. బంధువుల కథనం మేరకు డిఎస్‌పి చంద్రశేఖర్, సిఐ వెంకటస్వామిలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్గమధ్యలోనే నాసిరకం సబ్సిడీ గొర్రెల మృతి




- లబోదిబోమంటున్న గొల్లకురుమలు

మన తెలంగాణ/మెదక్/రేగోడు : సబ్సిడీ గొర్రెల పథకంలో నాసిరకం గొర్రె పిల్లలను ఇస్తుండడంతో ఆంధ్రా నుండి ఇంటికి తరలించేలోపే మార్గమధ్యంలోనే మృత్యువాత పడుతున్నాయి. సోమవారం ఉదయం జిల్లాలోని రేగోడు మండల కేంద్రానికి 19 గొర్రెల యూనిట్లు తీసుకురాగా అందులో 16 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. దీంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. రేగోడులోని19 మంది గొల్ల కురుమలను ఎంపిక చేసి వారికి 20 గొర్రెలు, ఒక పొట్టేలును ఇచ్చారు. కర్నూల్ జిల్లా పగిడాల నుండి గొర్రెలను తీసుకుని ఆదివారం రాత్రి 8 గంటలకు బయలుదేరగా హైదరాబాద్ రింగ్ రోడ్డు వద్దకు వచ్చేసరికి ఒక గొర్రె వ్యానులోనుండి దూకి చనిపోయింది. సోమవారం ఉదయాన్నే రేగోడులో వాహనంలో నుండి దించగా గ్రామానికి చెందిన 6 యూనిట్ల (గొల్ల విఠల్, మామిడిపల్లి నరేష్, సత్యంగారి గోపాల్, మామిడిపల్లి సంగన్న, కడాల సాయిలు, ఎర్రోల్ల సాయిలు)లో 13 గొర్రెలు, రెండు పొట్టేళ్లు మృత్యువాత పడ్డాయి. యూనిట్‌కు 32వేలు అప్పు చేసి వెచ్చించామని బాధితులు వేదనకు గురయ్యారు.

శ్రీ విద్యానికేతన్‌లో విద్యార్థి ఆత్మహత్య

ఉపాధ్యాయుని వేధింపులే కారణం



మన తెలంగాణ / ఖమ్మం అర్బన్: ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న విద్యార్థి క్షణికావేశంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఉపాధ్యాయుని వేధింపుల కారణం గానే విద్యార్థి చనిపోయినట్లు తోటి విద్యార్థులు తెలిపారు. ఏన్కూరు మండలం కేసుపల్లి గ్రామానికి చెందిన రూపవత్ లక్ష్మా, నాగమణి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రూపవత్ జ్యోతి ప్రశాంత్ నగరంలోని గోపాలపురంలో శ్రీ విద్యానికేతన్ పాఠశాలలోని హాస్టల్‌లో ఉంటూ 9వ తరగతి చదువుతున్నాడు. జ్యోతిప్రశాంత్ సోమవారం పాఠశాల హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఊరేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. ఉపాధ్యాయుని వేధింపుల కారణం గానే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నట్లు తోటి విద్యార్థులతో పాటు బంధువులు ఆరోపి స్తున్నారు. ఉపాధ్యాయుడు రమేష్ విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడు తున్నాడంటూ సోమవారం ఉదయం విద్యార్థులు ధర్నా నిర్వ హించారు. దీంతో పాఠశాల కరస్పాం డెంట్, ప్రిన్సిపాల్‌లు జ్యోతి ప్రశాంత్‌కు టిసి ఇచ్చి పాఠశాల నుంచి పంపిస్తామని హెచ్చరించారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన జ్యోతిప్రశాంత్ మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులంతా భోజనానికి వెళ్లినప్పుడు జ్యోతిప్రశాంత్ హాస్టల్ గదిలోకి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకున్నాడు. ఘటనా స్థలిని అర్బన్ సిఐ నాగేంద్రచారి, టూటౌన్ సిఐ రాజిరెడ్డి పరిశీలించి వివరాలు సేకరించారు. విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై ఎంఈఓ శ్రీనివాస్ విచారణ చేపట్టారు.

50 కోట్ల చేప పిల్లలు పంపిణీ చేశాం

- త్వరలో సిఎంకు బిసి సబ్‌కమిటీ నివేదిక
- 542 పోస్టుల భర్తీకి కసరత్తు పూర్తి
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



మన తెలంగాణ/తాండూరు : తెలంగాణ ప్రభుత్వం మత్స్యకారులకు ఉపాధి కోసం ఇప్పటి వరకు రాష్ట్రంలో 50 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేసినట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. సోమవారం వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని ఏర్పాటు చేసిన గొర్రెల పంపిణీ కార్యక్రమానికి హాజరైన మంత్రి శ్రీనివాస్ యాదవ్, రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డితో కలిసి ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం కుల వృత్తులకు ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. మత్స్యకారులకు ఇప్పటి వరకు 50 కోట్ల చేపలను పంపిణీ చేసినట్లు చెప్పారు. అదే విధంగా కుర్మ,గొల్లలకు 37 లక్షల గొర్రెలను పంపిణీ చేసినట్లు తెలిపారు. అందులో ఇప్పటి వరకు 13లక్షలు గొర్రె పిల్లలు పుట్టినట్లు దీంతో మొత్తం 50 లక్షల గొర్రెలున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కుర్మ, గొల్లల కోసం బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించిందని చెప్పారు. దీంతో 18సంవత్సరాలు నిండిన ప్రతి కుర్మ, గొల్లకు గొర్రెలను పంపిణీ చేస్తామని చెప్పారు. ఇందులో 75 శాతం సబ్సిడీపై లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి యూనిట్‌కు రూ.లక్షా 25 వేల ఖర్చు అవుతుందని అన్నారు. అదే విధంగా రాష్ట్రంలో ఉన్న 103 కులాల కోసం బిసి సబ్ కమిటీ నివేదిక తయారైందని త్వరలో సిఎం కెసిఆర్‌కు అందిస్తామని వెల్లడించారు. దీని ద్వారా ప్రతి బిసికి న్యాయం జరుగుతుందని చెప్పారు. పశు సంవర్ధక శాఖలో ఉన్న 542 పోస్టుల భర్తీకి సిద్ధంగా ఉన్నామని, రాత పరీక్షలు కూడా పూర్తయ్యాయని కోర్టు వ్యవహారంలో ఆలస్యం అవుతుందని చెప్పారు. జిల్లాలో బిసిల కోసం 40 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలి పారు. చేవేళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్‌లు కృష్ణమూర్తి, నాగేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మూడోసారి ఆ స్టార్ హీరోతో...



తమిళ టాప్ సంగీత దర్శకులలో ఒకరైన అనిరుధ్ ప్రస్తుతం భారీ ఆఫర్లతో దూసుకుపోతున్నాడు. స్టార్ హీరోలు, టాప్ డైరెక్టర్లు ఈ యువ కంపోజర్‌తో సినిమాలు చేసేందుకు ఆసక్తిచూపుతున్నారు. స్టార్ హీరో అజిత్ త్వరలో శివ దర్శకత్వంలో చేయనున్న 'విశ్వాసం' సినిమాకు అనిరుధ్ సంగీత దర్శకుడిగా ఎంపికయ్యాడు. అనిరుధ్ గతంలో అజిత్, శివ కాంబినేషన్‌లో వచ్చిన సూపర్ హిట్ సినిమాలు వివేకం, వేదాళం చిత్రాలకు బ్రహ్మాండమైన సంగీతాన్ని అందించాడు. మళ్లీ ఈ హిట్ కాంబో మూడోసారి పునరావృతం కానుండడంతో ప్రేక్షకులు, అభిమానుల్లో ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. విభిన్న కథాంశంతో ఈ చిత్రాన్ని సమ్‌థింగ్ స్పెషల్‌గా తెరకెక్కించబోతున్నారు ఫిల్మ్‌మేకర్స్. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈనెల 19 నుంచి మొదలుకానుంది. ఇకపోతే అనిరుధ్ సంగీతాన్ని అందించిన అజ్ఞాతవాసి, గ్యాంగ్ సినిమాలు ఈ సంక్రాంతికి విడుదలవుతున్నాయి.

లవ్‌స్టోరీ సూపర్‌గా...



మహేశ్‌బాబు

టాలీవుడ్‌లో మిగిలిన అన్ని జోనర్లతో పోలిస్తే పొలిటికల్ జోనర్‌లో వచ్చే సినిమాలు తక్కువ. కొన్నేళ్ల క్రితం వచ్చిన లీడర్, ఈమధ్య వచ్చిన నేనే రాజు నేనే మంత్రి సినిమాలు ఈ జోనర్‌లో వచ్చి ప్రేక్షకులను మెప్పించాయి. తెలుగులో స్టార్ హీరోలు పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న కథతో సినిమాలు చేయడానికి పెద్దగా ఆసక్తి చూపరు. ఆ లోటును తీరుస్తూ స్టార్ హీరో మహేశ్‌బాబు ప్రస్తుతం 'భరత్ అనే నేను' సినిమా చేస్తున్నాడు. కొరటాల శివ డైరెక్షన్‌లో వస్తున్న ఈ సినిమాలో మహేశ్ ముఖ్యమంత్రి పాత్రలో కనిపించబోతున్నాడు. ఈమధ్య షూటింగ్‌కు కాస్త గ్యాప్ ఇచ్చి కుటుంబంతో కలిసి విదేశాలకు హాలిడే టూర్‌కు వెళ్లిన ఈ స్టార్ హీరో ప్రస్తుతం ఈ సినిమా పనుల్లో బిజీ అయిపోయాడు. ఈ సినిమాలో పూర్తిగా రాజకీయాలే కాకుండా ప్రేక్షకులను మెప్పించేందుకు కమర్షియల్ అంశాలపైన కూడా దర్శకుడు కొరటాల శివ దృష్టిపెట్టాడు. ముఖ్యంగా కొరటాల గతంలో తీసిన మిర్చి, శ్రీమంతుడు సినిమాల్లో హీరో, హీరోయిన్ల లవ్ ట్రాక్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. ఇప్పుడు 'భరత్ అను నేను'లో కూడా హీరో మహేశ్, హీరోయిన్ కియారా అద్వానీల మధ్య లవ్ స్టోరీ సూపర్‌గా ఉండేవిధంగా కొరటాల తీర్చిదిద్దాడని తెలిసింది. దీంతోపాటు పొలిటికల్ సినిమాల్లో పంచులు, సెటైర్లకు స్కోప్ ఎక్కువ. ఈ కోణంలో దర్శకుడు ప్రత్యేక దృష్టిపెట్టాడట. దానికి తగ్గట్టే క్యారెక్టర్ ఆర్టిస్టులుగా మంచి టైమింగ్ ఉన్న వాళ్లను తీసుకున్నారు. ప్రకాష్‌రాజ్, శరత్‌కుమార్, రావు రమేష్, పోసాని కృష్ణమురళి, దేవరాజ్ వంటి సీనియర్ నటులంతా రాజకీయ నాయకుల పాత్రల్లో అదరగొట్టే స్తారని సమాచారం.

ఫ్రెష్ లుక్‌తో నా.. నువ్వే

నందమూరి కళ్యాణ్‌రామ్, తమన్నా హీరోహీరోయిన్లుగా జయేంద్ర దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి 'నా.. నువ్వే' అనే టైటిల్‌ను ఖరారుచేసింది చిత్ర బృందం. కూల్‌బ్రీజ్ సినిమాస్ నిర్మాణంలో ఈస్ట్‌కోస్ట్ ప్రొడక్షన్స్ సమర్పణలో ఈ చిత్రం షూటింగ్ జరుపుకుంటోంది. ప్రఖ్యాత కెమెరామెన్ పి.సి. శ్రీరామ్ ఈ చిత్రానికి ఛాయాగ్రహణాన్ని అందిస్తున్నారు. ఫ్రెష్ లుక్‌లో కళ్యాణ్‌రామ్ ఈ చిత్రంలో కనిపిస్తారు. ఈ చిత్రానికి అవార్డు విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ షరెత్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్ర నిర్మాతల్లో ఒకరైన కిరణ్ ముప్పవరపు మాట్లాడుతూ ''ఈ నెలాఖరుకు షూటింగ్ పూర్తవుతుంది. ఈ చిత్రానికి 'నా.. నువ్వే' అనే టైటిల్ సరిగ్గా సరిపోతుంది. ఒక నూతన కాన్సెప్ట్, ఫ్రెష్ లుక్‌తో ఈ చిత్రాన్ని దర్శకులు జయేంద్ర తీర్చిదిద్దుతున్నారు. కళ్యాణ్‌రామ్, తమన్నాల కాంబినేషన్ ఈ చిత్రానికే హైలైట్‌గా నిలుస్తుంది. పి.సి.శ్రీరామ్ కెమెరా పనితనం ఈ చిత్రానికి ప్లస్ పాయింట్‌గా ఉంటుంది''అని తెలిపారు. చిత్ర సమర్పకులు మహేష్ కోనేరు మాట్లాడుతూ ''పి.సి. శ్రీరామ్, జయేంద్ర వంటి టాప్ టెక్నీషియన్స్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. హీరో కళ్యాణ్‌రామ్‌కు ఈ చిత్రం స్పెషల్ మూవీగా నిలుస్తుంది. వేసవి సెలవుల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం''అని అన్నారు. లవ్, యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రధానంగా ఉండే ఈ చిత్రంలో తనికెళ్ల భరణి, పోసాని కృష్ణ మురళి, వెన్నెల కిషోర్, ప్రవీణ్, బిత్తిరి సత్తి, ప్రియ, సురేఖవాణి ప్రధాన నటులు. ఈ చిత్రానికి ఎడిటింగ్ః టి.ఎస్.సురేష్, కథ, స్క్రీన్‌ప్లేః జయేంద్ర, శుభ, నిర్మాతలుః కిరణ్ ముప్పవరపు, విజయ్ వట్టికూటి.



తమన్నా, కళ్యాణ్‌రామ్

హల్‌చల్ చేస్తున్న భాగమతి

టాలీవుడ్ సిల్వర్‌స్క్రీన్ వండర్ 'బాహుబలి' చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా అభిమానుల్ని సంపాదించుకున్న అనుష్క నటించిన తాజా చిత్రం 'భాగమతి'. అరుంధతి, రుద్రమదేవి, బాహుబలి చిత్రాల్లో ఆమె నటించిన తీరు అందరినీ అబ్బురపరిచింది. ఇక తాజాగా 'భాగమతి' ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. ఈ ట్రైలర్‌లో అనుష్క తన నటనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. 'ఎవ్వడు పడితే వాడు రావడానికి... ఎప్పుడు పడితే అప్పుడు పోవడానికి ఇదేమన్నా పశువుల దొడ్డా?... భాగమతి అడ్డా?... లెక్కలు తేలాలి... ఒకడ్ని పోనివ్వను... అంటూ అనుష్క ఈ ట్రైలర్‌లో చెప్పిన హై పిచ్ డైలాగ్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ట్రైలర్ విడుదలైన కొద్ది గంటల్లోనే సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. అనుష్క నటన, దర్శకుడు అశోక్ టేకింగ్, మధి కెమెరావర్క్, రవీందర్ ఆర్ట్ వర్క్, తమన్ రీరికార్డింగ్, యువి క్రియేషన్స్ నిర్మాణ విలువు అత్యున్నత స్థాయిలో ఉన్నాయి. అనుష్క గెటప్ అందరినీ ఆశ్చర్యపరిచింది. ట్రైలర్‌తో ఎప్పుడెప్పుడు ఈ సినిమా చూద్దామన్న ఆసక్తి ప్రేక్షకుల్లో కలుగుతోంది. గణతంత్ర దినోత్సవ కానుకగా ఈనెల 26న 'భాగమతి' చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రమోద్, వంశీ ప్రకటించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ ''బాహుబలి చిత్రంతో తన ఫేమ్, క్రేజ్‌ను ఎంతో పెంచుకొని సూపర్‌ఫామ్‌లో ఉన్న అనుష్క ప్రధాన పాత్రలో నటిస్తున్న 'భాగమతి' చిత్రాన్ని నిర్మిస్తున్నందుకు గర్వంగా ఉంది. ఈ చిత్ర ట్రైలర్‌కు అనూహ్య స్పందన వస్తోంది. సినిమా కథ అద్భుతంగా కుదిరింది. అందుకు తగ్గట్టుగానే దర్శకుడు అశోక్ సినిమాను అద్భుతంగా తెరకెక్కించాడు. అనుష్క నటన సినిమాకు హైలైట్ కానుంది. కథకు తగ్గట్టుగా భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. తమన్ అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రతి సన్నివేశాన్ని హైలైట్ చేసేదిగా ఉంటుంది. భాగమతి కథ, కథనం తెలుగు ప్రేక్షకుల్ని తప్పకుండా ఎంటర్‌టైన్ చేస్తుంది. గణతంత్ర దినోత్సవ కానుకగా ఈనెల 26న అత్యధిక థియేటర్లలో 'భాగమతి' చిత్రాన్ని విడుదల చేయనున్నాం''అని అన్నారు. ఉన్ని ముకుందన్, జయరాం, ఆశా శరత్, మురళీ శర్మ, ధన్‌రాజ్, ప్రభాస్ శ్రీను, విద్యుల్లేఖ రామన్, దేవ దర్శిని, తలైవాసల్ విజయ్, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఎడిటింగ్ః కోటగిరి వెంకటేశ్వర రావు, ప్రొడక్షన్ డిజైనర్ః రవీందర్.



అనుష్క

నానీతో మరో మలయాళీ బ్యూటీ

ఎన్నడూలేని విధంగా టాలీవుడ్‌లో కొంతమంది కొత్త భామలు సీనియర్ హీరోయిన్స్‌కు గట్టి పోటీనిస్తున్నారు. ఇక యంగ్ హీరోలు కొత్త హీరోయిన్‌లతో సినిమాలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొత్త భామలతో స్క్రీన్‌పై కనిపించాలని ఉత్సాహపడుతున్నారు. ఇక అసలు విషయానికొస్తే... కిషోర్ తిరుమల దర్శకత్వంలో నానీ ఓ సినిమా చేసేందుకు ఓకే అన్నాడు. అయితే ఈ సినిమాలో ఓ మలయాళ బ్యూటీని హీరోయిన్‌గా తీసుకోవాలని నాని దర్శకుడితో మాట్లాడాడట. ఇంతకుముందు నాని తన సినిమాలతో నివేధా థామస్, అను ఇమాన్యుయల్‌ని టాలీవుడ్‌కు పరిచయం చేసిన సంగతి తెలిసిందే. ఆ కేరళ బ్యూటీలకు ఇప్పుడు టాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉంది. దీంతో నాని ముచ్చటగా మూడోసారి కూడా అక్కడి నుంచే ఒక మంచి అమ్మాయిని తీసుకురావాలని చూస్తున్నాడట. కిషోర్ తిరుమల కూడా మలయాళ బ్యూటీ కీర్తి సురేష్‌ను 'నేను శైలజ' చిత్రంతో తెలుగు తెరకు పరిచయం చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈసారి కూడా తన సినిమాలో కేరళ అమ్మాయిని తీసుకోవాలని ఆయన అనుకుంటున్నాడట. ప్రస్తుతం ఓ ఇద్దరు లిస్ట్‌లో ఉన్నట్లు తెలిసింది. త్వరలో ఒకరిని ఫైనల్ చేస్తారట. ఇక ఈ చిత్రానికి 'చిత్రలహరి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. మరికొన్ని రోజుల్లో ఈ సినిమాను మొదలుపెట్టనున్నారు.



నాని

అవే నా గ్లామర్‌కు కారణం

శంకర్ ప్రతిష్టాత్మక చిత్రం '2.0'లో హీరోయిన్‌గా చేసింది హాట్ బ్యూటీ అమీజాక్సన్. 'ఐ' సినిమా నిరాశపరిచినా శంకర్ మరోసారి ఆమెను ఈ చిత్రంలో హీరోయిన్‌గా తీసుకోవడంతో అమీ ఎంతో సంతోషంగా ఉంది. '2.0' ఘన విజయం సాధిస్తే అమీజాక్సన్ పెద్ద హీరోయిన్ల జాబితాలోకి చేరిపోవడం ఖాయం. ఈ సినిమాలో సౌతిండియా సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు జోడీగా ఆమె నటించింది. అయితే తన అందచందాలు, గ్లామర్‌తో ఈ భామ ఇప్పటికే ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది. ఇంత నాజూకుగా ఉండడానికి ఏం చేస్తావని అమీని అని అడిగితే... తన ఆహారపు అలవాట్లే తన గ్లామర్‌కు కారణమని చెప్పింది. ఉదయం చేసే బ్రేక్‌ఫాస్ట్ ఎప్పటికీ మిస్ అవ్వనని అది చాలా విలువైనదని తెలిపింది. గ్రీన్ జ్యూస్, ఓట్స్, తేనెలను తీసుకుంటానని అంది. ఇంటి నుండి బయల్దేరే ముందు లీటర్ నీళ్లు తప్పకుండా తాగుతానని అమీ చెప్పింది. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌ను తప్పనిసరిగా తీసుకొని సాయంత్రం 7 తర్వాత ఏమీ తినకుండా ఉంటే నాజూకుదనం అందరి సొంతమని సలహా ఇచ్చింది ఈ బ్యూటీ.



అమీజాక్సన్

బాలీవుడ్ స్టార్‌కు జోడీగా రకుల్

2018లో తెలుగు సినిమాలు తగ్గించాలని నిర్ణయించుకున్నట్టుంది రకుల్‌ప్రీత్ సింగ్. గత ఏడాది మొత్తం తెలుగు సినిమాలకే కాల్షీట్లు ఇచ్చిన ఈ బ్యూటీ ఈ సంవత్సరంలో కోలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌పై ఫోకస్ పెట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. తమిళ్‌లో సూర్య సరసన నటించబోతోంది రకుల్. సెల్వ రాఘవన్ దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమాలో రకుల్‌ను హీరోయిన్‌గా ప్రకటించారు. ఈ మూవీతో పాటు బాలీవుడ్‌లో మరో మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చే ఆలోచనలో ఉంది. హిందీలో హీరో సిద్ధార్థ్ మల్హోత్రకు జోడీగా రకుల్ నటించిన చిత్రం విడుదలకు సిద్ధమైంది. త్వరలోనే బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ సరసన నటించడానికి ఆమె రెడీ అవుతోంది. సౌత్ హీరోయిన్లకు బ్రేక్ ఇవ్వడానికి అక్షయ్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు. ఇప్పటికే కాజల్, అసిన్, శృతిహాసన్, తమన్నా వంటి హీరోయిన్లకు అవకాశమిచ్చిన ఈ హీరో ఇప్పుడు రకుల్‌కు కూడా ఛాన్స్ ఇవ్వబోతున్నాడు. ఇక 'స్పైడర్' తర్వాత మళ్లీ తెలుగులో సినిమా చేయలేదు రకుల్. సూర్య సరసన నటించే ఛాన్స్ కొట్టేసిన ఈ బ్యూటీ మరోసారి కార్తి సరసన కూడా నటించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పుడు అక్షయ్‌తో సినిమాకు కమిట్ అయింది.



రకుల్‌ప్రీత్ సింగ్



లావణ్య త్రిపాఠి

విలక్షణ నటిగా అలరిస్తా

లావణ్య త్రిపాఠికి ఇకనుంచి యంగ్‌గా, గ్లామర్‌గా ఉండే రోల్స్ చేయాలనుందట. తనకు చాలా ఆఫర్స్ వస్తున్నా... తన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించే పాత్రలు రావడం లేదని అంటోంది ఈ భామ. తాను చాలా కూల్, ఫన్నీగా ఉంటానని... అలాంటి క్యారెక్టర్‌లో ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తానని అంటోంది లావణ్య. ''ప్రస్తుతం నేనింకా దారిలోనే ఉన్నా. ఇంకా లక్ష్యాన్ని చేరుకోలేదు. ప్రేక్షకులు ముందు నన్ను మిధున (అందాల రాక్షసిలో పాత్ర)గా గుర్తించారు. ఆతర్వాత నందన (భలే భలే మగాడివోయ్‌లో పాత్ర), అనంతరం సీత (సోగ్గాడే చిన్ని నాయనలోని పాత్ర)గా ఎంతో ఆదరాభిమానాలను చూపించారు. అయినా... ఇంకా నన్ను నన్నుగా గుర్తించాలని కోరుకుంటున్నా. నాలోని ఆ యాంగిల్ జనాలకు తెలియదు. తెలిస్తే బాగా రిసీవ్ చేసుకుంటారు. విలక్షణ నటిగా ప్రేక్షకుల ఆదరాభిమానాలను చూరగొనాలని కోరుకుంటున్నా. డిఫరెంట్ క్యారెక్టర్స్ చేసి ప్రేక్షకులను అలరిస్తా. ఈ ప్రయత్నంలో నేను తప్పకుండా సఫలమవుతాను''అని అంటోంది ఈ భామ.

విదేశీ బాండ్ల ద్వారా రూ.12,600 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: దేశీయ ప్రభుత్వరంగ దిగ్గజం ఎస్‌బిఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) విదేశీ బాండ్ల ద్వారా రూ.12,600 కోట్లు సమీకరించేందుకు సిద్ధమవుతోంది. అమెరికా డాలర్ల రూపంలో బాండ్లు జారీ చేసి నిధులను సేకరించాలని యోచిస్తోంది. ఒకేసారి లేదా దశలవారీగా 2 బిలియన్ డాలర్ల దీర్ఘకాలి నిధుల సమీకరణ చేపట్టేందుకు సెంట్రల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ కమిటీ అంగీకరించిందని ఎస్‌బిఐ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. 2017–18 నుంచి 2018–19 ఆర్థిక సంవత్సరంలో పబ్లిక్ ఆఫర్ లేదా అమెరికా డాలర్లు, ఇతర కన్వర్టిబుల్ కరెన్సీలో ఈ నిధుల సమీకరణ చేపట్టనున్నట్టు సంస్థ పేర్కొంది. నిధుల సమీకరణ ప్రకటనతో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌పై ఎస్‌బిఐ షేరు విలువ స్వల్పంగా పడిపోయింది. 0.10 శాతం పడిపోయిన ఎస్‌బిఐ షేరు రూ.306.05 వద్ద స్థిరపడింది. ఇటీవల కాలంలో నిధుల సమీకరణ చేపడుతున్న సంస్థలు ఎక్కువ అవుతున్నాయి. ఇప్పటికే పలు సంస్థలు నష్టాల నుంచి గట్టెక్కేందుకు, లేకపోతే సంస్థను విస్తరించేందుకు నిధుల సమీకరణ చేపట్టాయి. తాజాగా ఎస్‌బిఐ కూడా నిధులను సేకరించేందుకు సిద్ధమైంది.

నేటి నుంచి జియో 'హ్యాపీ న్యూఇయర్ 2018' ఆఫర్లు

న్యూఢిల్లీ : రిలయన్స్ జియో కొత్త సంవత్సరం సందర్భంగా ప్రారంభించిన ఆఫర్లు ఈనెల 9 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇతర సంస్థల నుంచి పోటీ తీవ్రం కావడంతో జియో పాత ప్లాన్లనే చార్జీలను తగ్గించి.. కొత్త ప్లాన్లుగా ప్రకటించింది. జియో ప్రత్యేకంగా రోజుకి 1.5 జిబి డేటా ప్లాన్‌ను కొత్తగా అందిస్తోంది. నూతన సంవత్సరంలో ఆఫర్లలో ఇది మొదటిదని, వచ్చే రోజుల్లో మరిన్ని ఆఫర్లతో కస్టమర్లను ఆకట్టుకోనున్నట్టు కంపెనీ పేర్కొంది. నేటి (జనవరి 9) నుంచి వినియోగదారులకు అందుబాటులో ఉంటాయని తెలిపింది. నెల రోజుల వ్యాలిడిటీతో రూ. 149 ప్యాక్‌పై రోజుకు 1 జిబి డేటా అందిస్తోంది. దీంతోపాటు 1జిబి ప్లాన్లపై అదనపు ప్రయోజనాలను అందివ్వనున్నట్టు జియో ప్రకటించింది. 50శాతం ఎక్కువ డేటా లేదా ప్లాన్ విలువలో రూ.50 డిస్కౌంట్ అందివ్వనుంది. రోజుకు 1.5 జిబి డేటా ప్లాన్‌నుకూడా ప్రకటించింది. అన్ని ప్రణాళికలు జియో ప్రైమ్ సభ్యులకు మాత్రమే లభిస్తాయి.

రోజుకు 1 జిబి ప్లాన్లు(రూ. 50 తగ్గింపు)

రూ. 349 ప్యాక్ (రూ. 399) 70 రోజుల వాలిడిటీ, 70 జిబి డేటా
రూ.399 ప్యాక్ (రూ 459)84 రోజుల చెల్లుబాటు84 జిబి డేటా
రూ. 449 ప్లాన్ (రూ 499)91 రోజుల చెల్లుబాటు 91 జిబి డేటా

50శాతం అదనపు డేటా ప్లాన్లు

రూ. 198 ప్యాక్: 28 రోజుల వ్యాలిడిటీ, 42 జిబి డేటా
రూ. 398 ప్యాక్: 70 రోజుల వ్యాలిడిటీ, 105 జిబి డేటా
రూ. 448 ప్యాక్: 84 రోజుల వ్యాలిడిటీ,126 జిబి డేటా
రూ.498 ప్యాక్: 91 రోజుల వ్యాలిడిటీ, 136 జిబి డేటా

డాక్స్ యాప్ నిధుల సమీకరణ

మన తెలంగాణ / హైదరాబాద్ : వైద్య రంగంలో సాంకేతిక ద్వారా అవరోధాలను అధిగమింమచేందుకు వివిధ పెట్టుబడిదారుల నుండి 7.2 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించుకున్నట్లు ఆన్‌లైన్ డాక్టర్ సంప్రదింపు వేదిక, హెల్త్ టెక్ కంపెనీ డాక్స్‌యాప్ పేర్కొంది. దేశ వ్యాప్తంగా నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందించేందుకు వైద్యులకు సహాయం చేయగల సాంకేతికను అందించనుంది. రోగులకు 30 నిమిషాలలోగానే స్పెషల్ డాక్టర్స్‌కు కనెక్ట్ చేయబడి, 17 ప్రాంతీయ భాషలలో చాటింగ్, మాట్లాడడానికి అందుబాటులో ఉంటుంది. ఈ యాప్ ద్వారా దేశంలోని 2000 టాప్ వైద్యుల సేవలను రోగులకు అందజేస్తోంది. ఈ క్రమంలో కంపెనీ ఆర్థికంగా మరింతగా నిలదొక్కుకునేందుకు జపనీస్ ఇన్వెస్టర్ టెక్ మ్యాట్రిక్స్ కార్పొరేషన్, డిఎన్‌ఏ నెట్‌వర్క్, బెస్సెమెర్ వెంచర్ పార్ట్‌నర్స్(బివిపి)ల నుండి 7.2 మిలియన్ డాలర్ల నిధులను సేకరించినట్లు డాక్స్‌యాప్ సిఇఒ సతీస్ కన్నన్ ఒక ప్రకటనలో తెలిపారు. పేర్కొన్నారు. ప్రస్తుతం డాక్స్‌యాప్ ద్వారా నెలకు 50 వేల రోగులకు సేవలను అందిస్తున్నామని అన్నారు.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	34352.79	198.94	0.58%
నిఫ్టీ	10623.60	64.75	0.61%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.89
యూరో	75.33
బ్రిటిష్ పౌండ్	85.18
ఆస్ట్రేలియన్ డాలర్	49.84
కెనెడియన్ డాలర్	50.64
ఎమిరైట్ దిర్హామ్	17.67
స్విస్ ఫ్రాంక్	64.97
చైనీస్ యువాన్	9.76
మలేషియన్ రింగిట్	15.3
న్యూజిలాండ్ డాలర్	44.67
హాంగ్‌కాంగ్ డాలర్	8.31
జపనీస్ యెన్	0.57
కువైట్ దినార్	214.41
సౌతాఫ్రికన్ రాండ్	4.59

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	28140	30096.26	0.39%
ముంబై	28970	30983.96	0%
ఢిల్లీ	28500	30481.28	0%
కోల్‌కతా	29070	31090.91	0%
కేరళ	27350	29251.34	0%
బెంగళూరు	27600	29518.72	0%
హైదరాబాద్	28200	30160.43	0.18%
గల్ఫ్	1346.4	1440.00	0.65%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	సోమవారం	శనివారం	మార్పు (%)
చెన్నై	41700.00	42000.00	–0.71
ముంబై	41700.00	42000.00	–0.71
ఢిల్లీ	41700.00	42000.00	–0.71
కోల్‌కతా	41700.00	42000.00	–0.71
హైదరాబాద్	41700.00	42000.00	–0.71



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	402	విశాఖపట్నం	400
వరంగల్	402	చిత్తూరు	398
విజయవాడ	398	చెన్నై	405
గోదావరి	398	బెంగళూరు	405

నిఫ్టీ @ 10,600

34,350 పైన ముగిసిన సెన్సెక్స్



న్యూఢిల్లీ : వచ్చే నెలలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై ఆశలు, కార్పొరేట్ ఫలితాలపై సానుకూల దృక్పథంతో బెంచ్ మార్క్ సూచీలు రికార్డు స్థాయి గరిష్ఠంలో ముగిశాయి. జిడిపి వృద్ధి రేటు అంచనాలు ఆశించిన మేరకు లేకున్నా ఇతర అంశాలు మార్కెట్‌కు ఉత్సాహాన్ని ఇచ్చాయి. మరో వైపు ఆసియా మార్కెట్లు కూడా రికార్డు స్థాయి గరిష్ఠానికి చేరడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చింది. దీంతో దేశీయ సూచీలు సోమవారం సరికొత్త రికార్డు సృష్టించాయి. సెన్సెక్స్ 198.94 పాయింట్ల లాభంతో 34352.79 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 64.75 పాయింట్ల లాభంతో 10623 వద్ద ముగిసింది. టెలికాం రంగాలకు చెందిన సూచీ తప్ప మిగతా రంగాలకు చెందిన సూచీలు లాభాల్లో ముగిశాయి. ఎన్‌ఎస్‌ఇలో నిఫ్టీ సూచీ 10,631 నుంచి 10,589 పాయింట్ల రేంజ్‌లో ట్రేడ్ అయ్యింది. కీలకమైన ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ బ్యాంక్ సూచీ 74 పాయింట్లు లాభపడి 25,676 పాయింట్లకు చేరింది. కోల్ ఇండియా, లుపిన్, ఇన్ఫోసిస్, సన్ ఫార్మా, ఇండియన్ బుల్ హౌసింగ్ ఫైనాన్స్ షేర్లు 3 నుంచి 2 శాతం లాభపడ్డాయి. భారతీ ఎయిర్‌టెల్, ఓఎన్‌జిసి, హెచ్‌సిఎల్ టెక్, టాటాస్టీల్, ఏసియన్ పేయింట్స్ షేర్లు 4 నుంచి 1శాతం నష్టపోయాయి.

నిఫ్టీ మరో రికార్డు

నిఫ్టీ కీలక 10,600 పాయింట్ల మార్క్‌ను క్రాస్ చేసింది. సానుకూల అంతర్జాతీయ పరిణామాలు, త్రైమాసికంలో కంపెనీలు మంచి ఫలితాలను సాధించవచ్చనే అంచనాలతో సూచీలు మొదలయ్యాయి. సెన్సెక్స్ 163 పాయింట్లు పెరిగి 34,317 పాయింట్ల వద్ద, నిఫ్టీ 46 పాయింట్ల లాభంతో 10,605 పాయింట్ల ప్రారంభయ్యాయి. ఫార్మా, రియల్టీ, ఐటీ రంగాల షేర్లు భారీగా లాభపడం సూచీలకు మరింత జోష్‌ను ఇచ్చింది. దీంతో సెన్సెక్స్ 200 పాయింట్ల మేరకు పెరిగి కీలక మార్కును చేరుకుంది.

9 శాతం పెరిగిన ఐడిఎఫ్‌సి షేరు

మార్కెట్లో ఐడిఎఫ్‌సి బ్యాంక్ షేరు ఒక్కసారిగా 10 శాతం వరకు పెరిగింది. కొద్ది రోజులుగా బ్యాంకింగ్ రంగ షేర్లు ర్యాలీని కొనసాగిస్తున్న నేపథ్యంలో ఐడిఎఫ్‌సి బ్యాంక్ షేరు ఇవాళ ఒక్కసారిగా దూసుకెళ్లింది. ఓ దశలో 9 శాతానికి మించి లాభపడి రూ.64.50 వద్దకు చేరుకుంది. షేరు విలువ రూ.6 వరకు పెరిగింది. బ్యాంక్ నిఫ్టీ సూచీలో టాప్ గెయినర్‌గా నిలిచింది. ఈ షేరు 52 వారాల గరిష్టస్థాయికి చేరుకుంది.

2017లో వేగంగా పెరిగిన అదానీ సంపద

రిలయన్స్, డిమార్ట్ అధినేతల సంపద 80 శాతం వృద్ధి



న్యూఢిల్లీ : గత సంవత్సరంలో దేశీయ దిగ్గజ వ్యాపారవేత్తలు ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీల సంపద ఏకంగా 125 శాతం వృద్ధిని సాధించింది. గౌతమ్ అదానీ నికర విలువలో 124.6 శాతం పెరిగింది. 2017 జనవరిలో 4.63 బిలియన్ డాలర్లుగా ఉన్న అదానీ ఆస్తులు, 2017 డిసెంబర్ 31నాటికి 10.4 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఈమేరకు బ్లూమ్‌బర్గ్ గణాంకాలు వెల్లడించాయి. అదానీ గ్రూప్ వ్యవస్థాపకుడైన గౌతమ్ అదానీ దేశంలో అతిపెద్ద పోర్ట్ ఆపరేటర్ అనే విషయం తెలిసిందే. ఇక అదానీ తర్వాత డీమార్ట్ యజమాని రాధాకృష్ణ దమానీ రెండో స్థానంలో ఉన్నారు. గతేడాది ఆయన సంపద 80శాతం పెరిగింది. 2017 మార్చిలో దమానీ ఆస్తులు విలువ 3.88 బిలియన్ డాలర్లు ఉండగా, డిసెంబరు చివరి నాటికి ఆ మొత్తం 6.96 బిలియన్ డాలర్లకు పెరిగాయి. దేశంలో అత్యంత సంపన్నుడు ముఖేశ్ అంబానీ ఆస్తులు 2017లో 77 శాతం పెరిగాయి. అయితే ఆయనకంటే వేగంగా గతేడాది అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ సంపద 125 శాతం పెరగింది. ఈ మేరకు బ్లూమ్‌బర్గ్ డేటా ద్వారా వెల్లడైంది. సంపద విలువలో ముఖేశ్ అంబానీతో పోలిస్తే అదానీ ఆస్తులు తక్కువే.. అయితే వేగంగా ఆస్తులు పెరగడంతో అదానీ ముందున్నారు. ముఖేశ్ అంబానీ ఆస్తులు గతేడాది జనవరిలో 22.70 బిలియన్ డాలర్లు ఉండగా, డిసెంబరు నాటికి 40.30 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఇక కుమార బిర్లా, అజీమ్ ప్రేమ్‌జీ, ఉదయ్ కొటక్, విక్రమ్ లాల్, లక్ష్మి మిట్టల్ సంపద వరుసగా 50 శాతం, 47 శాతం, 45 శాతం, 44 శాతం, 36 శాతం పెరిగాయి. అంతర్జాతీయంగా చూస్తే ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన జెఫ్ బిజోస్ సంపద 2017లో 52శాతం పెరిగింది. 2017 జనవరిలో ఆయన సంపద 65 బిలియన్ డాలర్లు ఉంటే, డిసెంబరు 31 నాటికి 99 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఇక బిల్‌గేట్స్, వారెన్ బఫెట్ ఆస్తులు 12శాతం, 17 శాతం చొప్పున పెరిగాయి.


బజాజ్ పల్సర్ సీజన్ 3 రైడింగ్ పోటీలు



మన తెలంగాణ / హైదరాబాద్ : బైక్ రైడర్లకు స్టంట్ రేసింగ్‌లో మెళకువలను నేర్పుతూ సాగే సీజన్ 3 ని బజాజ్ పల్సర్ హైదరాబాద్‌లో ఆదివారం నాడు నిర్వహించింది. నగర శివారులోని బిఎన్ రెడ్డి నగర్, గుర్రంగూడ హైవేపై సుశిక్షత రైడర్లు వైవిధ్య విన్యాసాలను ప్రదర్శించి పలువురిని ఆకట్టుకున్నారు. వచ్చే నెల 17,18 తేదీల్లో ఫైనల్ పోటీలు చెన్నై, కోయంబత్తూర్‌లో ఉంటాయని, విజేతలకు 50 వేల నగదు పారితోషికం కూడా ఇవ్వనున్నట్లు బజాజ్ ఆటో మార్కెటింగ్ వైస్ ప్రసిడెంట్ సుమీత్ నరంగ్ తెలిపారు. బైక్ రైడార్స్ కోసం గుర్రంగూడలో నిర్వహించిన పోటీల్లో స్టంట్ విన్నర్స్‌గా వాసిమ్ ఖురేషీ, మన్మోహన్ సింగ్ నర్వాల్, రోహిత్ క్రూజీ, అలాగే రేస్ విన్నర్స్‌గా ఎన్‌వి. సత్యనారాయణ, పెద్ది శ్రీహర్ష, ఆయతపు నిఖిల్ నిలిచారన్నారు.

పోస్టర్‌లా చుట్టే టివి

65 అంగుళాల టివిని ఆవిష్కరించిన ఎల్‌జి



న్యూఢిల్లీ: పోస్టర్‌లా చుట్టే టీవీలను ఎప్పుడైనా చూశారా? ఇప్పటి వరకు ఎక్కడా చూసి ఉండరు. తాజాగా ప్రముఖ ఎలక్ట్రానికి వస్తువుల తయారీ సంస్థ ఎల్‌జి మార్కెట్లోకి ఉండలా చుట్టే టీవీని తీసుకువచ్చింది. ప్రముఖ దక్షిణ కొరియా తయారీ సంస్థ ఎల్‌జి ఈ 4కె ఒఎల్‌ఇజి డిస్‌ప్లే 65 అంగుళాల టీవీని మార్కెట్లోకి తీసుకురానుంది. లాస్‌వెగాస్‌లో జరిగే సెస్–2018 కార్యక్రమంలో తొలిసారిగా ఆవిష్కరించింది. రెండేళ్ల కిందట మడతపెట్టగలిగే 18 అంగుళాల ఒఎల్‌ఇడి టీవీని తీసుకొస్తామని ప్రకటించిన ఎల్‌జి.. ఇప్పుడు దాని కంటే ఎంతో పెద్దదైన టీవీని ఆవిష్కరిస్తోంది. దీనివల్ల టీవీని ఈజీగా ఎక్కడికంటే అక్కడికి తీసుకెళ్లడంతోపాటు స్టోరేజ్ సమస్య కూడా ఉండదు. దీంతోపాటు ఈ సౌత్ కొరియన్ కంపెనీ.. 88 అంగుళాల 8కె ఒఎల్‌ఇడి టీవీని కూడా ఇదే షోలో లాంచ్ చేయడం విశేషం.

ప్రపంచంలో ఇదే తొలి 88 అంగుళాల 8కే రిజల్యూషన్ టీవీ.. అవసరం లేనపుడు మడత పెట్టి బీరువాలో పెట్టుకునే విధంగా 65 అంగుళాల తెరను ఎల్‌జి రూపొందించింది. ఇక ప్రస్తుతం ఉన్న ఐపిఎస్ టెక్నాలజీని కూడా అభివృద్ధి చేసి ఐపిఎస్ నానో కలర్, యుఐపిఎస్‌లను అమలు చేయనున్నట్లు కంపెనీ ప్రకటించింది. వీటితోపాటు టీవీలకు 65 అంగుళాల ఆర్ట్ గ్లాస్ డిస్‌ప్లే, మానిటర్లకు 14 అంగుళాలు, 31.5 అంగుళాల ఆర్ట్ గ్లాస్ డిస్‌ప్లేలను సిఇఎస్‌లో భాగంగా ఆవిష్కరించింది.

అమెజాన్‌లో 'నోకియా మొబైల్ వీక్'



న్యూఢిల్లీ: ఇ–కామర్స్ దిగ్గజం అమెజాన్ 'నోకియా మొబైల్ వీక్' ఈనెల 8 నుంచి ప్రారంభించింది. ఈ సందర్భంగా నోకియా 8, నోకియా 6 స్మార్ట్‌ఫోన్లపై డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్‌లు, ఎక్స్ఛేంజ్ ఆఫర్లను అందిస్తోంది. ఐదు రోజుల పాటు అంటే జనవరి 12 వరకు ఈ మొబైల్ వీక్‌ను అమెజాన్ నిర్వహించనుంది. ఈ సేల్‌లో భాగంగా నోకియా 6, నోకియా 8 స్మార్ట్‌ఫోన్లపై ఇన్‌స్టాంట్ డిస్కౌంట్ కింద రూ.1500 వరకు అమెజాన్ ఆఫర్ చేస్తోంది. ఈ ఇన్‌స్టాంట్ డిస్కౌంట్‌తో రూ.14,999గా ఉన్న నోకియా 6 స్మార్ట్‌ఫోన్ రూ.13,499కు దిగొచ్చింది. రూ.36,999గా ఉన్న నోకియా 8 స్మార్ట్‌ఫోన్ రూ.35,499కు తగ్గింది. ఐసిఐసిఐ బ్యాంకు క్రెడిట్ కార్డు వినియోగదారులకు అదనంగా రూ.1500 డిస్కౌంట్ అందుబాటులో ఉంటుంది. ఈ ఆఫర్ అందుబాటులోకి రావాలంటే, కార్డుపై రూ.10వేల వరకు కొనుగోళ్లు జరపాల్సి ఉంటుంది. ఒక్కో కార్డుపై ఒక్కసారి మాత్రమే ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

మారుతీ సుజుకీ కొత్త కారు వచ్చేస్తోంది..

న్యూఢిల్లీ: దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ సోమవారం సరికొత్త కాంపాక్ట్ కారు 'కాన్సెప్ట్‌ఫ్యూచర్స్ ఎస్' టీజర్‌ను ఆవిష్కరించింది. 'కాన్సెప్ట్‌ఫ్యూచర్ ఎస్' అద్భుతమైన స్టైల్ కారు, వినియోగదారుల ఆశలకు అనుగుణంగా ఈ కారును సంస్థ తీసుకొస్తోంది. కాంపాక్ట్ అందమైన కారు, ప్రజాదరణ పొందనుందని సంస్థ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఇంజినీరింగ్) సివి రామన్ మాట్లాడుతూ, యుటిలిటీ వెహికిల్‌కు ప్రాధాన్యత పెరుగుతోందని, కాంపాక్ట్ కార్లకు కొత్త డిజైన్ తీసుకురావాలనే దృక్పథంతో ఉన్నామని అన్నారు.



విమాన సంస్థల భారీ డిస్కౌంట్లు

న్యూఢిల్లీ: విమాన ప్రయాణికుల తాకిడీ పెరగడంతో కంపెనీలు కూడా ఆకర్షించేందుకు ఆఫర్ల మీద ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. వినియోగదారులకు ఆభారీ డిస్కౌంట్లు అందిస్తున్నాయి. ప్రముఖ విమానయాన సంస్థలు కొన్ని ఎంచుకున్న దారుల్లో వాటి టికెట్ ధరలపై పరిమితకాల డిస్కౌంట్లను ఇస్తున్నాయి. కొత్త సంవత్సరం సందర్భంగా ఇండిగో, ఎయిర్ ఏషియా ఇండియా, గోఎయిర్, విస్తారా దేశీయ ప్రయాణికుల కోసం టికెట్ ధరలపై డిస్కౌంట్లు ప్రకటించాయి. వీటిలో ఇండిగో టికెట్ల ప్రారంభ ధరను రూ.899గా నిర్ణయించింది. అలాగే ఎయిర్ ఏసియా రూ.1,599, గోఎయిర్ టికెట్ ధర రూ.1,005గా ప్రారంభ ధరలను నిర్ణయించాయి. న్యూఇయర్ సేల్‌లో భాగంగా అందించే ఈ డిస్కౌంట్లకు సంబంధించి ఇండిగో జనవరి 10, గోఎయిర్ జనవరి 11, ఎయిర్ ఏషియా జనవరి 14 వరకు టికెట్లు బుకింగ్ చేసుకునేందుకు వెలసులబాటు కల్పించాయి. ప్రత్యేక 24 గంటల సేల్‌లో భాగంగా విస్తారా దేశీయ విమాన టికెట్ల ప్రారంభ ధర రూ.1,099గా నిర్ణయించింది.



టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
కోల్ ఇండియా	290.60	279.00	287.45	278.75	8.70	3.12
లుపిన్	927.00	905.00	923.30	900.15	23.15	2.57
ఇన్ఫోసిస్	1,039.00	1,020.05	1,036.05	1,012.00	24.05	2.38
సన్‌ఫార్మా	604.60	586.15	591.60	578.75	12.85	2.22
ఇండియాబుల్స్	1,228.30	1,196.80	1,225.30	1,198.95	26.35	2.20
టెక్ మహీంద్ర	542.85	520.70	536.30	525.45	10.85	2.06
బిపిసిఎల్	501.50	490.00	497.20	487.70	9.50	1.95
లార్సెన్	1,345.95	1,316.50	1,338.25	1,314.90	23.35	1.78
బోస్క్	20,143.20	19,650.05	19,998.35	19,693.15	305.20	1.55
హెచ్‌పిసిఎల్	423.60	416.80	421.15	415.00	6.15	1.48

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
భారతి ఎయిర్‌టెల్	534.15	514.20	516.35	540.00	23.65	4.38
ఒఎన్‌జిసి	199.90	196.70	197.40	198.45	1.05	0.53
పవర్ గ్రిడ్ కార్ప్	203.25	200.05	200.55	201.25	0.70	0.35
ఎసియన్ పెయింట్స్	1,190.85	1,173.50	1,182.00	1,185.25	3.25	0.27
టాటా స్టీల్	777.85	765.00	768.75	770.70	1.95	0.25
అదానీ పోర్ట్స్	427.50	421.10	422.90	423.80	0.90	0.21
ఎస్‌బిఐ	309.50	305.00	305.80	306.35	0.55	0.18
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు	1,870.70	1,857.75	1,860.60	1,863.60	3.00	0.16
ఐచర్ మోటార్స్	29,400.00	29,040.05	29,197.40	29,237.00	39.60	0.14
బజాజ్ ఆటో	3,296.70	3,265.25	3,275.75	3,279.85	4.10	0.13

పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే గొప్పది : అనంత్‌కుమార్



న్యూఢిల్లీ : పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఎంతో గొప్పదని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్ కుమార్ అన్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో రెండు రోజుల పాటు జరుగుతున్న విప్‌ల సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా విప్‌ల బాధ్యతలను ఆయన వివరించారు. ప్రజాప్రాతినిధ్య సభల్లో పార్టీ సభ్యులను హద్దులు మీరకుండా చూడాల్సిన బాధ్యత విప్‌లపైనే ఉందని అనంత్ కుమార్ అన్నారు. అదే విధంగా ఆయా పార్టీల సభ్యులను చైతన్యపరచడంతో కూడా విప్‌లు కీలక పాత్ర పోషించాలని ఆయన సూచించారు. అనేక పార్టీల ప్రతినిధులతో కూడిన ఈ సదస్సు ఇంద్రధనస్సును తలపిస్తోందని ఆయన అన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, ఆ వ్యవస్థలో ఉన్న సంస్థలను మరింత పటిష్ట పరిచేందుకే ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సదస్సుకు రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధరా రాజే కూడా హాజరయ్యారు. చట్ట సభల్లో జరిగే చర్చలు అర్థవంతంగా జరగాలని ఆమె సూచించారు. సహృద్భావ వాతావరణంలో మర్యాదపూర్వకంగా చర్చలు జరిగినప్పుడే ప్రజలు హర్షిస్తారని ఆమె అన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు కేంద్రం నుంచి 19 రాష్ట్రాల నుంచి మొత్తం 90మంది ప్రతినిధులు పాల్గొన్నారు. సదస్సు చివరిరోజైన మంగళవారం ఈ విధాన్‌పై చర్చ జరగనుంది.

బెయిల్ కోసం లాలూ ప్రయత్నాలు

- జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించనున్న న్యాయవాది

రాంచీ: దాణా కుంభకోణంలో రాంచీ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ బెయిల్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. లాలూ తరఫు న్యాయవాది ప్రభాత్ కుమార్ జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించనున్నారు. కోర్టు తీర్పును క్షుణ్ణంగా చదివిన తర్వాత శుక్రవారం గానీ, సోమవారం గానీ హైకోర్టును సంప్రదించనున్నట్లు సోమవారం నాడు ప్రభాత్ కుమార్ మీడియాకు తెలిపారు. లాలూ సోదరి చనిపోవడంతో పెరోల్ మీద బయటకు వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. గత ఏడాది డిసెంబర్ 23న దాణా కుంభకోణంలో లాలూ ప్రసాద్ యాదవ్ దోషి అని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం తేల్చింది. జనవరి 6 వ తేదీన ఆయనకు శిక్షను ఖరారు చేసింది. మూడున్నరేళ్ల పాటు జైలు శిక్ష, 10 లక్షల రూపాయల జరిమానా విధించింది.

ఎన్నికల బరిలో వైద్యులు

- జనవరి 29న ఆల్వాల్ ఉప ఎన్నిక

జైపూర్: రాజస్థాన్‌లోని ఆల్వాల్ లోక్‌సభ స్థానానికి జరిగే ఉప ఎన్నిక పోరు రసవత్తరంగా మారుతోంది. జనవరి 29న జరిగే బైపోల్, ఈ ఏడాది చివర్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సెమీఫైనల్‌గా పరిగణించబడుతోంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిజెపిలు ఎన్నికల బరిలో నిలిచేందుకు వైద్యులకు అవకాశం కల్పించింది. యాదవ వర్గీయులు ఎక్కువగా ఉన్న ఈ నియోజకవర్గంలో ఇరుపార్టీలు యాదవ డాక్టర్లనే బరిలో నిలుపుతున్నాయి. ఆల్వాల్ మాజీ ఎంపి డా. కరణ్‌సింగ్ యాదవ్‌కు కాంగ్రెస్ అవకాశమివ్వగా, రాష్ట్ర మంత్రిగా పనిచేసిన డా. జస్వంత్ యాదవ్‌కు బిజెపి అవకాశం కల్పించింది. బరిలో నిలిచిన ఇద్దరికీ ఆ ప్రాంతంలో మంచి పట్టుంది. దీంతో ఇద్దరు విజయావకాశాలపై ధీమాతో ప్రచారం ప్రారంభిచారు. బిజెపి ఎంపి చాంద్ నాథ్ మరణించడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమయింది. 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో చాంద్‌నాథ్ ఆల్వాల్ నియోజవర్గం నుంచి 2.8 లక్షల ఓట్ల మెజార్టీతో ప్రత్యర్థిపై గెలుపొందారు. 2017 సెప్టెంబర్ నెలలో క్యాన్సర్ వ్యాధి కారణంగా ఆయన మరణించారు.

రూపాయి బిళ్ల వద్దంటున్న బిచ్చగాళ్లు

- చెలామణిలో లేకుండా చెయ్యాలని నిర్ణయం

రాంపూర్: ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌లోని బిచ్చగాళ్లు రూపాయి బిళ్లని బిచ్చం గా స్వీకరించేందుకు నిరాకరిస్తున్నారు. ఎవరైనా తమకు రూపాయిని బిచ్చంగా వేస్తే వద్దని అంటున్నారు. వాటి వల్ల ప్రయోజనం లేదని వాపోతున్నారు. తమ వద్ద ఉన్న రూపాయి బిళ్లలను దుకాణదారులు గానీ, రిక్షావాలాలు గానీ తీసుకోవడం లేదని వారు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న రూపాయి బిళ్ల 50 పైసల బిళ్ల మాదిరిగా ఉండడంతో చాలాచోట్ల అవి చెల్లుబాటు కావడం లేదని వారు ఫిర్యాదు చేస్తున్నారు. ప్రధాని మోడీ పెద్ద నోట్ల రద్దు నిర్ణయం తీసుకుని 500, 1000 రూపా యల నోట్లను ఎలాగైతే చెలామణిలో లేకుండా చేశారో అదే విధంగా తాము రూపాయి బిళ్లను చెలామణిలో లేకుండా చేస్తున్నామని శుక్రమణి అనే బిచ్చగాడు వివరణ ఇచ్చాడు.

బ్రహెయిన్ యువరాజుతో రాహుల్

- భేటీలో ఇరు దేశాలకు చెందిన వివిధ అంశాలపై చర్చలు



మనామా: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బ్రహెయిన్‌లో పర్యటిస్తున్నారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన చేస్తున్న తొలి విదేశీ పర్యటన ఇదే కావడంతో ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. మనామాలో బ్రహెయిన్ యువరాజు షేక్ సల్మాన్ బిన్ హమీద్ అల్ ఖలీఫాను కలిశారు. ఇరు దేశాలకు సంబంధించిన అనేక కీలక విషయాలపై ఇరువురు నేతలు చర్చలు జరిపారు. ఈ విషయాన్ని రాహుల్ గాంధీ ట్వీట్ల ద్వారా సోమవారం వెల్లడించారు. అదే విధంగా బ్రహెయిన్ విదేశాంగ మంత్రి షేక్ ఖలీద్ బిన్ హమీద్ అల్ ఖలీఫా ను కూడా కలిశారు. ఆయన ఏర్పాటు చేసిన విందును స్వీకరించారు. విందు సమావేశం తర్వాత రాహుల్ ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా తెలిపారు. విదేశాంగ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం గ్లోబల్ ఆర్గనైజేషన్ ఆఫ్ పీపుల్ ఆఫ్ ఇండియా ఆరిజన్ (జిఒపిఐఒ)ఏర్పాటు చేసిన వీడ్కోలు సదస్సుకు రాహుల్ చీఫ్ గెస్ట్‌గా హాజరయ్యారు. ఆ సదస్సుకు 50 దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఎన్‌ఆర్‌ఐలు భారత దేశపు బ్రాండ్ అంబాసిడర్లని రాహుల్ ఈ సందర్భంగా అన్నారు. మంగళవారం నాడు రాహుల్ భారతదేశానికి చెందిన వ్యాపారవేత్తలతో సమావేశం కానున్నారు.

క్యాట్ 2017 ఫలితాలు వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో ప్రఖ్యాత బిజినెస్ స్కూళ్లలో ప్రవేశం కోసం నిర్వహించిన క్యాట్ 2017 పరీక్షా ఫలితాలు సోమవారం వెల్లడయ్యాయి. ఈసారి ఫలితాల్లో 20 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించారు. గతేడాదీ 20మంది 100 పర్సంటైల్ సాధించారు. వారందరూ ఇంజినీరింగ్ నేపథ్యం నుంచి వచ్చిన పురుషులు కాగా, ఈ ఏడాది వెలువడిన ఫలితాల్లో 100 పర్సంటైల్ సాధించిన వారిలో ఇద్దరు మహిళలుండడం విశేషం. అదే విధంగా ఇంజినీరింగ్ బ్యాక్‌గ్రౌండ్‌కి చెందని వారు ముగ్గురున్నట్లు ఐఐఎం లక్నో వెల్లడించింది. 2017 నవంబర్ 26న జరిగిన పరీక్షకు దేశవ్యాప్తంగా 1,99,632 మంది విద్యార్థులు హాజరు కాగా, 140 కేంద్రాల్లో రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహించారు. ఫలితాలను ఐఐఎం వెబ్‌సైట్‌లో ఉంచారు. అదే విధంగా ప్రతి విద్యార్థికి సంక్షిప్త సందేశం (ఎస్‌ఎంఎస్) ద్వారా పెర్సంటైల్ వివరాలు తెలియజేశారు. దేశంలో ప్రస్తుతం 20 ఐఐఎంలున్నాయి. వాటిలో 4000 మందికి రెండేళ్ల మేనేజ్‌మెంట్ కోర్స్ నేర్చుకునే అవకాశం ఉంది. ఐఐఎంలతో పాటు దేశంలో దాదాపు 100 విద్యాసంస్థలు క్యాట్ స్కోర్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

రూ.472 కోట్ల ఆస్తుల జప్తు : ఇడి

న్యూఢిల్లీ: పిఎసిఎల్ పోంజి కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోమవారం రూ.472 కోట్ల విలువగల ఆస్తులను జప్తు చేసింది. ఈ గ్రూపుకు చెందిన డైరెక్టర్లు, అధికారులపై సిబిఐ నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా 2015లో ఇడి క్రిమినల్ కేసు దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో దర్యాప్తు చేపట్టిన అధికారులు పిఎసిఎల్ పోంజి కుంభకోణంలో కీలకపాత్ర పోషించిన నిర్మల్ సింగ్ భంగూకు చెందిన రూ.472 కోట్ల ఆస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద జప్తు చేసినట్లు ఇడి ఒక ప్రకటనలో పేర్కొంది. జప్తు చేసిన వాటిలో ఎంఐఐ రీసార్ట్స్ గ్రూప్ 1 ప్రైవేట్ లిమిటెడ్, ఆస్ట్రేలియాలోని సాంక్టువరీ కోవ్ ఆస్తులు కూడా ఉన్నట్లు తెలిపింది.

దుబాయి క్రీక్ టవర్



ప్రపంచంలో అత్యంత ఎత్తయిన భవంతిగా పేరుగాంచిన 'బుర్జ్ ఖలీఫా' ఇక రెండో స్థానానికి పడిపోనుంది. దుబాయిలో దానికన్నా ఎత్తయిన ఆకాశహర్మ్యాన్ని నిర్మిస్తున్నారు. 'దుబాయి క్రీక్ టవర్'గా పేరుగాంచిన ఈ భవంతి బుర్జ్ ఖలీఫా(828 మీటర్లు) కన్నా 100 మీటర్లు ఎక్కువే. దీనికి డచ్ కంపెనీ ఫుగ్రో సాంకేతిక సాయాన్ని అందజేస్తుంది. ఎమ్మార్ ప్రాపర్టీస్ సంస్థ నిర్మిస్తున్న ఈ భవంతిని 2020నాటికి పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.





మనోడికి గోల్డెన్ గ్లోబ్

భారత సంతతి నటుడికి తొలిసారి గోల్డెన్ గ్లోబ్ అవార్డు దక్కింది. ఈ యేటి వేడుకల్లో అజీజ్ అన్సారీ టీవీ సిరీస్‌లో ఉత్తమ నటుడి అవార్డును గెలుచుకున్నాడు. ద మాస్టర్ ఆఫ్ నన్ అన్న కామిడీ సిరీస్‌లో అజీజ్ అన్సారీ నటించాడు. అవార్డును గెలుచుకోవడం సంతోషంగా ఉందని 34 ఏళ్ల అజీజ్ తెలిపాడు. నెట్‌ఫ్లిక్స్‌లో ద మాస్టర్ ఆఫ్ నన్ సిరీస్ వస్తోంది. 2016లోనూ ఇదే సిరీస్ కోసం అన్సారీ నామినేట్ అయ్యాడు. కానీ ఈ సారి అన్సారీ అవార్డును గెలుచుకోవడం విశేషం. కామిటీ క్యాటగిరీలో గోల్డెన్ గ్లోబ్ గెలుచుకున్న మొదటి ఆసియా నటుడు కూడా ఇతనే. ఆంథోనీ అండర్సన్, కెవిన్ బీకన్, విలియమ్ మాకీ, ఎరిక్ మెక్‌కార్మాక్ నుంచి అన్సారీ గట్టి పోటీ ఎదుర్కొన్నాడు.

– లాస్ ఏంజిల్స్

స్థానిక భాషల్లో సమాచార మార్పిడి



- అప్పుడే భద్రత మెరుగునకు అవకాశం
- డిజిపిలు, ఐజిపిల సదస్సులో ప్రధాని నరేంద్ర మోడీ

టేకాన్‌పూర్ (మధ్యప్రదేశ్): సైబర్ నేరాలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి కేసులను దర్యాప్తు చేయాలని ప్రధాని మోడీ సీనియర్ పోలీసు అధికారులకు సూచించారు. సోషల్ మీడియా, సైబర్ నేరాల విషయంలో పోలీసులు సత్వరమే స్పందించాల్సి ఉందన్నారు. బిఎస్‌ఎఫ్ అకాడమీలో డిజిపిలు, ఐజిపిలతో వార్షిక సదస్సులో ప్రధాని మోడీ ప్రసంగించారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో వివిధ రాష్ట్రాలు, సెంట్రల్ పోలీసు సంస్థల నుంచి 250కి పైగా పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దేశంలో భద్రతా వ్యవస్థను మరింత పటిష్ఠపరచాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. రాష్ట్రాల మధ్య సమాచారాన్ని పంచుకోవడం ద్వారానే భద్రత మెరుగుపడుతుందని అన్నారు. జమ్ముకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు, నక్సలైట్ల ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. సోషల్ మీడియా ప్రాధాన్యతను తెలియజేస్తూ మరింత ప్రభావవంతంగా ఉండేందుకు మెసేజింగ్ స్థానిక భాషల్లో జరిగితే బావుంటుందని చెప్పారు. యువత తప్పుదోవ పడుతున్న నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానంతో ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి నిలుపాలని సూచించారు. ఫలవంతంగా జరిగిన ఈ సదస్సు పోలీసు అధికారులకు వివిధ రకాల సవాళ్లను ఎదుర్కోవడానికి ఎంతగానో దోహదపడుతుందని ఆకాంక్షించారు. అనంతరం ప్రధాని పలువురు ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులకు రాష్ట్రపతి పతకాలు అందజేశారు. 'భద్రత, పోలీసింగ్‌పై అధికారుల బృందాలతో చర్చలు జరిగాయి. మూడేళ్లలో తీసుకున్న నిర్ణయాల అమలుపై చర్చ జరిగింది' అని సదస్సు అనంతరం ప్రధాని మోడీ ట్వీట్ చేశారు. సదస్సుకు హాజరైన అధికారులు అర్థవంతమైన ప్రజెంటేషన్లు ఇవ్వడంతో పాటు ఫలవంతమైన చర్చలు జరిపారని, ప్రత్యేకమైన ప్రాంతాల్లో పోలీసింగ్, భద్రతకు తీసుకోవాల్సిన అంశాలపై అధికారులు గ్రూపులుగా సమావేశమై చర్చించారని ట్వీట్ చేశారు. గత మూడేళ్లుగా జరిగిన వివిధ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు ప్రస్తుతం అమలు దశలో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్, సహాయ మంత్రి హన్స్‌రాజ్ అహిర్, కిరెన్ రిజిజు తదితరులు పాల్గొన్నారు. కాగా, మోడీ సూచనల మేరకు హోంశాఖ 2014 నుంచి ప్రతి ఏటా పోలీసు ఉన్నతాధికారుల సదస్సు నిర్వహిస్తోంది. ఇంతవరకు గువాహటి, రాణా ఆఫ్ కచ్, హైదరాబాద్‌ల్లో సమావేశాలు జరిగాయి.

పత్రికా స్వేచ్ఛకు భంగం కలగనివ్వం

- అజ్ఞాత వ్యక్తిపై కేసు నమోదు
- విచారణకు ట్రిబ్యూన్ సహకరించాలి
- న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్



న్యూఢిల్లీ: పత్రికా స్వేచ్ఛకు ప్రభుత్వం కట్టుబడి ఉందని న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. ఆధార్ డేటా కేసులో ఓ అజ్ఞాత వ్యక్తిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. దేశ అభివృద్ధి కోసం ఆధార్ డేటాను భద్రపరుస్తామని, దాని పవిత్రతకు ఎలాంటి భంగం రానివ్వమని, అలాగే పత్రికా స్వేచ్ఛకు కూడా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ఇటీవల ట్రిబ్యూన్ పత్రికలో వచ్చిన కథనం ఆధారంగా యుఐడిఎఐ అధికారులు ఆ పత్రిక రిపోర్టర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. కేవలం రూ.500 ఇస్తే, ఆధార్ డేటాను పూర్తిగా తెలుసుకునే అవకాశం ఉందని ఆ పత్రిక ఇటీవల ఓ సంచలన కథనాన్ని ప్రచురించింది. ఆ కథనాన్ని సీరియస్‌గా తీసుకున్న యుఐడిఎఐ కేసు నమోదు చేసింది. వాట్సాప్ ద్వారా గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఆధార్ డేటా సేకరించినట్లు కథనంలో ఉంది. అయితే ఆ గుర్తు తెలియని వ్యక్తిపైనే పోలీసులు కేసు నమోదు చేసినట్లు మంత్రి తెలిపారు. పత్రికపై నమోదైన కేసును ఉపసంహరించుకోవాలని ఎడిటర్స్ గిల్డ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఆధార్ కథనంలో నిష్పాక్షికంగా విచారణ చేపట్టాలని ఎడిటర్స్ గిల్డ్ డిమాండ్ చేసింది. ఆధార్ కేసులో పత్రికతో పాటు జర్నలిస్టులు విచారణకు సహకరించాలని కోరినట్లు మంత్రి వెల్లడించారు. మరోవైపు ట్రిబ్యూన్ పాత్రికేయుడిపై కేసు నమోదు చేయడాన్ని న్యూస్ పేపర్ కాన్ఫెడరేషన్‌తో పాటు న్యూస్ ఏజెన్సీల ఉద్యోగులు తీవ్రంగా ఖండించారు. అతడిపై వెంటనే కేసు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఐజెయు ఖండన

మన తెలంగాణ/హైదరాబాద్: ఆధార్ సమాచారం దారి మళ్లుతున్న వైనంపై కథనం రాసిన విలేకరిపై యుఐడిఎఐ (యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా) కేసు పెట్టడాన్ని ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజెయు) ఖండించింది. చండీగఢ్‌కు చెందిన ట్రిబ్యూన్ పత్రిక విలేకరి రచనా ఖైరాపై యుఐడిఎఐ అధికారులు కేసు ఫైల్ చేసిన సంగతి తెలిసిందే. వ్యవస్థలోని డొల్లతనాన్ని ఎత్తిచూపితే, దాన్ని సరిదిద్దుకోకుండా, మీడియాపైనే కేసులు పెట్టడాన్ని ఐజెయు అధ్యక్షుడు ఎస్‌ఎన్ సిన్హా, సెక్రటరీ జనరల్ దేవులపల్లి అమర్, కార్యదర్శులు బల్విందర్ జమ్ము, నరేందర్ రెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు. ఇది భావప్రకటనా స్వేచ్ఛపై దాడి అని వారు పేర్కొన్నారు. ఈ విషయంపై కేంద్రం జోక్యం చేసుకోవాలని, సమాచార భద్రతపై దృష్టిపెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనను ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సుమోటోగా తీసుకొని, విచారించాలని కోరింది.

శత్రుఘ్న సిన్హా విమర్శలు..

ఆధార్ అవకతవకలను వెలుగులోకి తెచ్చిన వారిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం పట్ల బిజెపి ఎంపి శత్రుఘ్న సిన్హా విమర్శలు గుప్పించారు. ఆధార్ లోటుపాట్లను బహిర్గతం చేస్తే కేసులు పెడతారా..? ఇదెక్కడి న్యాయం..? అని ప్రభుత్వంపై మండిపడ్డారు. మనమేమైనా బనానా రిపబ్లిక్‌లో ఉన్నామా అంటూ తనదైన శైలిలో ట్విట్టర్ వేదికగా నిలదీశారు. దేశంకోసం, జాతి ప్రయోజనాల కోసం బయటికొస్తున్న వారినీ బాధితులుగా చేస్తున్నారని ట్వీట్ చేశారు.

గాంధీని చంపింది గాడ్సేనే

- హత్య కేసు తిరగదోడనక్కర్లేదు
- సుప్రీంకోర్టుకు అమికస్ క్యూరీ నివేదిక

న్యూఢిల్లీ: గాంధీని చంపింది గాడ్సేనే అని, ఇంతకాలం తర్వాత కేసును తిరగదోడాల్సిన పని లేదని కోర్టు నియమించిన అమికస్ క్యూరీ, సీనియర్ లాయర్ అమరేంద్ర శరణ్ సుప్రీంకోర్టుకు స్పష్టంచేశారు. జస్టిస్ ఎస్ఏ బోబ్డె నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసుపై విచారణ జరుపుతోంది. మహాత్మా గాంధీ హత్యలో ఓ విదేశీ సంస్థ హస్తం ఉందని, ఈ కేసును తిరిగి విచారించాలని దాఖలైన పిల్‌పై విచారణలో భాగంగా ధర్మాసనం ఏర్పాటైంది. దీనికి సంబంధించిన అమికస్ క్యూరీగా అమరేంద్ర శరణ్‌ను సుప్రీం నియమించింది. కానీ కేసు పునర్విచారణ అవసరం లేదని సోమవారం నాడు సుప్రీంకు సమర్పించిన నివేదికలో శరణ్ స్పష్టం చేశారు. విదేశీ సంస్థ హస్తం ఉందనడానికి ఎలాంటి ఆధారాలు లేవని ఆయన వెల్లడించారు. గాంధీ శరీరంలోకి దిగిన బుల్లెట్లు, ఏ పిస్తోలు నుంచి అవి దూసుకెళ్లాయి? ఎవరు కాల్చారు? ఇలా అన్నింటినీ స్పష్టంగా గుర్తించారు. అందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు. దీనిపై కొత్తగా మరో నిజనిర్ధారణ కమిటీ గానీ పునర్విచారణగానీ అవసరం లేదని శరణ్ నివేదిక తెలిపింది.

ఉగ్రవాదిగా మారిన రీసెర్చ్ స్కాలర్



శ్రీనగర్: అలీగఢ్ ముస్లిం యూనివర్శిటీ (ఎఎంయు)కి చెందిన రీసెర్చ్ స్కాలర్ ఉగ్రవాద భావజాలానికి ఆకర్షితుడై హిజుబుల్ ముజాహిదీన్ గ్రూప్‌లో చేరినట్లు తెలిసింది. ఎఎంయులోని జియాలజీ విభాగంలో పరిశోధక విద్యార్థిగా మన్నన్ వనీ గత నాలుగైదు ఏళ్లుగా అప్లైడ్ జియాలజీని ప్రత్యేక సబ్జెక్ట్‌గా ఎంచుకొని చదువు కొనసాగిస్తున్నాడు. గతేడాది ఉత్తర కశ్మీర్‌లోని తన సొంత పట్టణంలో రిమోట్ సెన్సింగ్, జిఐఎస్ పద్ధతులు ఉపయోగించి వరద ప్రమాద అంచనాపై అతను చేసిన పరిశోధనలకు ప్రశంసలు లభించాయి. 2016లో భోపాల్‌లో జరిగిన ఓ అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో అతడిచ్చిన ప్రదర్శనకు మొదటి బహుమతి కూడా లభించింది. అయితే మన్నన్ ఇటీవల ఇంటికి వెళ్తున్నట్లు చెప్పి విద్యాలయానికి తిరిగి రాలేదు. ఇంతలో అతడి ఫొటో ఒకటి సామాజిక మాధ్యమాల్లో దర్శనమిచ్చింది. ఏకే రైఫిల్ ధరించి ఉన్నాడు అందులో. హిజ్బుల్ ముజాహిదీన్ గ్రూప్‌లో చేరినట్లు పేర్కొన్నాడు. ఫొటోను చూసిన అతని స్నేహితులు, సన్నిహితులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. అలీగఢ్ నుంచి అతను కొద్ది రోజుల క్రితమే కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలోని ఇంటికి వెళ్తున్నట్లు చెప్పి బయల్దేరాడు. అయితే మూడు రోజుల క్రితమే ఇంటికి చేరాల్సి ఉంది. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతూనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సెక్షన్ 377 రాజ్యాంగబద్ధతపై పునఃపరిశీలన



అంగీకరించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ: స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణించే సెక్షన్ 377 రాజ్యాంగబద్ధతను పునః పరిశీలించేందుకు సుప్రీం కోర్టు అంగీకరించింది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా సహా మరో ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మా సనం ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి రిఫర్ చేసింది. మరింత మంది సభ్యులతో కూడిన ధర్మాసనంలో సెక్షన్ 377 రాజ్యాంగబద్ధతపై చర్చించాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో 2013 లో ఢిల్లీ కోర్టు ఓ కేసులో స్వలింగ సంపర్కం నేరం కాదని ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. అప్పట్లో ఎల్‌జిబిటిక్యు (లెస్బియన్స్, గే, బై సెక్సువల్, ట్రాన్స్‌జెండర్, క్వీర్) సెక్స్‌ను నేరంగా పరిగణిస్తూ సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయం మానవహక్కుల ఉల్లంఘన అని వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ తరుణంలో ఇప్పుడు ఆ తీర్పును కోర్టు తిరిగి పరిశీలించనుంది. కాగా, ప్రకృతికి విరుద్ధమైన లైంగిక చర్యలను నేరంగా పరిగణిస్తూ ఉన్న చట్టం బ్రిటిష్ కాలం నాటిదని, ఒకరికి ప్రకృతి సహజం అనిపించిన విషయం మరొకరికి ఆ విధంగా అనిపించకపోవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ చట్టం వల్ల తాము భయం భయంగా బతకాల్సి వస్తోందని ఐదుగురు దాఖలు చేసిన పిటిషన్ పై సోమవారం విచారణ జరిపిన కోర్టు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

ముంబయిని వీడని అగ్ని ప్రమాదాలు

- తాజాగా సెషన్స్ కోర్టులో ఘటన

ముంబయి: అగ్నిప్రమాదాలు ముంబయిని వెంటాడుతూనే ఉన్నాయి. కేవలం మూడు వారాల్లోనే దేశ ఆర్థిక రాజధానిలో ఐదు అగ్నిప్రమాద ఘటనలు జరిగాయి. సోమవారం ఉదయం నగరంలో ఉన్న ఓ సెషన్స్ కోర్టు భవనంలోని మూడవ అంతస్థులో మంటలు వ్యాపించినట్లు అధికారులు చెప్పారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ హాని జరగలేదన్నారు. అయితే కొన్ని అధికారిక రికార్డులు దగ్ధమయ్యాయన్నారు. ముంబయి యూనివర్శిటీకి సమీపంలో ఉన్న కోర్టులో అగ్నిప్రమాదం జరిగినట్లు ఉదయం 7.14 గంటలకు అగ్నిమాపక శాఖకు సమాచారం అందిందని బ్రిహన్ ముంబయి కార్పొరేషన్ విపత్తు నిర్వహణ శాఖ అధికారులు తెలిపారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని కోర్టు భవనంలో చెలరేగిన మంటలను అదుపు తెచ్చారన్నారు. మంటల ధాటికి భవనం పెద్దగా దెబ్బ తినలేదని, కొన్ని అధికారిక రికార్డులు మాత్రం తగులబడ్డాయన్నారు.

రాజస్థాన్‌లో పద్మావత్ చిత్రానికి చుక్కెదురు

- జనవరి 25న విడుదలకు ముఖ్యమంత్రి ససేమిరా

జైపూర్: సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో రూపొందిన పద్మావత్ చిత్రానికి రాజస్థాన్‌లో చుక్కెదురయింది. దేశవ్యాప్తంగా ఈ నెల 25న చిత్రాన్ని విడుదల చేసేందుకు చిత్ర నిర్మాతలు సన్నాహాలు చేస్తున్న తరుణంలో రాజస్థాన్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని ఈ సినిమాను రాజస్థాన్‌లో విడుదల కాకుండా నిలిపివేస్తున్నట్లు రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధరా రాజే ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. రాణి పద్మావతి చేసిన త్యాగాలు ఎంతో గర్వకారణమైనవని, చరిత్రలో ఒక పాఠంగా మాత్రమే తాను పరిగణించడం లేదన్నారు.

25న 'పద్మావత్' విడుదల?

అనేక అవాంతరాల తర్వాత సంజయ్ లీలా బన్సాలీ వివాదాస్పద 'పద్మావత్' చిత్రం ఈనెల 25న విడుదల కానున్నట్టు వియాకామ్ 18 మోషన్ పిక్చర్స్‌కు చెందిన వర్గాలు తెలిపాయి. అసలు చిత్రం పేరు 'పద్మావతి' కాగా, వివాదాల నేపథ్యంలో 'పద్మావత్' పేరుతో మారుస్తూ ఫిలిం సర్టిఫికేషన్ ఆఫ్ సెన్సార్ బోర్డు (సిబిఎఫ్‌సి) సర్టిఫికెట్ ఇచ్చిన విషయం విదితమే. అసలు ఈ చిత్రం గత ఏడాది డిసెంబరు 1న విడుదల కావాల్సివుంది.



ట్రంప్ మానసిక ఆరోగ్యం భేష్ : నిక్కీ హేలీ

వాషింగ్టన్: ఒక వివాదాస్పద పుస్తకంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై వచ్చిన ఆరోపణలకు ఐక్యరాజ్యసమితిలో అమెరికా దూత నిక్కీ హేలీ సమాధానం చెబుతూ, ఆయన మానసిక స్థితిపై వైట్ హౌస్‌లో ఎవరికీ సందేహాలు లేవని అన్నారు. ఇండియన్ – అమెరికన్ హేలీ అమెరికాలోని క్యాబినెట్ ర్యాంకు అధికారులలో తొలి వ్యక్తి. అధ్యక్షుడి పాలనా యంత్రాంగంలో ఇంతకు ముందు క్యాబినెట్ స్థాయి అధికారి ఎవరూ లేరు. ట్రంప్ సిబ్బంది ఆయనపట్ల ఎంతో విధేయతతో, గౌరవంతో వ్యవహరిస్తారని హేలీ అన్నారు. 'ఫైర్ అండ్ ఫ్యూరీ' అనే పుస్తకంలో జర్నలిస్టు మైఖేల్ వుల్ఫ్ ఓవల్ ఆఫీసు లోపల అరాచకం గురించి 200 మందిని ఇంటర్వ్యూ చేసి వివాదాస్పద విషయాలను రాశారు. అధ్యక్ష పదవికి ట్రంప్ సమర్థతపై, ఆ పదవికి గల తెలివి తేటలు లోపించడంపై తనతో చాలా మంది ఉద్యోగులు అనుమానాలు వ్యక్తం చేసినట్లు వుల్ఫ్ రాశారు. ఆ వ్యాఖ్యలపై తాజా ప్రకటనలో హేలీ స్పందిస్తూ పై విధంగా అన్నారు.

పాక్‌లో వేళ్లూనుకున్న ఐసిస్

మేధావుల భద్రతా నివేదిక వెల్లడి



ఇస్లామాబాద్/వాషింగ్టన్: ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్ర గ్రూపు పాకిస్థాన్‌కు పెద్ద బెడదగా తయారయిందని, పాక్‌లో దాని ఉనికి రానురాను పెరుగుతోందని ఒక మేధావుల బృందం నివేదిక తెలిపింది. దేశంలో ఐఎస్ వ్యవస్థీకృత జాడలు లేవని పాక్ ప్రభుత్వం ఖండిస్తోంది. అయితే ఇటీవల కొన్నేళ్లుగాబలూచిస్థాన్‌లో చాలా దాడులకు తమదే బాధ్యతని ఆ ఉగ్ర సంస్థ ప్రకటనలు చేసింది. పాకిస్థాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పీస్ స్టడీస్ (శాంతి అధ్యయనాల సంస్థ – పిఐపిఎస్) ఆదివారం విడుదల చేసిన భద్రతా నివేదికలో ఐఎస్ ఉనికి గురించి కొన్ని వాస్తవాలు ప్రకటించింది. ఉత్తర సింధు, బలూచిస్థాన్‌లో ఐఎస్ బలంగా వేళ్లూనుకుందని చెప్పింది.గత ఏడాది చైనా జాతీయుడి అపహరణ – హత్యలో ఐఎస్ హస్తం ఉందని కూడా ఆ సంస్థ తెలిపింది. నివేదికలోని విషయాలను డాన్ న్యూస్ బయటపెట్టింది. '2017 ప్రత్యేక నివేదిక' పేరిట పిఐపిఎస్ పాకిస్థాన్‌లో భద్రతా సవాళ్ల గురించి వివరించింది. ఆ ఏడాది జరిగిన దాడుల్లో 58 శాతం తెహ్రీక్ –ఎ –తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) సాగించగా, 37 శాతం జాతీయ తిరుగుబాటు గ్రూపులు, 5 శాతం దాడులను తెగల బృందాలు సాగించినట్లు తెలిపింది.

వేరే మార్గంలో ఉగ్ర స్థావరాలు ఖతం : పాకిస్థాన్‌ను టెర్రరిస్టుల స్వర్గధామం కాకుండా చేయడానికి వేరే విధమైన ప్రయత్నాలు చేయడానికి ఇది తరుణమని ట్రంప్ పాలనా యంత్రాంగం భావిస్తోంది. ఓరిమి వహించడం,ఉగ్రస్థావరాలపైచర్యలకు ప్రేరేపించడం ప్రయత్నాలు వర్థమయ్యాయి కాబట్టి ఈ సమస్యతో ఇక వేరే విధంగా వ్యవహరించాలని అమెరికా ఉన్నత స్థాయి అధికార్లు సోమవారం నాడు అన్నారు. దాదాపు రెండు బిలియన్ డాలర్ల భద్రతా సహాయాన్ని ట్రంప్ పాలనా యంత్రాంగం నిలిపివేసిన తర్వాత వెలువడిన ప్రకటన ఇది. ఈ నిలిపివేతపై పాకిస్థాన్ తీవ్ర విమర్శలు గుప్పించింది. గత 15 ఏళ్లుగా 33 బిలియన్ డాలర్ల సహాయాన్ని తమ నుంచి అందుకున్న పాకిస్థాన్ బదులుగా ఇచ్చినది అబద్ధాలు, దగా మాత్రమేనని, పైగా ఉగ్రవాద స్థావరాలకు భద్రమైన ఆశ్రయంగా తన భూభాగంగా మార్చిందని కూడా ట్రంప్ ఇటీవల నూతన సంవత్సర ట్వీట్‌లో విమర్శించారు. న్యూయార్క్ జంట భవనాల కూల్చివేత దుర్ఘటన అనంతరం అమెరికా ప్రభుత్వం పాక్‌పట్ల చేపట్టిన ప్రతి చర్యలు ఏవీ ఫలించలేదని తాజా ప్రకటనలో అమెరికా అధికార్లు పేర్కొన్నారు.

బాంబు పేలుడులో 18 మంది మృతి



డెమాస్కస్ : ఇదిలిబ్‌లో రెబెల్స్ స్థావరాన్ని గురిపెట్టి సాగిన పేలుడులో 18 మంది మరణించారు. ఆదివారం నాడు ఈ పేలుడు సం భవించింది. అక్కడ గల పర్యవేక్ష క బృందం ద్వారా ఈ విషయం తెలిసింది. పేలినది కారు బాంబని అధికార్లు చెప్పారు. అగ్నాబ్ అల్ కాకాస్ రెబెల్ గ్రూపుపై గురిపెట్టి ఆ పేలుడు సాగింది. సిరియా దక్షిణ ప్రాంతంలోని ఇదిలిబ్ వద్ద తిరుగుబాటుదార్లతో ప్రభుత్వ సైనికులు పెద్ద ఎత్తున దాడులు సాగిస్తున్నారు. షింజార్ నగరాన్ని సిరియా సైన్యం తిరిగి స్వాధీ నం చేసుకోవడంతో ఆదివారం నాడు పెద్ద విజయం సొంత చేసుకుంది.

శీతల గాలుల మృతులు 24 మంది

ఖాట్మండు: నేపాల్‌లో విపరీతమైన చలిగాలుల ధాటికి మరి ఏడుగురు మరణించారు. దీనితో శీతగాలుల మృతుల సంఖ్య 24కు పెరిగింది. గత వారం రోజులుగా శీతగాలులు నేపాల్‌ను వణికిస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ నేపాల్‌లో వాటి ప్రభావం ఎక్కువగా ఉంది. మృతులలో 14 మంది సప్తారీ జిల్లాలోనే మరణించారు. రౌతాహత్, సిరాహ జిల్లాల్లో ఐదుగురు చొప్పున మరణించారు. మృతులలో ఏడు నెలల శిశువు కూడా ఉంది. సప్తారీ జిల్లాలో గత రాత్రి ఈ గాలుల తీవ్రంగ భరింపరానిదిగా ఉన్నట్లు అధికార్లు చెప్పారు. అక్కడ ఏడుగురు మరణించారు.

యావజ్జీవ జైలుపై జోక్యం చేసుకోబోం

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రేమించలేదని బాలికను హత్య చేసిన కేసులో నిందితుడికి కింది కోర్టు విధించిన జీవిత కారాగార శిక్ష విషయంలో జోక్యం చేసుకోబోమని హైకోర్టు స్పష్టం చేసింది. అనంతపురం జిల్లా గుత్తి కోర్టు తీర్పును సవాల్ చేస్తూ హంతకుడు చేసుకున్న క్రిమినల్ అప్పీల్‌ను న్యాయమూర్తులు చల్లా కోదండరామ్,సునీల్ చౌదరిలతో కూడిన డివిజన్ బెంచ్ డిస్మిస్ చేస్తూ తీర్పు చెప్పింది. పెద్దపప్పూరు మండలం చాగల్లు గ్రామానికి చెందిన అనిత (16)ను రామప్పగారి సోమశేఖర్ (21) ప్రేమించలేదని హత్య చేశాడు. బాలిక తాడిపత్రిలో ఇంటర్ మొదటి ఏడాది చదువుతుండగా అతని ప్రేమ ప్రతిపాదనను తిరస్కరించింది. దాంతో ఆమెను 2007లో కత్తితో 20 సార్లు పొడిచి హత్య చేశాడు. సోమశేఖర్‌కు జీవితఖైదు విధిస్తూ 2011లో అరో అదనపు సెషన్స్ కోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పును కొట్టేయాలని హైకోర్టును ఆశ్రయించిన సోమశేఖర్‌కు చుక్కెదురైంది. బాలికను ప్రేమించమని వేధించడమే కాకుండా, పథకం ప్రకారమే కత్తి తెచ్చుకుని బాలికను ప్రేమోన్మాది 20 సార్లు పాశవికంగా పొడిచాడంటే క్షణికావేశంలో చేసినట్లు అవ్వదని హైకోర్టు స్పష్టం చేసింది. జీవిత ఖైదును అమలు చేయాల్సిందేనంటూ హంతకుడి అప్పీల్ రిట్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

ఉపాధ్యాయ నియామకాలకు రిజర్వేషన్ల వారీగా దరఖాస్తులు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఉపాధ్యాయ నియామకాల పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు డిగ్రీ ఓపెన్ క్యాటగిరీలో 45 శాతం, ఎస్సీ,ఎస్టీ,బీసీ,వికలాంగ రిజర్వేషన్ల కేటగిరీల్లో 40 శాతం మార్కులు పొందిన వారి దరఖాస్తులను అనుమతించాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను హైకోర్టు రెండు రోజుల క్రితం మధ్యంతర ఆదేశాలిచ్చింది. కోర్టుకు వచ్చిన 30మంది అభ్యర్థుల దరఖాస్తులను మాత్రమే అనుమతించాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్,న్యాయమూర్తి శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులిచ్చింది.అయితే తాము వెలువరించే తుది తీర్పు లోబడి పిటిషనర్ల దరఖాస్తుల ఫలితం ఉంటుందని బెంచ్ స్పష్టం చేసింది. డిగ్రీలో ఆ మార్కులను ఓపెన్ క్యాటగిరిలో 50,రిజర్వేషన్ కేటగిరీలో45 శాతాలకు పెంపు వల్ల తాము నష్టపోతున్నామని కోర్టుకు వచ్చిన వారి వాదన.

క్రికెట్ అసోసియేషన్‌లో అవకతవకలు




మన తెలంగాణ/న్యూఢిల్లీ: తెలంగాణ ఏర్పడిన తరువాత బంగారు తెలంగాణ చేస్తా నని పదే పదే చెబుతున్న కెసిఆర్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో జరుగుతున్న అవకతవకలు గురించి పట్టించుకోవట్లేదని కాంగ్రెస్ మాజి ఎంపి విహెచ్ ఆరోపించారు. సోమవారం ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించిన విహెచ్ హైదరాబాద్ క్రికెట్ అసోసి యేషన్‌లో జరుగుతున్న అవకతవకల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఏర్పడిన తెలంగాణ క్రికెట్ అసోసియేషన్, హైదరా బాద్ క్రికెట్ అసోసియేషన్‌కి వ్యతిరేకంగా ఏర్పడిందని హెచ్.సి.ఎ అధ్యక్షు డు వివేక్ ఆరోపిస్తున్నారని, దీనిపై సిఎం కెసిఆర్ స్పందించాలని కోరారు. 10 సంవత్సరాలు ఇండియా టీం కు కెప్టెన్ గా పనిచేసిన అజహరుద్దీన్‌ని మీటింగ్ ఉందని పిలిచి లోనికి అనుమతించపోవడం విచారకరమన్నారు. శివలాల్ యాదవ్, వెంకటపతి రాజు, నేను వెళ్లి ధర్నా చేస్తే అప్పుడు ఆయన్నీ లోనికి అనుమతించారని విహెచ్ ఆరోపించారు. భారతదేశం ఒక సెక్యూలర్ దేశం కాబట్టి, ఒక ముస్లిం ను అవమానిస్తే ప్రపంచ దేశాలలో మనకు చెడ్డపేరు వస్తుంది అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కి చెందిన కొంతమంది పెద్దలు, డబ్బులు మొత్తం దోచుకుంటూ క్రొత్తవాళ్లకు అవకాశం ఇవ్వడం లేదంటూ విహెచ్ సంచలన ఆరోపణలు చేశారు. ఒక ఆటో వాలా కొడుకు కూడా క్రికెట్ ఆడగలగాలి అప్పడే ఆ ఆటకు సార్థకత ఉంటుందని స్పష్టం చేశారు. మొదట్లో విశాఖ ఇండస్ట్రీ షేర్ వాల్యూ 10 రూపాయలు గా ఉండేది, కాని ఆ తరువాత 100 రూపాయలు అయ్యి, ఇప్పుడు 800 గా ఉందని వెల్లడించారు.

కోడిపందాలపై సుప్రీంలో పిటిషన్

మన తెలంగాణ/న్యూఢిల్లీ: కోడిపందాలు నిర్వహించొద్దంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ బిజెపి నేత రఘురామకృష్ణంరాజు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అయితే సంక్రాంతి సందర్భంగా నిర్వహించే కోడి పందాలపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. మరోవైపు గోదావరి జిల్లాల్లో కోడి పందాల సందడి ఇప్పటికే మొదలైన విషయం తెలిసిందే. రఘురామ కృష్ణం రాజు తరపున సీనియర్ న్యాయవాది గల్లా సతీష్ సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా ఈ పిటిషన్ బుధవారం సుప్రీంకోర్టులో విచారణకు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. కోడి పందాలు తెలుగు ప్రజల సాంప్రదాయానికి చిహ్నమని, దాదాపు 400ల సంవత్సరాల నుండి సంక్రాంతి సందర్భంగా సాంప్రదాయంగా ఈ క్రీడ నిర్వహించబడుతుందని ఈ పిటిషన్‌లో స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు గతంలో కోళ్ళను అరెస్ట్ చేయవద్దని చెప్పినా కోళ్ళను, కోళ్ళను పెంచేవారిని ఎపి పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారని పిటిషన్లలో రఘురామకృష్ణ రాజు పేర్కొన్నారు. కోడిపందాలను జూదంగా పరిగణించకుండా, సాంప్రదాయంగా వస్తున్న క్రీడగా పరిగణించి, వాటిని నిర్వహించుకోవడానికి అనుమతించాలని ఈ పిటిషన్ లో అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు.

మండుతున్న ఆయిల్ ట్యాంకర్



పేలిపోతే భారీ నష్టం, 32 మంది గల్లంతు

బీజింగ్: తూర్పు చైనా తీరంలో సముద్రం వద్ద చైనా సర కుల రవాణా నౌకను ఢీ కొన్న ఇరాన్ చమురు ట్యాంకర్ గత రెండు రోజులుగా మంటలు ఎగ జిమ్ముతోంది. ఆ ట్యాంకర్ దీనివల్ల పేలిపోయే ప్రమాదం ఉందని అధికార్లు భయపడుతున్నారు. అదే జరిగితే పెద్ద పర్యా వరణ వినాశనం తప్పదు. ఈ ప్రమాదం తర్వాత గల్లంతయిన 32 మంది నావికు లను రక్షించ డానికి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. వారికి గుర్తు తెలియని ఒక వ్యక్తి మృత దేహం లభించింది. పనామియన్ పతాకంతో సాంచి చమురు నౌక నౌకా సిబ్బంది గల్లంతయ్యారు. వారి లో 30 మంది ఇరానియన్లు, ఇద్దరు బంగ్లా దేశీయులు. అందులో 136 వేల టన్నుల చమురు రవాణా అవుతోంది. 274 మీటర్ల సాంచి పేలిపోతే సహాయక చర్యలకు అనేక నౌకలను రంగంలోకి చైనా దించింది.

భారతీయుడికి రూ.21 కోట్ల లాటరీ




దుబాయి: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో భారత జాతీయుడు ఒకరు 12 మిలియన్ దిర్హాంలను గెలిచి హఠాత్తుగా కోటీశ్వరుడు అయిపోయాడు. ఇది 3.2 మిలియన్ డాలర్లతో సమానం. అబుదాబిలో ఇది చరిత్రలో ఎన్నడూ లేనంత అతిపెద్ద లాటరీ సొమ్ము. 42 ఏళ్ల హరికిషన్ వి నాయర్ దుబాయిలోని ఒక సంస్థలో వ్యాపారాభివృద్ధి వ్యవహారాల మేనేజర్‌గా పనిచేస్తున్నారు. 2002 నుంచి ఆయన అక్కడ నివసిస్తున్నారు. నిన్న 'బిగ్ టికెట్ రాఫిల్ డ్రా'లో ఈ భారీ మొత్తం గెలిచారు. కేరళకు చెందిన నాయర్ ఇంతకు ముందు రెండు సార్లు ఆ టికెట్ కొన్నానని, ఈ సారే అనూహ్య ఫలితం వచ్చిందని అన్నారు. ప్రపంచ పర్యటన జరపాలని కోరుకునేవాడినని ఇప్పుడది తీరబోతోందని సంతోషం వ్యక్తం చేశాడు.

ట్రంప్ టవర్‌లో మంటలు

న్యూయార్క్: మాన్‌హట్టన్‌లోని ట్రంప్ టవర్‌పై మంటలు ఎగజిమ్మే దృశ్యాలు కనపడినట్లు ఈ నగర అగ్ని మాపక శాఖ అధికార్లు తెలిపారు. ఆ బహుళ అంతస్థుల భవనం పై అంతస్థులో ఉదయం 7 గంటలకు మంటలు లేచినట్లు వారు తెలిపారు. గగన వీక్షణల్లో భవనంపైన అగ్నిమాపక సిబ్బంది కదలికలు కనిపించాయి. ఇతర వివరాలు వెంటనే తెలియరాలేదు. ఆ భవనంలో అనేక విలాసవంతమైన అపార్టుమెంట్లు, వ్యాపార కేంద్రాలు ఉన్నాయి.

ప్రభుత్వ బకాయిలు రెట్టింపు

విద్యుత్ సంస్థలపై పెను భారం



మన తెలంగాణ/హైదరాబాద్: వివిధ ప్రభుత్వ సంస్థల కార్యాలయాలు విద్యుత్‌ను వినియోగించుకుని సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి. చివరకు అవి విద్యుత్ సంస్థలకు భారంగా మారాయి. రాష్ట్ర విభజన సమయానికి ఉన్న బకాయిలు ఈ మూడున్నరేళ్ళలో రెట్టింపయ్యాయి. అన్ని వర్గాలకు నిరంతరాయ విద్యుత్‌ను సరఫరా కోసం ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకుంది. పలు ఎక్స్చేంజిల నుంచి డిస్కంలు విద్యుత్‌ను సమకూర్చుకున్నాయి. రాష్ట్ర ఆవిర్భావ సమయానికి డిస్కంలకు ప్రభుత్వ సంస్థల బకాయిలు రూ.1464 కోట్లుగా ఉంటే ఇప్పుడు అది రూ.3,500 కోట్లకు చేరుకుంది. ప్రధానంగా పంచాయతీరాజ్ శాఖ బకాయిలే రూ.2,000 కోట్లు దాటాయి. గ్రామ పంచాయతీల బకాయిలు తొలుత రూ.700 కోట్లు ఉంటే ఇప్పుడు మూడు రెట్లు పెరిగింది. మొత్తం రూ.3,500 కోట్ల బకాయిల్లో రూ.2,000 కోట్లకు మించిన బకాయిలు గ్రామ పంచాయతీలవే. ఇరిగేషన్ శాఖ బకాయిలు కూడా రూ.400 కోట్లకు చేరుకున్నాయి. అవి అంతకు ముందు రూ.54 కోట్లు మాత్రమే. దీనికి తోడు ఎత్తిపోతల పథకాల బకాయిలు కూడా రూ.89 కోట్ల నుంచి రూ.520 కోట్లకు చేరాయి. జలమండలి బకాయిలు మాత్రం సగానికి సగం తగ్గడం విశేషం. తొలుత రూ.363 కోట్లు ఉండగా, తాజాగా రూ.126 కోట్లకు చేరాయి. గతంలో ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుకు బిల్లులు చెల్లించని కారణంగా కరెంటు సరఫరాను నిలిపివేశారు. దీంతో ఈ బాకీ కొంత వసూలైనట్లు సమాచారం. పలు సందర్భాల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వద్ద బకాయిలు ఇప్పించాలని విద్యుత్ సంస్థలు కోరాయి. బకాయిలు తగ్గకపోగా, రెట్టింపు కావడం విశేషం. మరో వైపు విద్యుత్ సంస్థల ఖర్చులు కూడా పెరిగాయి. చార్జీల పెంపు లేకపోవడం, ఖర్చులు పెరగడానికి తోడు ప్రభుత్వ సంస్థల బకాయిలు పేరుకుపోవడం గుదిబండగా మారింది.

బకాయిల వివరాలిలా ఉన్నాయి

క్ర.స	శాఖ	2.6.14 నాటికి ఉన్న బకాయిలు(కోట్లలో)	తాజా బకాయిలు (రూ. కోట్లలో)
1.	పంచాయతీరాజ్	769	2186
2.	మునిసిపాలిటీలు	129	189
3.	కార్పోరేషన్లు	7	22
4.	జిహెచ్ఎంసి	4	1
5.	జలమండలి	363	126
6.	ఇరిగేషన్ శాఖ	54	407
7.	ఎత్తిపోతల పథకాలు	89	520
8.	హోంశాఖ	16	18
9.	ఇతర ప్రభుత్వ శాఖలు	33	41
	మొత్తం	రూ.1,464 కోట్లు	రూ.3,510 కోటు

రైల్వే లోకో రన్నింగ్ స్టాఫ్‌కు ఊరట

ఉద్యోగం నుంచి తొలగించే నిబంధన సవరణ

మన తెలంగాణ / హైదరాబాద్ : రైల్వేలోని లోకో రన్నింగ్ స్టాఫ్ 'సిగ్నల్ పాసింగ్ ఎట్ డేంజర్' (ఎస్‌పిఎడి) కేసులలో నిబంధనలను సవరిస్తూ రైల్వే బోర్డు సోమవారం ఉత్తర్వులను జారీ చేసింది. లోకో రన్నింగ్ స్టాఫ్‌పై సిగ్నల్ దాటిన (ఎస్‌పిఎడి) కేసులు నమోదైనప్పుడు మొత్తం పరిస్థితులను పరిగణలోకి తీసుకోవాలని, ఉద్యోగం నుంచి తొలగించే చర్యలు కాకుండా వివిధ శిక్షలు విధించాలని, సిబ్బందికి తగిన నైపుణ్య శిక్షణ ఇవ్వాలని రైల్వే బోర్డు సూచించింది. విపరీతమైన, ప్రత్యేకమైన సందర్భాలల్లో మాత్రమే ఉద్యోగ తొలగింపు శిక్షను విధించాలని రైల్వే బోర్డు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. గతంలో లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు రైలు నడిపే సమయంలో ఒక మిల్లీ మీటర్ సిగ్నల్ దాటినా రైల్వే బోర్డు ఎస్‌పిఎఆర్ కేసుగా పరిగణించేదని, ఆ అతిక్రమణ ఏ సందర్భంలో జరిగిందో విచారించకుండా, ఏకపక్షంగా ఉద్యోగం నుండి తొలగింపు శిక్ష విధించేదని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు.

కార్మిక యూనియన్ల హర్షం : రైల్వే బోర్డు ఉత్తర్వుల పట్ల పలు రైల్వే ఉద్యోగ, కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. గతంలో సిగ్నల్ క్రాస్ కేసుల్లో లోకో స్టాఫ్ తీవ్ర మానసిక ఒత్తిడి, అశాంతికి గురయ్యేవారని, ప్రస్తుతం రైల్వే బోర్డు ఇచ్చిన మార్గదర్శకాల వల్ల వారికి ఉపశమనం కలు గుతుందని రైల్వే బోర్డు ఉత్తర్వుల అఖిలభారత రైల్వే మెన్ ఫెడరేషన్ (ఎఐఆర్ఎఫ్),దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూని యన్ (ఎస్‌సిఆర్ ఎంయు) నాయకులు సిహెచ్. శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇది తమ యూనియన్లు సాధించిన గొప్ప విజ యమని పేర్కొన్నారు. రైల్వే బోర్డు ఉత్తర్వుల వల్ల రైల్వేలోని1.6 లక్ష ల మంది లోకో రన్నింగ్ స్టాఫ్‌కు ఊరట లభించి ప్రశాంతంగా విధు లు నిర్వర్తించేందుకు అవకాశం కలిగిందని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ (ఎన్ఎఫ్ఐఆర్),ఎస్‌సిఆర్ ఎంప్లాయిస్ సంఘ్ (ఎస్ సిఆర్ ఇఎస్) అధ్యక్షులు జి.ప్రభాకర్ ఆంద్రూ ఒక ప్రకటనలో తెలిపారు.

అశోక్ కుమార్ పదవీ బాధ్యతలు



మన తెలంగాణ/ న్యూఢిల్లీ: ఢిల్లీలోని తెలంగాణ భవన్ నూతన ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్‌గా జి.అశోక్ కుమార్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. 1991 అఖిల భారత సర్వీసెస్‌కు చెందిన అశోక్ కుమార్ దేశంలోని వివిధ విభాగా ల్లో అనేక హోదాల్లో సమర్థవంతంగా తన సేవలందించారు. ప్రస్తుతం తెలంగాణ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి. అశోక్ కుమార్‌కు తెలంగాణ భవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరి, సహాయక కమిషనర్ జి. రామ్మోహన్, పలువురు తెలంగాణ భవన్ అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. దేశంలోని వివిధ విభాగాల్లో సమర్థవంతమైన అధికారిగా జి. అశోక్ కుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మన్ననలను అందుకున్నారు. హోదా లో ఆయన ప్రవేశపెట్టిన ఎయిర్ క్రాఫ్ట్ ఆక్సిడెంట్స్ ఇన్విస్టిగేషన్ బ్యూరో (ఎఐబి) ఇప్పటికీ విజయవంతంగా కొనసాగుతోంది.

రైళ్ల ఆలస్యం తగ్గుదలకు కృషి



మన తెలంగాణ / హైదరాబాద్ : భద్రత, సమయపాలన మెరుగుల ప్రథమ ప్రాధాన్యతగా భావించి రైళ్ళ ఆలస్యానికి కారణమయ్యే వ్యవస్థాగత వైఫల్యాల తగ్గుదల కోసం కృషి చేయాలని దక్షిణమధ్యరైల్వే జనరల్ (ఎస్‌సిఆర్) మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ అన్నారు. వెల్డింగ్ వైఫల్యాలు, రైళ్ళు పట్టాలు తప్పడం, లెవెల్ క్రాసింగుల వద్ద సంభవించే ప్రమాదాలపై అధికారులు అన్ని కోణాల్లో స్వయంగా పర్యవేక్షించాలని ఆయన సూచించారు. భద్రత, సమయపాలన, సరుకు రవాణ మెరుగుదల తదితర అంశాలపై జనరల్ మేనేజర్ సోమవారం రైల్ నిలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డివిజన్ రైల్వే మేనేజర్లతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ డివిజనల్ రైల్వే మేనేజర్లు క్షేత్ర స్థాయి తనిఖీలు నిర్వహించి ట్రాక్ నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి వారికి కల్పిస్తున్న సదుపాయాలను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెరిచిన గేట్ల వద్ద జరిగే ప్రమాదాలను తగ్గించడానికి, భద్రతా సిబ్బందికి సరైన సలహాలిచ్చి కచ్చితంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవడం ద్వారా రైళ్ళు సాఫీగా నడిచేలా అధికారులు కృషి చేయాలన్నారు. డిఆర్ఎంలు సరుకు రవాణ ఎగుమతుల లక్ష్య సాధనకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉంటూ సమయస్ఫూర్తిని ప్రదర్శించి వృత్తిలో అంకిత భావంతో పనిచేసిన ఏడుగురు సిబ్బందికి వినోద్ కుమార్ యాదవ్ 'మ్యాన్ ఆఫ్ ద మంత్' అవార్డులను అందజేశారు. సమావేశంలో ఎస్‌సిఆర్‌లోని వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నదుల అనుసంధానం వల్లే రాష్ట్రం సస్యశ్యామలం

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

పోలవరం: రాష్ట్రంలో నదులు అనుసంధానం చేపట్టి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గోదావరి, పెన్నా, నాగావళి, వంశధార నదులు అనుసంధానం వల్ల రాష్ట్రానికి సాగు, తాగునీటి కొరత తీరడమే కాకుండా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. సోమవారం పోలవరం ప్రాజెక్టును సందర్శించిన ఆయన పనుల ప్రగతిని పరిశీలించారు. అగ్రిగేట్ కూలింగ్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఎగువ కాపర్ డ్యామ్ జట్ గ్రౌటింగ్ పనులకు పూజలు నిర్వహించారు. స్పిల్‌వే, ఎగువ కాపర్ డ్యామ్, డయాఫ్రం వాల్, గేట్ల తయారీ పనులను పరిశీలించారు. పనుల ప్రగతిని ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ, వైసిపి పోలవరం ప్రాజెక్టును అడ్డుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజలను రెచ్చగొట్టే ధోరణితోనే కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర చేపట్టిందని ఆరోపించారు. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద పనులు వేగం పుంజుకున్నాయని తెలిపారు. కొత్త అగ్రిగేటర్ కూలింగ్ ప్లాంట్ వల్ల రోజుకు 5000 వేల క్యూబిక్‌మీటర్ల కాంక్రీట్ పనులు చేయడానికి వీలవుతుందని వెల్లడించారు.

మర్మాంగంతో ట్రాక్టర్‌ను లాగిన సాధువు

అలహాబాద్ : ఓ సాధువు తన మర్మాంగానికి తాడును కట్టి ట్రాక్టర్‌ను లాగి రికార్డు సృష్టించాడు. అలహాబాద్‌లో నిర్వహించిన మాఘ్ మేళాలో ఆ సాధువు ఈ సాహసం చేశాడు. ఈ విన్యాసం ద్వారా తన ఆధ్యాత్మిక శక్తిని చాటుకున్నట్టు ఆ సాధువు తెలిపాడు. సాధువు చేసిన సాహసాన్ని అక్కడ ఉన్న వారు మెచ్చుకున్నారు. 2014లో సాధువు డజన్ల కొద్ది ఇటుకలను తన మర్మాంగానికి కట్టుకొని ప్రదర్శన ఇవ్వగా, 2016లో ఇంకో సాధువు తన మర్మాంగానికి తాడు కట్టి బండ రాళ్లను లాగాడు.

ఆస్ట్రేలియా ఓపెన్ నుంచి విక్టోరియా అజారెంకా నిష్క్రమణ



మెల్బోర్న్: తన కొడుకును అప్పగించాలన్న వ్యాజ్యాన్ని కొనసాగిస్తున్న మాజీ టెన్నిస్ ఛాంపియన్ విక్టోరియా అజారెంకా సోమవారం ఆస్ట్రేలియా ఓపెన్ నుంచి నిష్క్రమించింది. రెండుసార్లు విజేతగా నిలిచిన ఆమెకు ఈ ఏడాది మెల్బోర్న్‌లో జనవరి 15 నుంచి ఆరంభమయ్యే గ్రాండ్‌స్లామ్‌లో ఆడడానికి వైల్డ్ కార్డు లభించింది. 'ఈ ఏడాది ఆస్ట్రేలియాకు అజారెంకా పయనించకపోవడం దురదృష్టకరం' అని టోర్నమెంటు డైరెక్టర్ క్రైగ్ టిలే ట్వీట్ చేశారు. 'ఆస్ట్రేలియా ఓపెన్ ఆమె ఫేవరేట్ టోర్నమెంటు. వచ్చే ఏడాది ఆ టోర్నమెంటులో ఆడేందుకు ఆమె ఎదురుచూస్తోంది' అని కూడా ట్వీట్‌లో ఆయన రాశారు. ఆమె కుమారుడు లియో కస్టడీ కేసు విచారణ పూర్తయ్యేవరకు కాలిఫోర్నియా నుంచి వెళ్లడానికి లేదని ఆ కేసు విచారణ జరుపుతున్న లాస్ ఏంజిల్స్ జడ్జి చెప్పడంతో అజారెంకా గత ఏడాది మధ్య కాలంలో యుఎస్ ఓపెన్ కూడా ఆడలేదు. గత వారం ఆక్‌లాండ్ క్లాసిక్ నుంచి వైదొలిగాక ఆమె మెల్బోర్న్ పార్క్‌లో ఆడడం కూడా సందేహాస్పదమైంది. ఆస్ట్రేలియా ఓపెన్ నుంచి వైదొలిగిన ఈ బెలారస్ టెన్నిస్ క్రీడాకారిణి ఆ టోర్నమెంటులో తాజాగా అగ్రశ్రేణిలో ఉన్నారు. ఇటీవలే బిడ్డకు జన్మనిచ్చిన ఆమె గత వారం మేజర్ టోర్నమెంటులు ఆడలేదు.

పిబిఎల్ వల్ల ఎన్నో ఉపయోగాలు

భారత స్టార్ షట్లర్ పివి సింధు



హైదరాబాద్ : ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో భారత ప్లేయర్లు అద్భుతంగా రాణిస్తున్నారని భారత స్టార్ షట్లర్ పివి సింధు అభిప్రాయపడింది.పిబిఎల్ ప్రామాణికత రాను రాను మెరుగౌతోందని ఆమె తెలిపింది. ప్రపంచంలో అత్యున్నత ప్లేయర్లు పిబిఎల్‌లో ఆడేందుకు రావడంతో మన ప్లేయర్లకు గొప్ప వరమని పేర్కొంది. యువ క్రీడాకారులు కష్టపడితే భవిష్యత్తు ఉంటుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేసింది. సీనియర్లతో ఆడితే త్వరలోనే ఆటలోని మెలుకువలు నేర్చుకునేందుకు అవకాశం చిక్కుతుందని ఆమె పేర్కొంది. తన విషయంలో 2017వ సంవత్సరం ఎంతో గొప్పగా గడిచిందని సింధు సంతోషం వ్యక్తం చేసింది. ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోడానికి అవకాశం కలిగిందని ఆమె తెలిపింది. రియో ఒలింపిక్స్‌లో రజత పథకం సాధించిన నాటి నుంచి తనపై అంచనాలు పెరిగాయని, తద్వారా బాధ్యతలు కూడా పెరిగాయని సింధు పేర్కొంది. కాల క్రమంలో వాటికి తాను అలవాటు పడ్డానని, అంచనాలను అందుకునేందుకు ప్రయత్నిస్తున్నానని సింధు పేర్కొంది. పరిపూర్ణత వచ్చే వరకు సాధన చేయడం ఒక్కటే మార్గమని ఆమె స్పష్టం చేసింది.

ఐపిఎల్‌కు దక్షిణాఫ్రికా ఆతిథ్యం?



న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)ను మరోసారి విదేశంలో నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఇది ఈ ఏడాది జరిగే సీజన్‌కుకాక వచ్చే ఏడాదికి. 2019 ఐపిఎల్ సీజన్‌ను దక్షిణాఫ్రికాలో నిర్వహించేందుకు చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఐపిఎల్ 12వ సీజన్‌ను దక్షిణాఫ్రికాలో నిర్వహించాలని యోచిస్తున్నారట. ఇందుకు సఫారీ బోర్డుతో నిర్వాహకులు చర్చలు జరపగా సానుకూల స్పందన వచ్చినట్లు సమాచారం. 2009లోనూ ఎన్నికల కారణంగా ఐపిఎల్ 3వ సీజన్‌కు దక్షిణాఫ్రికా ఆతిథ్యం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఐపిఎల్ 11వ సీజన్ ఏప్రిల్ 4న ప్రారంభమై మే 31తో ముగియనుంది. ఈ నెల 27, 28 తేదీల్లో ఆటగాళ్ల వేలం బెంగళూరులో జరగనుంది.



ఫెదరర్‌కు హాఫ్‌కప్

స్విట్జర్లాండ్‌కు మూడోసారి టైటిల్

పెర్త్: అందరి అంచనాలను తారుమారు చేస్తూ గతేడాది రెండు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన స్విట్జర్లాండ్ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ ఈ ఏడాదిలోనూ శుభారంభం చేశాడు. ప్రతిష్ఠాత్మక హాప్‌మన్ కప్‌లో సహచరురాలు బెలిండా బెన్సిచ్‌తో కలిసి అతను 17 ఏళ్ల తర్వాత స్విట్జర్లాండ్‌కు టైటిల్ అందించాడు. శనివారం జరిగిన ఫైనల్లో ఫెదరర్, బెన్సిచ్‌లతో కూడిన స్విట్జర్లాండ్ జట్టు 21తో అలెగ్జాండర్ జ్వెరెవ్, ఎంజెలిక్ కెర్బర్ సభ్యులుగా ఉన్న జర్మనీ జట్టును ఓడించింది. 30 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ టోర్నీలో స్విట్జర్లాండ్ విజేతగా నిలువడం ఇది మూడోసారి. 2001లో మార్టినా హింగిస్‌తో కలిసి ఫెదరర్ ఈ టోర్నీలో టైటిల్ నెగ్గగా... 1992లో జాకబ్ హసెక్, మాన్యుయెలా మలీవా తొలిసారి స్విట్జర్లాండ్‌ను ఛాంపియన్‌గా నిలబెట్టారు.
ఫైనల్లో పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో ఫెదరర్ 67 (4/7), 60, 62తో జ్వెరెవ్‌పై గెలిచి స్విట్జర్లాండ్‌కు 10 ఆధిక్యాన్ని అందించాడు. మహిళల సింగిల్స్‌లో కెర్బర్ 64, 61తో బెన్సిచ్‌ను ఓడించి స్కోరును 11తో సమం చేసింది. నిర్ణాయక మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లో ఫెదరర్‌బెన్సిచ్ జోడీ 43 (5/3), 42తో కెర్బర్‌జ్వెరెవ్ జంటను ఓడించి టైటిల్‌ను ఖాయం చేసుకుంది.

మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌ను 'బెస్ట్ ఆఫ్ త్రీ' ఫాస్ట్4 టెన్నిస్ సెట్స్ పద్ధతిలో నిర్వహించారు. సెట్‌లో తొలుత నాలుగు గేమ్‌లు గెలిచిన వారికి సెట్ దక్కుతుంది. స్కోరు 33తో సమంగా నిలవడంతో నిబంధనల ప్రకారం ఎనిమిది పాయింట్లున్న టైబ్రేక్‌ను నిర్వహించారు. తొలుత ఐదు పాయింట్లు గెలిచిన ఫెదరర్ జంటకు తొలి సెట్ దక్కింది. రెండో సెట్‌లో ఫెదరర్ జోడీ నాలుగు గేమ్‌లు గెలిచి విజయాన్ని ఖాయం చేసుకుంది.



యాషెస్ సిరీస్‌లో కెప్టెన్‌గా అత్యధిక పరుగులు

810 డి. బ్రాడ్‌మన్ 1936/37(9 ఇన్నింగ్స్)
732 డి. గోవర్ 1985(9)
687 ఎస్. స్మిత్ 2017(7)
680 డి. బ్రాడ్‌మన్ 1946/47(8)

ఆసీస్ ఘనవిజయం

- 123 పరుగులు, ఇన్నింగ్స్ తేడాతో చివరి టెస్టులో గెలుపు
- 4-0తో యాషెస్ సిరీస్ ఆసీస్ కైవసం
- ప్యాట్ కమిన్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'
- స్టీవ్ స్మిత్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'

సిడ్నీ: ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌ను ఆసీస్ కైవసం చేసుకుంది. సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో సోమవారం జరిగిన ఐదో టెస్టు చివరి మ్యాచ్‌ను ఆస్ట్రేలియా 123 పరుగులు, ఇన్నింగ్స్ తేడాతో ఇంగ్లాండ్‌పై విజయం సాధించింది. ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను 4–0 ఆధిక్యంతో దక్కించుకుంది. సిరీస్‌లో ఆస్ట్రేలియా వైట్‌వాష్ చేయడానికి ఒక్క టెస్టు మాత్రమే తగ్గింది. మెల్‌బోర్న్‌లో జరిగిన నాలుగో టెస్టు డ్రాగా ముగిసిన సంగతి తెలిసిందే. చివరి టెస్టులోనైనా పరువు దక్కించుకుందామన్న ఆశతో వైరల్ ఉదరకోశ వ్యాధితో చికిత్స పొందుతున్న ఇంగ్లాండ్ కెప్టెన్ జో రూట్ ఆసుపత్రి నుంచి వచ్చి బ్యాటింగ్ చేసినా ఫలితం దక్కలేదు. జోరూట్ ఎంతో చమటోడ్చి సిరీస్‌లో తన ఐదో అర్ధ శతకాన్ని కూడా నమోదు చేశాడు.
ఐదో టెస్టులో టాస్ గెలిచిన ఇంగ్లాండ్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. కమిన్స్ ధాటికి ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్ విలవిల్లాడారు. దాంతో ఇంగ్లాండ్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 346 పరుగులకే చేతులెత్తేసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా జట్టు మొదటి ఇన్నింగ్స్‌ను 7 వికెట్ల నష్టానికి 649 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఆస్ట్రేలియా జట్టులో బ్యాట్స్‌మెన్ ఖవాజా 171, ఎస్. మార్ష్ 156, ఎం.మార్ష్ 101, స్టీవ్ స్మిత్ 83, వార్నర్ 56 పరుగులతో రాణించారు. ఇక ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా బౌలర్లలో కమిన్స్ 39 పరుగులిచ్చి 4 వికెట్లు, 54 పరుగులిచ్చి లియోన్ 3 వికెట్లతో రాణించారు.
రెండో ఇన్నింగ్స్‌ను మొదలెట్టిన ఇంగ్లాండ్ మళ్లీ కమిన్స్ ధాటిని తట్టుకోలేకపోయారు. ఇంగ్లాండ్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 180 పరుగులకే ఆలౌట్ అయింది. దాంతో ఆస్ట్రేలియా 123 పరుగులు, ఇన్నింగ్స్ తేడాతో ఇంగ్లాండ్‌పై ఘన విజయం సాధించింది. 1993లో హెడింగ్లేలో 148 పరుగులు, ఇన్నింగ్స్ తేడాతో ఓటమి చవిచూసిన ఇంగ్లాండ్ జట్టుకు ఇప్పుడే మళ్లీ ఇంత పెద్ద ఓటమి ఎదురైంది. ఎనిమిది వికెట్లు తీసుకున్న ప్యాట్ కమిన్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు, 687 పరుగులు చేసి, అత్యధిక స్కోరు చేసిన ఇంగ్లాండ్ బ్యాట్స్‌మన్ దావిద్ మాలన్ కన్నా 300 ఎక్కువ పరుగులు చేసిన స్టీవ్ స్మిత్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది.

స్కోరు

ఇంగ్లాండ్ మొదటి ఇన్నింగ్స్: 346/10 (112.3 ఓవర్లు)
ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్: 649/7 డిక్లేర్డ్(193 ఓవర్లు)
ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్: 180/10(88.1 ఓవర్లు)

మా బౌలర్లు సమిష్టిగా రాణించారు



యాషెస్ సిరీస్‌లో భాగంగా సిడ్నీలో జరిగిన చివరి టెస్టులో మా బౌలర్ల ప్రతిభ అద్భుతం. వారు సమిష్టిగా రాణించారు. మిచెల్ స్టార్క్, జాన్ హాజెల్వుడ్, ప్యాట్ కమ్మిన్స్, స్పిన్నర్ నాథన్ లియోన్లు ఈ సిరీస్లో 20 కంటే ఎక్కువ వికెట్లు పడగొట్టారు. ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్లకు చుక్కలు చూపించారు. అయితే, 2013-14లో ఆస్ట్రేలియాలో జరిగిన యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా 5-0తో ఇంగ్లాండ్‌కు వైట్ వాష్ చేశారు. ఆ సిరీస్‌లో బౌలింగ్ చేసిన మిచెల్ జాన్సన్, ర్యాన్ హారిస్, పీటర్ సిథిల్, లియోన్ల క్వార్టెట్ కంటే ఇప్పటి బౌలర్లకు అనుభవం తక్కువ, అయినా 4–0తో సిరీస్‌ను కైవసం చేసుకునేలా చేశారు. ఇది ఎంతో అభినందనియమం. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్న కమ్మిన్స్ ఈ మ్యాచ్‌లో 39 పరుగులకు నాలుగు వికెట్లు తీసి, ఈ సిరీస్‌లో మొత్తం 24.65 సగటుతో 23 వికెట్లు తీసుకున్నాడని అతని బౌలింగ్ అమోఘమం. 74 టెస్టుల్లో 31.64 సగటుతో 290 వికెట్లు తీసిన లీయాన్, ఆల్ టైం ఆస్ట్రేలియన్ ఆఫ్ స్పిన్నర్, 'నాథన్ బౌలింగ్ అసాధారణమైంది.

–ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్

టి20 జట్టులో బెన్‌స్టోక్స్



న్యూఢిల్లీ: ఇంగ్లాండ్ క్రికెట్ స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్‌కు మరోసారి జట్టులో స్థానం లభించింది. స్థానం అయితే దక్కింది కానీ ఈ సారైనా బాగా ఆడతాడా లేదా అని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. యాషెస్ సిరీస్, ఆ తర్వాత ఆసీస్‌తో వన్డే సిరీస్ కోసం ఎంపిక చేసిన ఇంగ్లాండ్ జట్టులో చోటు సంపాదించుకున్న స్టోక్స్ ఆ తర్వాత యాషెస్‌లో ఆడని సంగతి తెలిసిందే. అలాగే వన్డే సిరీస్ జట్టు నుంచి అతన్ని తప్పిస్తున్నట్లు తాజాగా ఇంగ్లాండ్, వేల్స్ బోర్డు ప్రకటించింది కూడా. గత ఏడాది వెస్టిండీస్‌పై విజయం సాధించిన అనంతరం బ్రిస్టల్‌లో ఓ బార్‌కు వెళ్లిన స్టోక్స్ అక్కడ ఘర్షణ వివాదంలో చిక్కుకున్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. పోలీసుల నుంచి ఎలాంటి క్లియరెన్స్ రాకపోవడంతో ఇంగ్లాండ్ జట్టులో స్టోక్స్ స్థానం దక్కించుకున్నా మ్యాచులు ఆడలేకపోతున్నాడు. తాజాగా ఇంగ్లాండ్, ఆసీస్, న్యూజిలాండ్ మధ్య ఫిబ్రవరి 7 నుంచి ముక్కోణపు టి20 సిరీస్ జరగనుంది. ఈ సిరీస్ కోసం ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు స్టోక్స్‌కు జట్టులో స్థానం కల్పించింది. సిరీస్ జరిగే సమయంలో విచారణ ఉంటుందో, లేదో 48 గంటల్లోగా స్టోక్స్‌కు తెలియజేస్తామని పోలీసులు తెలిపారు. దీంతో జట్టులో స్థానం దక్కించుకున్న స్టోక్స్ పరిస్థితి ఆగమ్య గోచరంగానే ఉంది. స్టోక్స్ ఐపిఎల్‌కు కూడా అందుబాటులో ఉంటాడని ఆ దేశ బోర్డు తాజాగా ప్రకటించిన సంగతి తెలిసిందే.



- 72 పరుగుల తేడాతో టీమిండియా ఓటమి
- రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసి భారత్ నడ్డి విరిచిన వెర్నాన్ ఫిలాండర్
- 1-0తో దక్షిణాఫ్రికా ఆధిక్యం

విరాట్ సేనకు సఫారీల చెక్!

కేప్‌టౌన్: ఆతిథేయ దక్షిణాఫ్రికా జట్టు న్యూల్యాండ్స్ టెస్టులో పర్యాటక జట్టు టీమిండియాను 72 పరుగుల తేడాతో ఓడించింది. రెండో ఇన్నింగ్స్‌లో విరాట్ సేనను 135 పరుగులకే ఆలౌట్ చేసింది. దక్షిణాఫ్రికా జట్టు బౌలర్ వెర్నాన్ ఫిలాండర్ ఆరు వికెట్లు తీసుకుని చెలరేగిపోయాడు. అతడికి తోడు మోర్నే మోర్కెల్, కగిసో రబడా కూడా టీమిండియాకు కళ్లెం వేశారు. ఈ విజయంతో దక్షిణాఫ్రికా జట్టు మూడు టెస్టుల సిరీస్‌లో 1–0 ఆధిక్యతను దక్షిణాఫ్రికా జట్టు సాధించింది. 208 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన టీమిండియా జట్టును సఫారీ బౌలర్లు అడ్డుకున్నారు. ఫిలాండర్ బౌలింగ్‌ను భారత జట్టులోని టాప్, మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ ఎవరూ ఎదుర్కోలేకపోయారు. ఆదిలో టీమిండియా జట్టు మెరుగ్గానే కనిపించింది. మురళీ విజయ్ రెండు సార్లు డిఆర్‌ఎస్ ఉపయోగించుకుని ప్రయోజనాన్ని పొందాడు. కానీ శిఖర్ ధావన్ 16 పరుగులకు, విజయ్ 13 పరుగులకే అవుటయ్యాక భారత్ స్కోరు 30 వద్ద నిలిచింది. దాంతో విజయం మెల్లిగా దక్షిణాఫ్రికా జట్టువైపుకు మొగ్గు చూపడం మొదలైంది. నాలుగో వికెట్‌కు 32 పరుగుల భాగస్వామ్యాన్ని విరాట్ కోహ్లి(28), రోహిత్ శర్మ(10) నిలిపారు. ఫిలాండర్ చెలరేగక ముందు వారిద్దరు కొంత ఆశలు కల్పించారు.
తొలి ఇన్నింగ్స్‌లో అర్ధ శతకాన్ని చేసిన హార్దిక్ పాండ్య వికెట్‌ను రబడ తీయడంతో ఆట ప్రభావమంతంగా మారింది. కెప్టెన్ విరాట్ కోహ్లి దక్షిణాఫ్రికా జట్టును ఎదుర్కొనేలానే కనిపించాడు. కానీ రబడ అతడిని ఎల్‌బిడబ్ల్యు చేయడంతో టీమిండియా ఓటమి తథ్యమనిపించింది.
రెండో సెషన్‌లో రవిచంద్రన్ అశ్విన్(37), భువనేశ్వర్ కుమార్(13) కొంత మేరకు దక్షిణాఫ్రికా జట్టును ఎదుర్కొన్నారు. వారిద్దరూ కలసి 49 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయితే ఫిలాండర్ 42 ఓవర్‌లో తన తొలి బంతికే అశ్విన్‌ను ఔట్ చేశాడు. ఫిలాండర్ మహ్మద్ షమీ, జస్ప్రీత్ బుమ్రాలను కూడా ఫిలాండర్ పెవిలియన్ బాట పట్టించాడు. ప్లేర్ ఆఫ్ ద మ్యాచ్: వెర్నాన్ ఫిలాండర్.

స్కోరు:

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 286/10 (73.1 ఓవర్లు) డి. ఎల్గర్(సి)సాహా(బి)భువనేశ్వర్ 0, ఎ.మార్‌క్రమ్ (ఎల్‌బిడబ్ల్యు) (బి)భువనేశ్వర్ 5, ఆమ్లా(సి)సాహా(బి) 3, ఎబి ది విల్లియర్స్ (బి)బుమ్రా 65, డుప్లెసిస్(సి) సాహ(బి) హార్దిక్ పాండ్య 62, డికాక్ (సి)సాహా(బి)భువనేశ్వర్ 43, వెర్నాన్ ఫిలాండర్(బి) షమీ 23, కేశవ్ మహారాజ్(రనౌట్)(అశ్విన్) 35, రబడ(సి)సాహా(బి)అశ్విన్ 26, స్టెయిన్(నాటౌట్) 16, మోర్నే మోర్కెల్ (ఎల్‌బిడబ్ల్యు)(బి) అశ్విన్ 2. ఎక్స్‌ట్రాలు: 6, మొత్తం: 286.
వికెట్ల పతనం: 1–0, 2–7, 3–12, 4–126, 5–142, 6–202, 7–221, 8–258, 9–280, 10–286.
బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 19–4–87–4, షమీ 16–6–47–1, బుమ్రా 19–1–73–1, హార్దిక్ పాండ్య 12–1–53–1, అశ్విన్ 7.1–1–21–2.
భారత్ తొలి ఇన్నింగ్స్: 209/10 (73.4 ఓవర్లు) మురళీ విజయ్ (సి) ఎల్గార్(బి) ఫిలాండర్ 1, శిఖర్‌ధావన్ (సి అండ్ బి) స్టెయిన్ 16, ఛెటేశ్వర్ పుజారా (సి)డుప్లెసిస్(బి) ఫిలాండర్ 26, విరాట్ కోహ్లి(సి)డికాక్(బి) మోర్కెల్ 5, రోహిత్ శర్మ (ఎల్‌బిడబ్ల్యు)(బి)రబడ 11, అశ్విన్ (సి) డికాక్(బి)ఫిలాండర్ 12, హార్దిక్ పాండ్య (సి)డికాక్(బి)రబడ 93, వృద్ధిమాన్ సాహా(ఎల్‌బిడబ్ల్యు)(బి) స్టెయిన్ 0, భువనేశ్వర్ కుమార్(సి)డికాక్(బి) మోర్కెల్ 25, షమీ(నాటౌట్) 4, సస్ప్రీత్ బుమ్రా(సి)ఎల్గార్(బి)రబడ 2. ఎక్స్‌ట్రాలు: 14. మొత్తం: 209.
వికెట్ల పతనం: 1–16,2–18, 3–27, 4–57, 5–76, 6–81, 7–92, 8–191, 9–199, 10–209. బౌలింగ్: ఫిలాండర్ 14.3–8–33–3, స్టెయిన్ 17.3–6–51–2, మోర్కెల్ 19–6–57–2, రబడ 16.4–4–34–3, కేశవ మహారాజ్ 6–0–20–0.
దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 130/10 (41.2 ఓవర్లు) ఎయిడెన్ మర్‌క్రమ్ (సి)భువనేశ్వర్(బి) హార్దిక్ పాండ్య 34, డీన్ ఎల్గార్ (సి) సాహా(బి) హార్దిక్ పాండ్య 25, రబడ(సి)కోహ్లి(బి) షమీ 5, ఆమ్లా(సి)రోహిత్(బి)షమీ 4, ఎబి డివిల్లియర్స్ (సి)భువనేశ్వర్(బి)బుమ్రా 35, డుప్లెసిస్(సి)సాహ(బి) బుమ్రా 0, డికాక్(సి)సాహా(బి)బుమ్రా 8, ఫిలాండర్(ఎల్‌బిడబ్ల్యు)(బి)షమీ 0, కేశవ్ మహారాజ్ (సి)సాహా(బి)భువనేశ్వర్ 15, మోర్కెల్(సి) సాహా(బి)భువనేశ్వర్ 2, స్టెయిన్(నాటౌట్)0. ఎక్స్‌ట్రాలు: 2. మొత్తం: 130. **వికెట్ల పతనం:** 1–52, 2–59, 3–66, 4–73, 5–82, 6–92, 7–956, 8–122, 9–130, 10–130.
బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 11–5–33–2, బుమ్రా 11.2–1–39–3, షమీ 12–3–28–3, హార్దిక్ పాండ్య 6–0–27–2, రవిచంద్రన్ అశ్విన్ 1–0–3–0.
భారత్ రెండో ఇన్నింగ్స్: 135/10 (42.4 ఓవర్లు) మురళీ విజయ్ (సి) డివిల్లియర్స్(బి)ఫిలాండర్ 13, శిఖర్ ధావన్ (సి)క్రిస్ మోరీస్(బి)మోర్కెల్ 16, ఛటేశ్వర్ పుజారా (సి)డికాక్(బి)మోర్కెల్ 4, విరాట్ కోహ్లి (ఎల్‌బిడబ్ల్యు)(బి) ఫిలాండర్ 28, రోహిత్ శర్మ(బి) ఫిలాండర్ 10, వృద్ధిమాన్ సాహా (ఎల్‌బిడబ్ల్యు)(బి)రబడ 8, హార్దిక్ పాండ్య(సి) డి విల్లియర్స్(బి)రబడ 1, అశ్విన్ (సి)డికాక్(బి)ఫిలాండర్ 37, భువనేశ్వర్ కుమార్(నాటౌట్) 13, షమీ(సి) డుప్లెసిస్(బి)ఫిలాండర్ 4, బుమ్రా(సి)డుప్లెసిస్(బి) ఫిలాండర్ 0.
ఎక్స్‌ట్రాలు: 1. మొత్తం: 135. వికెట్లపతనం 1–30, 2–30, 3–39, 4–71, 5–76, 6–77, 7–82, 8–131, 9–135, 10–135.



బౌలింగ్: ఫిలాండర్ 15.4–4–42–6, మోర్కెల్ 11–1–39–2, రబడ 12–2–41–2, మహారాజ్ 4–1–12–0,

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.